సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 144

బుధవారం 8-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



బ్రిస్బేన్ టు నాగ్‌పూర్

రేపటి నుంచి బోర్డర్–గావస్కర్ ట్రోఫీ.. భారత్, ఆస్ట్రేలియా తీవ్ర సాధన - 12లో



మార్కెట్లో పాలసీ అప్రమత్తత

సూచీలకు రెండో రోజూ నష్టాలే.. సెన్సెక్స్ 221 పాయింట్ల పతనం - 13లో



2014 తర్వాతే అదానీ మ్యాజిక్

ప్రపంచంలో 609వ స్థానంలో ఉన్న అదానీ మోదీ ప్రధాని అయ్యాక 2వ స్థానానికి ఎగబాకారని రాహుల్‌గాంధీ విమర్శించారు.

వివరాలు 6లో ▸



జడ్జిగా గౌరి నియామకం సరైందే

మద్రాస్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా గౌరి నియామకం సరైనదేనన్న సుప్రీంకోర్టు.. ఆమెకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

వివరాలు 6లో ▸



ప్రపంచంలోనే తెలివైన విద్యార్థి

అసాధారణ తెలివితేటలు కలిగిన విద్యార్థిగా ఇండియన్ అమెరికన్ నటాషా పెరియనాయగం నిలిచింది.

వివరాలు 6లో ▸



ముగిసిన అంత్యక్రియలు

పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు జనరల్ ముషారఫ్ అంత్యక్రియలను కరాచీలో పూర్తిగా సైనిక లాంఛనాలతో నిర్వహించారు.

వివరాలు 6లో ▸

లక్షన్నర కోట్లు | లక్షకుపైగా జాబ్స్

రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు 'ఎస్‌ఐపీబీ' గ్రీన్ సిగ్నల్

ప్రత్యక్షంగా 1,03,075 మందికి ఉపాధి.. పరోక్షంగా మరిన్ని

- పలు భారీ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం
- నిర్దేశించుకున్న సమయంలోగా కార్యకలాపాలు ప్రారంభం కావాలి
- చేదోడుగా నిలవాలని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- రానున్న ప్రతి పరిశ్రమలో చట్ట ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే.. పవర్ ప్రాజెక్టులతో రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితి తెచ్చాం
- తీసుకునే భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు చెల్లింపులు
- ఇటు కరువు ప్రాంతాల రైతులకు మేలు.. అటు ప్రతి మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున రాష్ట్రానికి చెల్లించనున్న కంపెనీలు
- ఎస్‌జీఎస్‌టీ రూపంలో రాష్ట్రానికి రెవెన్యూ.. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కూడా
- భోగాపురంలో అత్యంత అధునాతన సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తద్వారా కొత్తగా 1,03,075 మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందనుండగా పరోక్షంగా మరింత మందికి ఉపాధి లభించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ అనకాపల్లి జిల్లాలో రూ.1.10 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పే న్యూ ఎనర్జీ పార్కుతోపాటు కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు, పలు రంగాల్లో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమలు స్థాపించే వారికి చేదోడుగా నిలవాలని ఈ సందర్భంగా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తై కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ప్రతి పరిశ్రమలో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని

మిగతా 2వ పేజీలో ▸

బతుకు శిథిలం

గుండె పగిలిన తుర్కియే, సిరియా | **6,200 దాటిన మృతులు** | ఇంకా శిథిలాల కింద వేలాది మంది







నాన్న.. లేరా: భూకంపం సృష్టించిన విలయంలో కళ్లెదుటే కన్నకూతురు శాశ్వతనిద్రలోకి జారుకుంది. శిథిలాల్లో ఆమె మృతదేహం చిక్కుకుపోయింది. ఆమె చేతిని పట్టుకుని అక్కడే స్థాణువై కూర్చుండిపోయాడా తండ్రి. టర్కీలోని ఖరామన్మరస్ ప్రాంతంలోనిదీ హృదయవిదారక దృశ్యం

6లో

ఎటు చూసినా శిథిలాలే. వాటికింద చితికిన బతుకులే. కుప్పలుగా శవాలే. వరుస భూకంపాలు తుర్కియే, సిరియాల్లో అంతులేని విధ్వంసం సృష్టించాయి. వేలాది భవనాలు కుప్పకూలడంతో వాటి శిథిలాలను తొలగించడం తలకు మించిన పనిగా మారింది. వాటికింద చిక్కుకున్నవారు కాపాడాలంటూ చేస్తున్న ఆక్రందనలు కలచివేస్తున్నాయి. మృతుల సంఖ్య ఇప్పటికే 6 వేలు దాటింది. శిథిలాలన్నింటినీ తొలగిస్తే అది మరింత భారీగా పెరిగేలా కన్పిస్తోంది.

శిథిలాల్లో ప్రసవం

తుర్కియే (టర్కీ), సిరియా భూకంపంలో గుండెపగిలే దృశ్యాలు వెలుగులోకి వస్తున్నాయి. సిరియాలోని అలెప్పో గ్రామీణ ప్రాంతంలో శిథిలాల మధ్య నెలలు నిండిన మహిళ ప్రసవించింది. కొత్తగా లోకాన్ని చూసిన ఆ పసిబాలుడ్ని సహాయ సిబ్బంది సురక్షితంగా బయటకు తీశారు. బాలుడి ప్రాణాన్ని కాపాడగలిగారు కానీ కన్న తల్లికి మాత్రం నూరేళ్లు నిండిపోయాయి. సహాయ సిబ్బంది ఒకరు ఆ పసిబాలుడ్ని బయటకు తీసుకువస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఒక విపత్తుని ఎదిరించి పురుడు పోసుకున్న ఆ బాలుడు సిరియన్లకు ఆశాకిరణంగా మారాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

ఇంటిపైనా 'ఎల్లో' విషం



టిడ్కో ఇళ్లపైనా 'ఈనాడు' ఓ అబద్ధాల కథనాన్ని అచ్చేసింది. నంద్యాలలో మొత్తం 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. జనవరిలో అన్ని వసతులతో కూడిన 2 వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. మిగిలిన 8 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి మౌలిక వసతుల పనులు జరుగుతుండగా.. 'పైన పటారం.. లోపల ఉసూరు' అంటూ ఈనాడు దుష్ప్రచారానికి తెగబడింది.

వివరాలు 2 ▸

అసత్యాలు.. అర్ధసత్యాలేనా?



గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలకు సంబంధించిన బిల్లులు చెల్లించట్లేదంటూ 'ఈనాడు' మరో తప్పుడు కథనం అచ్చేసింది. ఈ పనులకు సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన రూ.2 వేల కోట్ల గురించి కేంద్రాన్ని రామోజీ పల్లెత్తు మాట అనరు. ఆ విషయం దాచిపెట్టి.. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లింది.

వివరాలు 2 ▸

చాట్‌జీపీటీ వర్సెస్ గూగుల్ బార్డ్



తిరుగులేని ఆదరణతో దూసుకుపోతున్న చాట్‌జీపీటీకి పోటీగా గూగుల్ కూడా కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బోట్ 'బార్డ్'ను తీసుకొస్తోంది. ఈ విషయాన్ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు.

వివరాలు 6 ▸

ఇదండీ సంగతి



జేఈఈ మెయిన్ తొలి విడతలో
బాలుర హవా

100 స్కోర్ పాయింట్లు సాధించిన 20 మంది బాలురే


- వీరిలో సగం వరకు తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్ష రాసినవారే
- తొలి సెషన్ ఫలితాలు విడుదల చేసిన ఎన్టీఏ.. తొలి విడతకు 8.60 లక్షల మంది హాజరు
- రెండో సెషన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం.. ఏప్రిల్ 6 నుంచి 12 వరకు రెండో విడత పరీక్షలు



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లు, ఇతర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ తొలివిడత పరీక్షల ఫలితాల్లో బాలురు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 100 స్కోర్ పాయింట్లు సాధించిన 20 మందీ బాలురే కావడం గమనార్హం. 100 స్కోర్ పాయింట్లతో పాటు ఆ తర్వాత అత్యధిక స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థుల్లో సగం మంది వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పరీక్షలకు హాజరైనవారేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం విడుదల చేసింది. విద్యార్థుల మార్కుల ఆధారంగా స్కోర్ పాయింట్లతో ఈ ఫలితాలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల నుంచి వావిలాల చిద్విలాసరెడ్డి, దుగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, బిక్కిన అభినవ్ చౌదరి, ఎన్కే విశ్వజిత్, అభినీత్ మాజేటిలు 100 స్కోర్ పాయింట్లు సాధించినవారిలో ఉన్నారు. జనరల్‌లో 14 మంది, ఓబీసీల్లో

మిగతా 3వ పేజీలో ▸

3 ప్రముఖ ఆలయాలకు ట్రస్టు బోర్డులు



దేవదాయ శాఖ పరిధిలోని మూడు ప్రముఖ ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టు బోర్డులను నియమించింది. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ చైర్మన్‌గా ఐ.వి.రోహిత్, ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్‌గా ఎస్వీ సుధాకరరావును నియమించారు. బెజవాడ దుర్గమ్మ ఆలయ చైర్మన్‌గా కర్నాటి రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు.

10లో



జల్లికట్టులో అపశ్రుతి

చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో జరిగిన జల్లికట్టులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎద్దును నిలువరించే క్రమంలో తీవ్రగాయాలపాలై ఒకరు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు.

- వివరాలు 14లో

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

- మెక్‌కెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైవ్స్ నోయెల్ లెక్లెర్క్ కితాబు.. ఏపీని ఆదర్శంగా తీసుకుంటామని వెల్లడి
- 160 దేశాల్లో బంగాళదుంప ఆధారిత ఆహార ఉత్పత్తుల విక్రయం
- ఏపీ విధానాలు ఆయా దేశాల్లో అమలు చేసేలా కృషి.. 2030 నాటికి తమ క్షేత్రాల్లో సుస్థిర వ్యవసాయమే లక్ష్యం
- గుంటూరు జిల్లా నూతక్కి, కొత్తపాలెం, రేవేంద్రపాడుల్లో పర్యటించిన మెక్‌కెయిన్ ఫుడ్స్ బృందం

- వివరాలు 3లో

చిప్‌ల వేడికి చిప్‌తోనే చెక్!



మీ ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ఉన్నట్టుండి ఆగిపోతోందా? విపరీతంగా వేడెక్కి సక్రమంగా పనిచేయడం లేదా? లోపలున్న ఫ్యాన్లు, హీట్ సింక్‌లతో ప్రయోజనం ఉండట్లేదా? ఈ ప్రశ్నలన్నింటికీ మీరు అవునని జవాబు చెబుతుంటే ఈ కథనం మీ కోసమే. ఎందుకంటే.. ఫ్యాన్ల అవసరమే లేకుండా ఓ భారతీయ అమెరికన్... పీసీ, ల్యాప్‌టాప్‌లను చల్లబరిచేందుకు ఓ వినూత్న టెక్నాలజీని ఆవిష్కరించాడు కాబట్టి!

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకూ.. వేడికి అవినాభావ సంబంధం ఉంది. అవి పనిచేస్తుంటే ప్రాసెసర్ వేడెక్కుతూ ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆ వేడిని తొలగించకపోతే పీసీ, ల్యాప్‌టాప్‌ల పని సామర్థ్యం తగ్గడమే కాకుండా కొన్ని సందర్భాల్లో లోపలి సర్క్యూట్లు కాలిపోవచ్చు. ఈ సమస్యలను అధిగమించేందుకు తొలినాళ్ల నుంచి ఫ్యాన్లు ఉపయోగిస్తుండగా ఇటీవలి కాలంలో హీట్ సింకుల్లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. కానీ వాటితో ప్రయోజనం అంతంతగానే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే అమెరికా స్టార్టప్ సంస్థ ఫ్రోర్ సిస్టమ్స్ గత నెలలో జరిగిన కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ప్రదర్శించిన ఎయిర్‌జెట్ టెక్నాలజీ ఆధారిత పరికరం అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కూడా ఒక చిప్‌లాంటిదే. కాకపోతే వేడిని తొలగించేందుకే ఉపయోగపడుతుంది. కొన్ని ఎయిర్‌జెట్ చిప్‌లను కంప్యూటర్/ల్యాప్‌టాప్‌లలో ఏర్పాటు చేసుకుంటే అత్యంత సమర్థంగా వేడిని తొలగించుకోవచ్చని ఇండియన్–అమెరికన్, ఫ్రోర్ సంస్థ సీఈవో డాక్టర్ మాధవపెద్ది శేషు చెబుతున్నారు. డాక్టర్ సూర్య పి. గంటితో కలసి ఆయన ఫ్రోర్ సిస్టమ్స్‌ను స్థాపించారు.



ఎం.శేషు, గంటి సూర్య



వేడి పెరిగితే సమస్య ఏమిటి?

వేడిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే కంప్యూటర్ల సామర్థ్యం తగ్గిపోతుంది. అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాల్లోనూ మైక్రోప్రాసెసర్లు ఉపయోగిస్తున్నాం. వాటి వేగం పెరిగిన ప్రతిసారీ అవి ఉత్పత్తి చేసే వేడి కూడా ఎక్కువ అవుతుంది. నిపుణుల అంచనాల ప్రకారం ఇది గరిష్ఠంగా 70 శాతం వరకూ ఉండవచ్చు. పైగా 13 అంగుళాల సైజుండే అత్యాధునిక 4.8 గిగాహెర్ట్జ్ ప్రాసెసర్ నోట్‌బుక్ 56 వాట్ల విద్యుత్ ఖర్చు చేస్తోంది. దీనివల్ల ఎక్కువవుతున్న వేడిని ఫ్యాన్లు, హీట్‌సింక్, పైపుల్లాంటివి తొలగించలేవు. ఫలితంగా ప్రాసెసర్లు కాలిపోకుండా వాటి వేగాన్ని తగ్గించేలా కంపెనీలు ఏర్పాట్లు చేశాయి.

ప్రపంచంలోనే తొలిసారి వినూత్న పరిష్కారం

వేడి సమస్యను ఎదుర్కొనేందుకు ఫ్రోర్ సిస్టమ్స్ సిద్ధం చేసిన ఎయిర్‌జెట్ టెక్నాలజీ ప్రపంచంలోనే తొలి సాలిడ్ స్టేట్ కూలింగ్ టెక్నాలజీ. ఇందులో రెండు పొరలుంటాయి. పైనున్న పొరలో సూక్ష్మ రంధ్రాలు ఏర్పాటు చేశారు. కింద రాగితో చేసిన పొర ఉంటుంది. రెండింటికీ మధ్యలో కంపించే త్వచాల్లాంటివి ఉంటాయి. ఈ వైబ్రేటింగ్ మెంబ్రేన్స్ వేడిని గ్రహించినప్పుడు వేగంగా కంపిస్తాయి. ఫలితంగా అక్కడున్న వేడిగాలి ఒత్తిడికి గురై కిందనున్న రాగిపొర వద్దకు చేరుకుంటుంది. కొంత వేడిని ఈ రాగిపొర గ్రహిస్తుంది...మిగిలిన వేడిగాలి చిప్‌కు గొట్టంలాంటి ఏర్పాటు ద్వారా బయటకు ప్రయాణిస్తుంది. ఫ్యాన్లు చేసే పనే ఇక్కడ మెమ్స్ మెంబ్రేన్స్ చేస్తున్నాయన్నమాట.

ప్రత్యేకతలెన్నో..

ఎయిర్‌జెట్ టెక్నాలజీతో ఇప్పుడు రెండు చిప్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్‌జెట్ మినీ కేవలం 270 మిల్లీమీటర్ల వెడల్పు, 41.5 మిల్లీమీటర్ల పొడవు, 2.8 మిల్లీమీటర్ల ఎత్తు ఉంటుంది. కానీ ఒకే ఒక్క వాట్ విద్యుత్‌ను వాడుకుంటూ ఇది 5.25 వాట్లకు సరిపడా వేడిని తొలగించగలదు. కొంచెం పెద్దదైన ఎయిర్‌జెట్ ప్రో 31.5 మి.మీ. వెడల్పు, 71.5 మి.మీ. పొడవు ఉంటుంది. ఇది వాడే విద్యుత్ 1.75 వాట్లు కాగా.. తొలగించగల వేడి 10.75 వాట్లకు సరిపడా ఉంటుంది. ఈ రెండు చిప్‌ల నుంచి వెలువడే శబ్దం దాదాపుగా శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే ఇవి గరిష్ఠంగా 24 డెసిబెల్స్ స్థాయిలోనే శబ్దం చేస్తాయి. వీటి బరువు 13 నుంచి 22 గ్రాముల మధ్యే ఉండటం విశేషం. 13 అంగుళాల నోట్‌బుక్‌లో 4 ఎయిర్‌జెట్ మినీలను ఉపయోగిస్తే మైక్రోప్రాసెసర్ సామర్థ్యం 100 %వరకూ పెరుగుతుందని, 15 అంగుళాల నోట్‌బుక్‌లో 3 ఎయిర్‌జెట్ ప్రోలను వాడటం ద్వారా సామర్థ్యం 50% పెంచవచ్చని కంపెనీ చెబుతోంది. ఈ పరికరాలు డస్ట్ ప్రూఫ్ కావడం వీటి ప్రత్యేకత.

క్యూ కడుతున్న దిగ్గజ సంస్థలు..

ఫ్రోర్ సిస్టమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మైక్రోప్రాసెసర్ల తయారీ సంస్థ ఇంటెల్... భవిష్యత్తులో తాము తయారు చేయబోయే ల్యాప్‌టాప్‌లలో ఎయిర్‌జెట్ సాంకేతికతను ఉపయోగిస్తామని ప్రకటించింది. క్వాల్‌కాం... ఫ్రోర్ సిస్టమ్స్‌లో పెట్టుబడులు పెట్టింది. ప్రపంచంలోని 10 చిప్ తయారీ సంస్థల్లో ఐదు సంస్థలు ఇప్పటికే ఫ్రోర్ సిస్టమ్స్‌తో జట్టుకట్టాయి. అయితే ఎయిర్‌జెట్ మినీ, ప్రో ఇంకా ఉత్పత్తి దశలోనే ఉన్నందున వాటి ధరల వివరాలు తెలియరాలేదు.

– సాక్షి, హైదరాబాద్

క్లుప్తంగా...

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం (ఈనెల 8న) సచివాలయం మొదటి బ్లాక్‌లో క్యాబినెట్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నారు.

అంతర్జాతీయ పతక విజేతలకు నగదు పురస్కారాలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విజేతలు, వారి కోచ్‌లకు కేంద్రం అందించే నగదు పురస్కారాల దరఖాస్తు గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించినట్లు శాప్ ఎండీ ఎస్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గతంలో ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందని క్రీడాకారులకు, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు dbtyas&sports. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

తిరుమల: వివిధ రకాల ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు టీటీడీ విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆన్‌లైన్ ఆర్జిత సేవలైన (వర్చువల్ పార్టిసిపేషన్) కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్ల కోటాతోపాటు, ఈ సేవల ద్వారా లభించే దర్శన కోటాను ఫిబ్రవరి 9న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎలక్ట్రానిక్ డిప్ పద్ధతిలో ఆర్జిత సేవా టికెట్ల నమోదు కోసం 8న ఉదయం 10 గంటల నుంచి ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఇతర ఆర్జిత సేవా టికెట్లను 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. https://tirupatibalaji.ap.gov.in/ ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

న్యాయవాదులకు వరం 'లా నేస్తం'

న్యాయ శాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావు



న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవో

సాక్షి, అమరావతి: ఏపీ అమలు చేస్తోన్న డాక్టర్ వైఎస్సార్ లా నేస్తం, న్యాయవాదుల సంక్షేమ నిధి పథకాలు న్యాయవాదులను ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులను ఆదుకుంటున్నారని న్యాయశాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకర్‌రావు చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. లా నేస్తం, సంక్షేమ నిధి పథకాలతో న్యాయవాదులు పొందుతున్న ప్రయోజనాలను ఆయన వివరించారు. ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో జూనియర్ న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకోవడం కష్టమని, అలాంటి వారిని ఆదుకునేందుకే లా నేస్తం పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. 2019 అక్టోబర్ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద జూనియర్ న్యాయవాదికి నెలకు రూ.5 వేల చొప్పున మూడేళ్ల పాటు స్టైఫండ్ చెల్లిస్తున్నట్లు చెప్పారు. గత మూడున్నర ఏళ్లలో 65,537 మంది న్యాయవాదులకు రూ.34.39 కోట్లను స్టైపెండ్ రూపంలో చెల్లించామని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్ల కార్పస్‌ఫండ్‌తో సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామన్నారు. ఈ సంక్షేమ నిధి నుంచి అర్హులైన న్యాయవాదులకు వైద్య ఖర్చులు, లా పుస్తకాలు, మేజర్ ఆపరేషన్లు, ఇన్సూరెన్స్ వంటి అత్యవసరాలకు నిధులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ నిధి ద్వారా ఇప్పటివరకు 7,733 మంది న్యాయవాదులకు రూ.25 కోట్ల మేర సాయం చేసినట్లు చెప్పారు.

10 నెలలు.. రూ.వెయ్యి కోట్లు

- బెరైటీస్ ఆదాయంలో ఏపీ ఎండీసీ రికార్డు

సాక్షి, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీ ఎండీసీ) ఈ ఆర్థిక సంవత్సరంలో బెరైటీస్ ద్వారా కేవలం 10 నెలల కాలానికే రికార్డు స్థాయిలో రూ.వెయ్యి కోట్లు ఆర్జించినట్టు సంస్థ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి తెలిపారు. ఏటా 3 మిలియన్ టన్నుల బెరైటీస్ ఉత్పత్తి లక్ష్యానికి గానూ కేవలం 10 నెలల్లోనే ఏపీ ఎండీసీ 2.6 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించి రూ. వెయ్యి కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని చెప్పారు. విజయవాడలోని ఏపీ ఎండీసీ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో కలిసి మంగళవారం ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మంగంపేటలో మరో రెండు నెలల్లో వార్షిక లక్ష్యానికి అనుగుణంగా బెరైటీస్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. దీనికి అంతర్జాతీయ బ్రాండింగ్ తెచ్చేలా సీఎం ఆదేశాల మేరకు ఇటీవలే అమెరికాలోని పలు చమురు ఉత్పత్తి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు.

అసత్యాలు.. అర్ధసత్యాలేనా?
పూర్తి నిజాలు రాయరెందుకు?

పైసలూ పోయే.. పరువూ పోయే!' అంటూ తప్పుడు కథనం

- ఈ పనులకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సివుంది రూ.2 వేల కోట్లు
- ఈ విషయం దాచిపెట్టి... రాష్ట్ర ప్రభుత్వం రూ.520 కోట్లు చెల్లించట్లేదని రాతలు
- టీడీపీ హయాంలో గ్రామాల్లో వేసిన సీసీ రోడ్ల బిల్లులు చెల్లించింది ఈ సర్కారే
- ఆ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.4,481 కోట్లను మూడేళ్లలో చెల్లించిన జగన్ ప్రభుత్వం
- అప్పట్లో ఫామ్‌పాండ్స్ నిర్మాణం పేరుతో రూ.వేల కోట్ల మేర ఉపాధి నిధుల దోపిడీ
- అదే ఉపాధి నిధులతో ఈ ప్రభుత్వం వచ్చాక 36 వేలకు పైగా శాశ్వత భవనాల నిర్మాణం
- అప్పట్లో బకాయిలనూ ప్రశ్నించలేదు... ఇప్పుడు కేంద్రాన్నీ పల్లెత్తు మాట అనరు

ఇదీ 'ఈనాడు' తీరు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలకు సంబంధించి గత ఏడాది ఆగస్టు రెండో వారం వరకు సమర్పించిన అన్ని బిల్లులనూ ప్రభుత్వం అప్పుడే చెల్లించేసింది. ఆ తరువాత చేపట్టిన భవనాలకు సంబంధించి రూ.520 కోట్ల మేర బిల్లులను చెల్లించాల్సి ఉందన్నది 'ఈనాడు' కథనం. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు మన ప్రభుత్వమే కదా అన్న ఉద్దేశంతో పనులు చేశారని... కానీ వారికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని రామోజీరావు వారిపై ఎక్కడలేని ప్రేమా ఒలకబోశారు కూడా!!. కానీ ఈ నిర్మాణాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇంకా రూ.2,000 కోట్ల నిధులు రావాల్సి ఉంది. మరి అందులో వీరికి చెల్లించాల్సింది 'ఈనాడు' లెక్కల ప్రకారం చూసుకున్నా నాలుగో వంతే కదా? మరి కేంద్రం ఇవ్వటం లేదన్న విషయాన్ని రామోజీ ఎందుకు ప్రస్తావించరు? ప్రభుత్వ భవన నిర్మాణాల బిల్లుల చెల్లింపునకు సహజంగానే కొంత సమయం పడుతుంది. నిజం చెప్పాలంటే రాష్ట్రంలో గ్రామీణ భవనాలకు సంబంధించిన బిల్లులు ఆరు నెలలుగా మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. టీడీపీ హయాంలో చంద్రబాబు తనయుడు లోకేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండగా.. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించలేదు. అప్పట్లో ఏమాత్రం ప్రశ్నించని 'ఈనాడు'.. ఇప్పుడు కేంద్రాన్ని పల్లెత్తు మాట అనకుండా మొత్తం తప్పంతా రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నట్లు రాయటమే విచిత్రం.

టీడీపీ ఎగ్గొట్టిన రూ.4,481 కోట్లను చెల్లించిందెవరు?

టీడీపీ హయాంలో 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు చంద్రబాబు తనయుడు లోకేశ్ మెటీరియల్ కేటగిరీలో రాష్ట్రానికి వచ్చే నిధుల కంటే 10 రెట్లు ఎక్కువ విలువైన పనులను టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టారు. వీటిలో సిమెంట్ రోడ్లతో పాటు ఇతర పనులను సైతం పార్టీ కార్యకర్తలకు అప్పగించేశారు. ఎన్నికలకు ఏడాది, ఏడాదిన్నర ముందు ఉపాధి మెటీరియల్ కేటగిరీలో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన పనులను కట్టబెట్టగా... వాటిలో మూడో వంతు కూడా పనులు జరగలేదు. మరోవైపు పనులు పూర్తిచేసిన వారికి బిల్లులూ చెల్లించలేదు. అప్పట్లో చేసిన పనులకు దాదాపు రూ.4,481 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉండగా.. ఆ తరవాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వమే ఆ బిల్లులను పూర్తిగా చెల్లించింది.

ఫామ్ పాండ్స్ పేరిట దోచేసినా..

చంద్రబాబు హయాంలో ఉపాధి హామీ పథకం నిధులతో పంట కుంటలు (ఫామ్ పాండ్స్) పేరుతో రైతుల పొలాల్లో పొక్లెయిన్లతో గుంతలు తవ్వించారు. వాటినే కూలీలతో తవ్వించినట్టు చూపించారు. ఒక్కో గుంతకు రూ.5 వేల చొప్పున పొక్లెయిన్ల యజమానులకు చెల్లించి.. కూలీలతో చేయించామంటూ ఒక్కొక్క గుంతకు రూ.లక్ష వరకు బిల్లులు దోచేశారు. టీడీపీ అధిష్టానమే ఈ మేరకు ప్రణాళిక రచించి రూ.వేల కోట్లను పార్టీ నాయకులకు దోచిపెట్టింది. అప్పట్లో దాదాపు తొమ్మిదిన్నర లక్షల పంట కుంటలు తవ్వినట్టు రికార్డులు ఉండగా.. ఇప్పుడు అందులో పదో వంతు కూడా కనబడటం లేదని అధికారులే చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో వేసిన సిమెంట్ రోడ్లూ అక్రమాల్లోనే కూరుకుపోయాయి. నాటి సీసీ రోడ్లు నాణ్యత లేక పాడయ్యాయి. సాధారణంగా సిమెంట్ రోడ్లు 20 ఏళ్ల పాటు నాణ్యంగా ఉండాలి. రెండు, మూడేళ్లకే అవన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి.



బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం ఈపూరు లో ఎన్నికలకు ముందు రూ. 31 లక్షలు అంచనా వ్యయం తో 2019 ఫిబ్రవరి లో నిర్మించిన సుమారు 200 మీటర్ల సీసీ రోడ్డు పరిస్థితి

మొత్తంగా మూడేళ్లలో రూ.11,827 కోట్ల చెల్లింపులు

- చంద్రబాబు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులలో ఎక్కువ భాగం తమ కార్యకర్తల దోపిడికే వెచ్చించగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ నిధులతో గ్రామాల్లో శాశ్వత భవన నిర్మాణాలకు పూనుకుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉమ్మడి నిధులు (ఉపాధి హామీ పథకం మెటిరీయల్ కేటగిరీలో) గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 36 వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వంటి భవనాలను నిర్మిస్తోంది. వీటికి సంబంధించి ఇప్పటికే నిర్మాణం పూర్తయిన పనులకు దాదాపు రూ.4,200 కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది.
- గత ప్రభుత్వం బకాయి పెట్టిన మరో రూ.4,481 కోట్లు, మూడేళ్లలో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు వంటివి నిర్మించినందుకు గాను సుమారు మరో రూ.3 వేలకు పైగా కోట్లను వైఎస్ జగన్ ప్రభుత్వం ఖర్చు చేసింది.
- ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరీలో గత మూడేళ్లలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉమ్మడి నిధులు కలిపి మొత్తం రూ.11827 కోట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు విడుదల కాగా.. ఆ మేరకు చెల్లింపులు కూడా పూర్తయ్యాయి.
- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి మధ్యలో ఆపేసిన పనులతోపాటు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కొత్తగా ప్రారంభించిన పనులను కలిపి 47,258 కిలోమీటర్ల పొడవైన సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లకు సంబంధించి 49,402 పనులు పురోగతిలో ఉన్నట్టు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

ఇంటిపైనా 'ఎల్లో' విషం

టిడ్కో ఇళ్ల పనులు జరుగుతున్న ప్రదేశం ఫొటోలతో తప్పుడు కథనం

- నంద్యాలలో 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం
- జనవరిలో అన్ని వసతులతో 2 వేల ఇళ్ల పంపిణీ
- మిగిలిన 8 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి.. పురోగతిలో మౌలిక వసతుల పనులు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని వసతులతో 50 వేల యూనిట్లు పంపిణీ
- మరో 1,29,480 ఇళ్ల నిర్మాణం పూర్తి.. చకచకా వసతుల కల్పన
- లబ్ధిదారులకు భారీగా ఆర్థిక లబ్ధి చేకూర్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వంటి ఫీజుల్లో రూ.5,487.32 కోట్ల భారం తొలగింపు
- డిసెంబర్ నాటికి 2.62 లక్షల ఇళ్ల పంపిణీకి షెడ్యూల్
- ప్రజలకు మేలు చేస్తుంటే తట్టుకోలేకపోతున్న పచ్చ బ్యాచ్
- ప్రభుత్వంపై విష ప్రచారమే లక్ష్యంగా అబద్ధపు రాతలు

సాక్షి, అమరావతి: నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు అన్న తీరులో ఉంది ఎల్లో మీడియా. కళ్ల ముందు కనిపిస్తున్న నిజాలను దాచి, అబద్ధాల కథనాలు రాసి ప్రజలు నమ్మేస్తారులే అన్న భ్రమల్లో ఉంది. ఇదే భ్రమలతో టిడ్కో ఇళ్లపై ఈనాడు ఓ అబద్ధాల కథనాన్ని అచ్చేసింది. ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, వేగం, లబ్ధిదారులకు కలిగిస్తున్న ప్రయోజనాలను వదిలేసి తప్పుడు ప్రచారానికి తెర తీసింది. నంద్యాల ఎస్ఎం నగర్, ఎస్సార్‌బీసీ కాలనీ, అయ్యలూరిమెట్ట ప్రాంతాల్లో మొత్తం 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అన్ని వసతులతో సిద్ధంగా ఉన్న 2 వేల యూనిట్లను గత నెలలో లబ్ధిదారులకు అందించారు. మిగిలిన 8 వేల ఇళ్ల నిర్మాణం కూడా పూర్తయింది. వీటికి రూ.88.84 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. వీటిని జూన్ నెలలో లబ్ధిదారుకులకు అందించే లక్ష్యంతో అధికారులు పనులు చేయిస్తున్నారు. వీటినే ఫొటోలు తీసి 'పైన పటారం.. లోపల ఉసూరు' అంటూ ఈనాడు తప్పుడు ప్రచారానికి తెగబడింది.

పునాదుల స్థాయిలోనే వదిలేసిన గత ప్రభుత్వం

పట్టణ పేదల కోసం ఉద్దేశించిన 2,62,216 టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీల్లో ప్రారంభించారు. 300 చ.అ. విస్తీర్ణంలో 1,43,600 యూనిట్లు, 365 చ.అ. విస్తీర్ణంలో 44,304 యూనిట్లు, 430 చ.అ విస్తీర్ణంలో 74,312 యూనిట్లు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం 2019 మే 1 నాటికి 1,22,888 టిడ్కో ఇళ్లను పునాదుల స్థాయిలోనే వదిలేసింది. వీటిలో 63,744 ఇళ్లకు రూ.3,232 కోట్లు ఖర్చవుతుందని ప్రకటించింది. అయితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రివర్స్ టెండరింగ్ విధానంతో వీటి నిర్మాణంలో రూ.392 కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేసింది. టీడీపీ ప్రభుత్వం సగంలో వదిలేసిన ఇళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 వేల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. వీటిని లబ్ధిదారులకు అందజేసింది కూడా. దీంతో పాటు ఫిబ్రవరి 7వ తేదీ నాటికి 1,29,480 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వీటిలో మౌలిక వసతుల కల్పన చకచకా జరుగుతోంది.

గతంలో రూ.306 కోట్లు.. ఇప్పుడు రూ.3,237 కోట్లు

టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన 163 ప్రాంతాల్లో గత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.306 కోట్లతో మౌలిక వసతులు తూతూమంత్రంగా కల్పించి చేతులు దులుపుకొంది. అయితే, ఆ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.3,237 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటి దాకా రూ.800 కోట్లు విలువైన పనులు పూర్తయ్యాయి.

టీడీపీ మోపిన భారాన్ని తీసేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

300 చ.అ. ఇళ్లను పొందిన నిరుపేదలపై గత ప్రభుత్వం లబ్ధిదారుల వాటాగా రూ.3,805 భారం మోపింది. ఒక్కో ఇంటికి రూ.2.65 లక్షలు ధర నిర్ణయించి లబ్ధిదారే 20 ఏళ్లపాటు రుణాన్ని నెలనెలా ఈఎంఐల రూపంలో చెల్లించాలని షరతు పెట్టింది. దీనిప్రకారం ఒక్కో ఇంటికి వడ్డీతో కలిపి 20 ఏళ్లకు రూ.7.20 లక్షలు లబ్ధిదారే చెల్లించాలి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఇళ్లను ఒక్క రూపాయికే కేటాయించింది. దీనిద్వారా 1,43,600 మంది లబ్ధిదారులు రూ.10,339 కోట్ల మేరకు ప్రయోజనం పొందారు. 365 చ.అ., 430 చ.అ. ఇళ్లలో లబ్ధిదారుల కొంత వాటా చెల్లించాలని గత ప్రభుత్వం నిబంధన పెట్టింది. అయితే, వారు ఇప్పటివరకు చెల్లించాల్సిన రూ.482.32 కోట్లను ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించింది. అంతేకాకుండా ఆ ఇళ్లకు 50 శాతం సబ్సిడీ ప్రకటించింది. దీంతో ఆ ఇళ్లకు గత ధరల ప్రకారం మొత్తం రూ.10,797 కోట్లు లబ్ధిదారులు చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడా మొత్తం రూ.4,590 కోట్లకు తగ్గిపోయింది. బ్యాంకు రుణాలనూ ఇప్పిస్తోంది.

అందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్

అన్ని కేటగిరీల ఇళ్ల లబ్ధిదారులకు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, యూజర్ ఛార్జీలను కూడా ప్రభుత్వం మినహాయించింది. దీనిద్వారా 365 చ.అ, 430 చ.అ లబ్ధిదారులు దాదాపు రూ.1200 కోట్ల మేర అదనంగా లబ్ధి పొందుతున్నారు. మొత్తం అన్ని ఫీజులు కలిపి లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం మొత్తం రూ.5,487.32 కోట్ల మేలు జరిగేలా చేసింది.

- వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటి దాకా టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.4,939.10 కోట్లు, మౌలిక వసతులకు రూ.570 కోట్లు, భూ సేకరణకు మరో రూ.11 కోట్లు వెచ్చించింది.
- గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ. 3 వేల కోట్ల బకాయిలు తిరిగి చెల్లించింది.
- పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు మరో రూ.6 వేల కోట్లు ఖర్చు చేయనుంది.

మొత్తం ఇళ్ల పంపిణీకి షెడ్యూల్

ఇప్పటిదాకా 35 ప్రాంతాల్లో రోడ్లు, తాగు నీరు, సెప్టిక్ డ్రైనేజీ, విద్యుత్ వంటి పూర్తి మౌలిక సదుపాయాలతో 50 వేల ఇళ్లను లబ్ధిదారులకు అందజేసిన ప్రభుత్వం మిగిలిన ఇళ్లను అందించేందుకు షెడ్యూల్ కూడా ప్రకటించింది.

ఇప్పటిదాకా పంపిణీ చేసినవి 50 వేలు
మార్చి లక్ష్యం 1 లక్ష
జూన్‌లో 50 వేలు
డిసెంబర్‌లో పంపిణీ 62,616
మొత్తం 2,62,216

ఇంత మేలు జరిగినా విషప్రచారం!

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగడుగునా మేలు చేస్తోంది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తోంది. నిరుపేదలకు ఒక్క రూపాయికే ఇళ్లు ఇస్తోంది. మరికొందరికి భారీ సబ్సిడీ ఇస్తోంది. బ్యాంకు రుణాలూ ఇప్పిస్తోంది. రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తోంది. నిర్మాణంలో, వసతుల్లో నాణ్యతలో రాజీ పడకుండా లబ్ధిదారుల ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తోంది. అయినా, పూర్తికాని ఇళ్ల చిత్రాలతో మసిపూసి మారేడుకాయ చేసి, విషప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించడానికే ఎల్లో మీడియా ప్రయత్నిస్తోంది.

రంగాను చంపించిన బాబుకు మద్దతిస్తారా?

- చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ జతకట్టడాన్ని మీరు సమర్థిస్తారా?
- రంగాను చంపింది టీడీపీ నాయకత్వమే అని చెప్పింది మీరేగా?
- హరిరామజోగయ్యకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: 'వంగవీటి రంగాను చంపించిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ మద్దతివ్వడాన్ని మీరు సమర్థిస్తారా? ఈ ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పకుండా నాపై లేనిపోని ఆరోపణలు చేయటం సమంజసమా? కాపు జాతి మిమ్మల్ని హర్షిస్తుందా?' అని మాజీ ఎంపీ హరిరామ జోగయ్యను ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. మంగళవారం హరిరామజోగయ్యకు మంత్రి అమర్‌నాథ్ బహిరంగ లేఖ రాశారు. 'రంగాను చంపించినది ముమ్మాటికీ నాటి టీడీపీ నాయకత్వమే అన్నది కాపు డీఎన్ఏ ఉన్న ఎవరిని అడిగినా చెబుతారు. మీరు(హరిరామ జోగయ్య) రాసిన పుస్తకంలోని విషయాన్ని మేం కోట్ చేయటం మీకు బాధ కలిగించిందని మాకు తెలియదు. దాన్ని మీరు ఇలా విత్ డ్రా చేసుకుంటారని కూడా మాకు తెలియదు. ఒకవేళ మీ పుస్తకంలో మీరు అబద్ధాలు రాసి ఉంటే అదే విషయం చెప్పండి. కాపు ఓట్లను అంతో ఇంతో ప్రభావితం చేసి, ఆ ఓట్లను మూటగట్టుకుని కాపు వ్యతిరేక చంద్రబాబుకు అమ్మేయాలన్న పవన్ ఆలోచనల్ని నేను నిజాయితీగా వ్యతిరేకిస్తున్నాను. గుడివాడ గుర్నాథరావు, గుడివాడ అమర్నాథ్ కాపులు అవునా? కాదా? అన్న విషయంలో మీ సర్టిఫికెట్లు అవసరం లేదు. మీలో ఇప్పటికీ ప్రవహిస్తున్న టీడీపీ ఆలోచనల రక్తం, టీడీపీ ప్యాకేజీల రక్తం, మీ ఇద్దరి(జోగయ్య, పవన్) డీఎన్ఏలను మార్చవచ్చేమోగానీ.. మా డీఎన్ఏలను మార్చలేరు. 2024లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం. వైఎస్ జగన్ తిరిగి సీఎం అవుతారు' అని మంత్రి పేర్కొన్నారు.

లక్షన్నర కోట్లు.. లక్షకుపైగా జాబ్స్

▶ మొదటి పేజీ తరువాయి

మరోసారి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ప్రాజెక్టుల విధానంలో కీలక మార్పులు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితులు తీసుకొచ్చామన్నారు. విద్యుత్ ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్న భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు కింద చెల్లింపులు చేస్తారని, దీనివల్ల కరువు ప్రాంతాల్లో రైతులకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి మెగావాట్‌కు లక్ష రూపాయల చొప్పున రాష్ట్రానికి కంపెనీలు చెల్లిస్తున్నాయని తెలిపారు. ఎస్‌జీఎస్‌టీ రూపంలో కూడా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుందన్నారు. గ్రిడ్ బాధ్యతలు కూడా రాష్ట్రానికి లేవన్నారు. దీంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. భోగాపురంలో అత్యంత అధునాతన సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు కావాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోడళ్లను పరిశీలించి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదనలు ఇవీ

- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కు ఏర్పాటు కానుంది. మొదటి విడతలో రూ.55 వేల కోట్లు, రెండో విడతలో మరో రూ.55 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడులతో తొలిదశలో 30 వేల మందికి, రెండో దశలో 31 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తంగా 61 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారు. ఈ పార్క్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, హైడ్రోజన్ సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయి. మొదటి విడత 2027 నాటికి, రెండో విడత 20 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇంధన రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి కొత్త తరహా ఇంధనాల ఉత్పత్తి దిశగా ఎన్టీపీసీ ముందడుగు వేస్తోంది.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా రూ.3,400 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2025 నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- శ్రీకాళహస్తి, పుంగనూరులో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ ఫ్యాక్టరీల స్థాపన ద్వారా డీఐ పైపులు, ఫెర్రో అల్లాయిస్ తయారీ. శ్రీకాళహస్తిలో రూ.915.43 కోట్లు, పుంగనూరులో రూ.171.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. మొత్తంగా రూ.1,087 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2023 డిసెంబర్ నాటికి ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.
- కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు. ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వీటిని ఏర్పాటు చేస్తుంది. నాలుగు విడతల్లో మొత్తం రూ.10,500 కోట్ల పెట్టుబడుల ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దశలవారీగా 2027 మార్చి నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం కానుంది.
- రామాయపట్నంలో అకార్డ్ గ్రూప్ రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కాపర్ కాథోడ్, కాపర్ రాడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్, సెలీనియం, ప్రత్యేక ఖనిజాల తయారీ ద్వారా ప్రత్యక్షంగా 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మే 2023లో పనులు ప్రారంభించి జూన్ 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1489.23 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తిరుపతిలో నెలకొల్పే పరిశ్రమ ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. టెలీ కమ్యూనికేషన్ ఇంటిగ్రేషన్, సెమి కండక్టర్, ఆప్టికల్ మాడ్యూల్స్‌ను ఈ కంపెనీ తయారు చేస్తోంది.
- కృష్ణా జిల్లా మల్లవల్లి పార్కులో ఇథనాల్ ఇంధన తయారీకి అవిశా, ఫ్యూయెల్స్ కంపెనీ ముందుకొచ్చాయి. మొత్తంగా రూ.498.84 కోట్ల పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,300 మందికి ఉపాధి లభిస్తుంది. దీని సామర్థ్యం రోజుకు 500 కిలో లీటర్ల తయారీ. ఈ ఏడాది జూన్‌లో పనులు ప్రారంభించి వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.
- విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. మొదటి విడతలో 10 మెగావాట్లతో ప్రారంభించి మూడేళ్లలో పూర్తి స్థాయికి చేరుకునేలా సన్నాహాలు జరుగుతున్నాయి. మొత్తం రూ.7,210 కోట్ల పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 14,825 మందికి, పరోక్షంగా 5,625 మందికి.. మొత్తంగా 20,450 మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 200 మెగావాట్ల డేటా పార్కుకి ఇది అదనం.
- భోగాపురంలో 90 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం లభించింది.
- రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ తమ ప్రణాళికలను మార్చుకుంది. ఫ్యాక్టరీ కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన 985 ఎకరాల భూమిలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఎస్ఐపీబీ ఆమోదించింది.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు, ఆర్థిక, ప్రణాళిక, శాసనసభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, రెవెన్యూశాఖ (వాణిజ్య పన్నులు) స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ , ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, జీఏడీ స్పెషల్ సీఎస్ కె.ప్రవీణ్ కుమార్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, ఏపీపీసీబీ సభ్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏపీ హైగ్రేడ్ స్టీల్ లిమిటెడ్ ఎండీ షన్‌మోహన్, ఎన్ఆర్ఈడీసీఏపీ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా 3.64 కోట్ల సేవలు

- రాష్ట్రంలో సులభంగా, వేగంగా నాణ్యమైన ప్రభుత్వ సేవలు
- మంత్రి విడదల రజిని



యడ్లపాడు: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తమ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రజలకు 3.64 కోట్ల సేవలను అందించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఇది మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం సాధించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులో ఉపాధిహామీ పథకం కింద రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ప్రతి రెండువేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాలను నిర్మించారని, ఇది దేశ చరిత్రలోనే మహాయజ్ఞమని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం 1.34 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందని చెప్పారు. వీరిలో 85 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారే ఉండటం గమనించాల్సిన విషయమన్నారు. ప్రతి సచివాలయం ద్వారా 540 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. 50 కుటుంబాలకు ఒక వలంటీర్ వంతున లక్షలమందిని నియమించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఒక్క వంకాయలపాడు సచివాలయం పరిధిలోనే నాలుగు వేలకుపైగా ప్రభుత్వ సేవల్ని ప్రజలకు అందించినట్లు చెప్పారు. టీడీపీ హయాంలో అంతా దుర్మార్గమేనని చెప్పారు. అప్పట్లో జన్మభూమి కమిటీలకు నచ్చిన, వారి పార్టీకి చెందిన, లంచం ఇచ్చిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు.

క్లుప్తంగా...

నేడు కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మండల నిల్వ కేంద్రాలు (ఎంఎల్ఎస్ గోడౌన్లు), రైస్ మిల్లులు, స్టేజీ 1, 2 రవాణా, ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితునికి జీవితఖైదు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వద్ద ఇద్దరు గిరిజన బాలికలను బెదిరించి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయి వెలగాడ రాంబాబుకు జీవితఖైదు శిక్షను విధిస్తూ విజయనగరం జిల్లా స్పెషల్ పోక్సోకోర్టు మంగళవారం తీర్పు ఇచ్చిందని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. తన చాంబర్‌లో కేసు వివరాలు వెల్లడించారు. వెలగాడ రాంబాబుపై అప్పట్లో కురుపాం పోలీస్ స్టేషన్లో అత్యాచారం కేసు నమోదైంది. ముద్దాయికి సెక్షన్–341 ఐపీసీకి ఒక నెల జైలుశిక్ష, రూ.500 జరిమానా, సెక్షన్ 348 ఐపీసీ కింద మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 419 కింద మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 506(2) ఐపీసీ కింద మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 376 ఐపీసీ అండ్ సెక్షన్ 4 ఆఫ్ పోక్సో యాక్టు కింద జీవితఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ స్పెషల్ పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి షేక్ సికిందర్‌బాషా తీర్పును వెలువరించారు. ఈ కేసులో బాధితులు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి జీవితకాలం రుణపడి ఉంటాం

ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య

కడప కార్పొరేషన్: నాయీ బ్రాహ్మణుల జాతి యావత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటుందని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఎస్. యానాదయ్య అన్నారు. దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులను ట్రస్టీలుగా నియమించాలని ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన నేపథ్యంలో వారు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కడపలోని హెడ్ పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యానాదయ్య మాట్లాడుతూ ఇప్పటివరకూ నాయీ బ్రాహ్మణులు దేవాలయాల్లో సేవకులుగా ఉన్నారని, ఇకపై పాలకులుగా ఉంటారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజలను నమ్మించలేరు

ఎల్లో మీడియాపై పురపాలకశాఖ మంత్రి సురేష్ ఆగ్రహం

సాక్షి, అమరావతి: అబద్ధాలను పదేపదే వండి వార్చినంత మాత్రాన ప్రజలు నమ్మరని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. టిడ్కో గృహాలపై 'పైన పటారం లోపల ఉసూరు' అంటూ ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని మంగళవారం ఓ ప్రకటనలో మంత్రి ఖండించారు. నంద్యాలలో నిర్మాణం పూర్తి చేసుకుని, మౌలిక వసతుల పనులు జరుగుతున్న గృహాల ఫొటోలను తీసి తప్పుడు కథనాలను ప్రచురించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలోని ఎన్ఎంనగర్, ఎస్ఆర్‌బీసీ కాలనీ, అయ్యలూరిమెట్ట ప్రాంతాల్లో మొత్తం 10 వేల గృహాలను నిర్మిస్తున్నామని, వాటిలో అన్ని సౌకర్యాలతో పూర్తయిన రెండు వేల గృహాలను జనవరి 7న లబ్ధిదారులకు అందజేసినట్టు గుర్తుచేశారు. మిగిలిన గృహాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. వీటిని ఫొటోలు తీసి పనులు జరగనట్టు అసత్య కథనాన్ని ప్రచురించడం సమంజసం కాదన్నారు.

ఆర్‌పీఐ కార్యాలయానికి నిప్పు

గుంటూరు ఈస్ట్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) కార్యాలయానికి కొందరు దుండగులు నిప్పంటించారు. అక్కడే ఉన్న వాచ్‌మెన్‌పైనా దాడి చేసి పెట్రోల్ పోశారు. స్థానికులు రావడంతో దుండగులు పారిపోయారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి గుంటూరులో జరిగింది. స్థానిక డొంకరోడ్డు వెల్ఫేర్ సెంటర్‌లో ఆర్‌పీఐ కార్యాలయం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్‌కుమార్ ఇక్కడి నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి కొందరు దుండగులు ఆర్‌పీఐ కార్యాలయం వద్దకు చేరుకుని పెట్రోల్ పోసి నిప్పంటించారు. వాచ్‌మెన్ రామచంద్రయ్య అడ్డుకోబోగా.. అతనిపైనా దాడి చేసి పెట్రోలు పోశారు. మంటలు ఎగిసిపడటం చూసిన స్థానికులు అక్కడకు చేరుకోవడంతో దుండగులు పారిపోయారు. దీంతో రామచంద్రయ్యకు ప్రమాదం తప్పింది. కార్యాలయం, అందులోని ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బోరుగడ్డ అనిల్ అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిని ప్రశ్నించినందుకు వారు గుంటూరులోని టీడీపీ గూండాలతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారని ఆరోపించారు.

బెట్.. కొట్లాట రసపట్టు

అనాదిగా దేశంలో జంతువులు, పక్షుల పోటీలు.. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో కోడి పందేలు, జల్లికట్టు

కర్ణాటక, కేరళల్లో కంబాళ, రాజస్థాన్‌లో ఒంటెల రేసు

ఢిల్లీ శివారు, గురుగ్రామ్, నోయిడాలో కుక్కల కొట్లాట

జంతు హింసను నిరోధించే చట్టాలున్నా ఆగని అనవాయితీ

సాక్షి, అమరావతి: శునకం.. వరాహం.. అశ్వం.. ఎద్దు.. ఒంటె.. కోడి.. బుల్ బుల్ పిట్ట.. పక్షి, జంతువా కాదు.. బరిలో ఉందంటే దుమ్ము దులపాల్సిందే. ప్రత్యర్థిని మట్టికరిపించాల్సిందే. అనాది కాలం నుంచి మన దేశంలో జంతువులు, పక్షుల పోటీలు జరుగుతూనే ఉన్నాయి. దేశంలో అనేక రాష్ట్రాలు... ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతాల వారీగా ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని జంతువులు, పక్షులతో పోటీలు సంప్రదాయమైంది. జంతు హింసను నిరోధించే చట్టాలున్నప్పటికీ ఏళ్ల తరబడి అదే ఆనవాయితీ కొనసాగుతోంది. అనేక రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన జంతువుల పందేలు, పోటీలపై ఓ లుక్కేద్దాం..

పౌరుషానికి ప్రతీక కోడి పుంజులు

కోడి పందేలకు ఘనమైన చరిత్రే ఉంది. సింధు నాగరికత నుంచి మొదలెడితే.. భారత్, చైనా, పర్షియా, గ్రీకు నాగరికతల్లోను వీటిని నిర్వహించిన ఆధారాలున్నాయి. పల్నాడు, బొబ్బిలి యుద్ధంలో కోడి పుంజుల పోరు చరిత్ర అందరికీ తెలిసిందే. కోడి పుంజుల పందేలను పౌరుషానికి ప్రతీకగా భావిస్తారు. ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి బరిలోకి దించుతారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలో వీటిని ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రముఖంగాను, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ భోగి, సంక్రాంతి, కనుమ పండుగల రోజు కోడి పందేలు నిర్వహించడం సంప్రదాయంగా మారింది. తమిళంలో 'వెట్రికాల్' అని, తుళులో 'గోరిక్ కట్ట' అని కోడి పందాలను పిలుస్తారు. కర్ణాటకలోని ఉడుపి, కేరళలోని కాసర్‌గోడ్‌లలోనూ కోడి పందాలను నిర్వహిస్తుంటారు. కోడి పందాల పేరుతో కోడి పుంజులను దారుణంగా హింసిస్తున్నారని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా కూడా నివేదించింది. జంతు సంరక్షణ చట్టం ఉల్లంఘిస్తున్న కోడి పందేలను సుప్రీం కోర్టు నిషేధించింది. అయినా సంప్రదాయం, సరదా పేరుతో కోడి పందేలు.. బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి.



ఒంటెల రేసు..

రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లా పుష్కర్‌లో గుర్రం, ఒంటెల పరుగు (రేసు) పందేలు నిర్వహిస్తుంటారు. వీటిలో విజేతలకు నేరుగా రాజస్థాన్ ప్రభుత్వమే నగదు బహుమతిని అందిస్తుంటుంది. ఈ రేసులో గెలిచేందుకు ఒంటెలకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. ఈ రేసులకు ముందుగా గిరిజనుల నృత్యాలు, ఒంటెల అందాల పోటీలు కూడా నిర్వహిస్తుంటారు. ఎక్కువ దూరం వేగంగా ప్రయాణించిన ఒంటెను విజేతగా ప్రకటిస్తారు.

కంబాళ.. భళా భళ

దున్నలను కాడికి కట్టి రేసు నిర్వహించడాన్ని కన్నడ భాషలో కంబాళ అంటారు. ఖాత్రి కంబాళ అనేది మంగళూరు ఖాత్రిలోని మంజునాథ ఆలయ పరిసరాల్లో నిర్వహించేవారు. దీన్నే ధీవర కంబాళ అని కూడా పిలిచేవారు. 300 ఏళ్ల క్రితం నిర్వహించిన ఈ వేడుకకు ఆనాటి అలూబ రాజులు కూడా హాజరయ్యేవారు. ఇప్పటికీ ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో కంబాళను నిర్వహిస్తుంటారు. సాధారణంగా బురద నేలలు, వరి పొలాల్లో ఈ రేసు నిర్వహిస్తారు. వీటిలో పాల్గొనే రైతులు కొరడా ఝుళిపిస్తూ రెండు దున్నలతో వేగంగా పరుగులు తీస్తారు. పందెంలో గెలిచిన వారికి బంగారం, వెండి నాణేలతో పాటు విలువైన బహుమతులు ఇస్తారు. ఈ పోటీపై పెద్దఎత్తున బెట్టింగ్‌లు వేస్తుంటారు. కేరళలోనూ వరికోతల తర్వాత ఈ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పోటీల్లో కొరడాలను ఉపయోగించడంపై జంతు హక్కుల కార్యకర్తలు మొదట్నుంచీ ఆందోళనలు చేస్తున్నారు. దీంతో జల్లికట్టు, కంబాళ పోటీల్లో జంతువులను హింసించ కూడదని 2014 మే 7న సుప్రీం కోర్టు స్పష్టంచేసింది.

ఎద్దుల ఆట కట్టించే జల్లికట్టు..



బుసలు కొడుతూ పరుగులు తీసే బలమైన ఎద్దులను లొంగదీసుకునే క్రీడే జల్లికట్టు. సింధు నాగరికత, తమిళ్ సాహిత్యంలోను జల్లికట్టుకు సంబంధించిన ఆధారాలున్నాయి. ప్రాచీన తమిళనాడులోని 'ముల్లై' ప్రాంతంలో నివసించే తెగల్లో జల్లికట్టు సర్వసాధారణం. తమిళ పురాణాల ప్రకారం పూర్వకాలంలో మహిళలు జల్లికట్టులో విజేతలైన వారిని తమ భర్తలుగా ఎంచుకునేవారు. నీలగిరి జిల్లాకు చెందిన కరిక్కియూర్ అనే గ్రామంలో సుమారు 3,500 సంవత్సరాల వయసుగల శిలా ఫలకాలపై మనుషులు ఎద్దులను తరిమే దృశ్యాలు చెక్కి ఉన్నాయి. స్పెయిన్‌లో జరిగే బుల్ ఫైట్‌కు దగ్గరగా జల్లికట్టు ఉంటుంది. అయితే జల్లికట్టులో ఎద్దులను చంపరు. తమిళనాడులోని గ్రామాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోను జల్లికట్టు నిర్వహిస్తారు.



శునకాల కొట్లాట..

ఇంగ్లాండ్‌లో 18వ శతాబ్దంలో శునకాల కొట్లాట పోటీలను నిర్వహించేవారు. తర్వాత భారత్‌కు ఈ పోటీలు చేరాయి. ఈ పోటీల కోసం అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, ఆస్ట్రేలియాల నుంచి ప్రత్యేకంగా కుక్కలను తీసుకువస్తుంటారు. ఢిల్లీ శివారు ప్రాంతాలతోపాటు గురుగ్రామ్, నోయిడాలలోనూ ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పంజాబ్, హరియాణాల్లో ధనవంతులు సరదా కోసం ఇలాంటి పోటీలను నిర్వహించే సంప్రదాయం పెరుగుతోంది. కుక్కల కొట్లాటలో రక్తస్రావం తీవ్రంగా ఉంటుంది. పందేల్లో దింపే కుక్కలను రోజుల తరబడి ఆహారం పెట్టకుండా బోనులో బంధిస్తారు. ఒక్కసారిగా వాటిని వదులుతారు. అప్పటికే ఆకలితో తీవ్ర కోపంతో రగిలిపోయే కుక్కలు ప్రత్యర్థి కుక్కలపై భయానకంగా దాడులు చేస్తాయి. ఒక్కోసారి వీటిలో ఒక్కోసారి ప్రత్యర్థి కుక్కలు చనిపోతుంటాయి. గెలిచిన కుక్క యజమానికి రూ.లక్షల్లో నగదు బహుమతులు అందిస్తుంటారు. వీటిపైనా సుప్రీం కోర్టు నిషేధం ఉంది.



బుల్ బుల్ పక్షుల పోటీ

పూర్వం అస్సాం రాజు స్వర్గదేవ్ బ్రహ్మథ సింఘ పక్షుల పోటీలు ఎంతో ఇష్టంగా నిర్వహించేవారని, ఈ పోటీల కోసం ప్రత్యేకంగా పక్షులను పెంచేవారని చరిత్ర చెబుతోంది. ఆ తర్వాతి కాలంలో ఇది ఒక సంప్రదాయంలా మారింది. సంక్రాంతి సమయంలోనే అస్సాంలో భోగలి బిహు వేడుక నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా గువాహటికి 30 కిలోమీటర్ల దూరంలో హయగ్రీవ మాధవ ఆలయానికి సమీపంలో బుల్‌బుల్ పక్షుల పందేలు నిర్వహిస్తారు. ఈ పందాల కోసం పక్షులకు గ్రామస్తులు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ పోటీల్లో పక్షులు కూడా గాయపడుతుంటాయి. పోటీల్లో ఓడిపోయిన పక్షుల ముక్కు ముందు భాగాన్ని కత్తిరిస్తారు. దీంతో మరోసారి మళ్లీ ఇవి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదు. ఈ పక్షుల పోటీపై నిషేధం విధించాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, 2016లో ఈ పోటీ నిర్వహించకుండా గువాహటి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ నిర్వహిస్తున్నారు.



ఎద్దు బండ్ల రేసు..

మహారాష్ట్రలో ఎద్దుల బండ్ల రేసులను శతాబ్దాల నుంచి నిర్వహిస్తున్నారు. దాదాపు 500 మీటర్ల దూరాన్ని ఎద్దుల బండ్లపై ఎవరైతే వేగంగా చేరుకుంటారో వారిని విజేతగా ప్రకటిస్తారు. ఈ పోటీల్లో చాలా మంది రైతులు పాల్గొంటారు. వినాయక చవితి సమయంలో ఎక్కువగా ఈ పోటీలను నిర్వహిస్తారు. ఇవి తమ సంప్రదాయమని నిర్వాహకులు చెబుతుంటారు. పోటీ కోసం కొన్ని ఎద్దులను ప్రత్యేకంగా సిద్ధం చేస్తారు. మహారాష్ట్రతో పాటు పంజాబ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్‌ల్లో కొన్ని ప్రాంతాల్లోనూ ఈ రేసు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను 2014లో సుప్రీం కోర్టు నిషేధం విధించింది. కానీ, స్థానిక నాయకుల ప్రోత్సాహంతో ఈ పోటీలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్



గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రైతులతో మాట్లాడుతున్న వైవ్స్ నోయెల్ లెక్లెర్క్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆదర్శంగా ఉన్నాయని, ఈ విధానంలో పండించే ఆహార ఉత్పత్తులు రుచి, నాణ్యతతో పాటు సురక్షితమైనవిగా గుర్తించామని అంతర్జాతీయ ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ మెకెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైవ్స్ నోయెల్ లెక్లెర్క్ చెప్పారు. 160 దేశాల్లో బంగాళదుంప ఆధారిత ఆహార ఉత్పత్తులను విక్రయిస్తూ అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఈ సంస్థ బృందం మంగళవారం రాష్ట్రంలో పర్యటించింది. 'ఫ్రెంచ్ ఫ్రైస్' వంటి బహుళజాతి సంస్థతో అంతర్జాతీయంగా 27 శాతం మార్కెట్‌ను సొంతం చేసుకున్న ఈ సంస్థ ఏపీతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. 2030 నాటికి ప్రపంచంలో తాము సేకరించే బంగాళదుంప వ్యవసాయ క్షేత్రాలన్నింటిలోను సుస్థిర వ్యవసాయ విధానాలను అమలుచేయాలనే లక్ష్యంతో ఈ సంస్థ అడుగులేస్తోంది. ఇండియాలో ఈ సంస్థతో కలిసి పనిచేస్తున్న బావిక్ కుమార్ బ్రహంభట్‌తో కలిసి నోయల్ లెక్లెర్క్ బృందం గుంటూరు జిల్లాలో నూతక్కి, కొత్తపాలెం, రేవేంద్రపాడు గ్రామాల్లో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో బంగాళదుంప సాగుచేస్తున్న రైతుక్షేత్రాలతో పాటు ఇతర పంటలను బృందం సభ్యులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం గురించి ఆరా తీశారు. గ్రామస్థాయిలో రైతులను ప్రకృతిసాగు వైపు మళ్లించేందుకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అరటిలో అంతరపంటగా పసుపు, కూరగాయలు, పప్పుధాన్యాలు ఏ విధంగా పండిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతిసాగు వల్ల నేల ఏ విధంగా సారవంతం అవుతుంది? నీటివినియోగం ఎలా తగ్గుతుంది? వానపాముల వృద్ధి ఎలా అవుతుంది? మల్చింగ్ (నేలను కప్పి ఉంచడం) వల్ల కలిగే ఉపయోగాలు.. తదితర అంశాలపై అధ్యయనం చేశారు. ఏపీలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆయా దేశాల్లో అమలుచేసేలా కృషిచేస్తామని చెప్పారు. ఈ బృందం వెంట జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, శ్రీకర్ ఉన్నారు.

పోలీసు భద్రత తొలగింపుపై పయ్యావుల కేశవ్ పిటిషన్

సాక్షి, అమరావతి: తనకు కల్పించిన పోలీసు భద్రతను తొలగించడాన్ని సవాలు చేస్తూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ హైకోర్టును ఆశ్రయించారు. భద్రతను పునరుద్ధరించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారించారు. కేశవ్‌కు భద్రత తొలగింపు విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, అనంతపురం జిల్లా ఎస్పీ తదితరులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేశారు.

మున్సిపల్ అధికారులపై రెచ్చిపోయిన 'రావి'

- గుడివాడలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులపై టీడీపీ నేత దౌర్జన్యం



మున్సిపల్ అధికారులను వేలు చూపిస్తూ దూషిస్తున్న టీడీపీ నేత రావి వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/గుడివాడరూరల్: హైకోర్టు ఆదేశాల మేరకు గుడివాడలో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు రెచ్చిపోయారు. ఉద్యోగుల విధులకు అడ్డుతగిలి బూతులు తిడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. గుడివాడలోని నాగవరప్పాడు–లింగవరం చానల్‌ను ఆక్రమించుకుని ఏడుగురు ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో మురుగు నీటిపారుదలకు ఆటంకం ఏర్పడుతోందని అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ ఆ ప్రాంతంలో సొంత స్థలం కలిగిన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేసిన హైకోర్టు... అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించాలని సచివాలయ ఉద్యోగులు మూడు నెలల కిందట ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఆక్రమణలో ఉన్నవారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేసింది. నలుగురు స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేశారు. ముగ్గురు మాత్రం ఖాళీ చేయలేదు. దీంతో ఫిర్యాదుదారుడు మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా, వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించింది. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, సిటీ ప్లానర్ వై.రాంబాబు, మున్సిపల్ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు, పోలీసులతో కలసి సోమవారం ఆక్రమణలను తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా... రావి వెంకటేశ్వరరావు తమ పార్టీ నాయకులతో కలసి వచ్చి అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రావి వెంకటేశ్వరరావుతోపాటు మరికొందరు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా, రూ.20వేలు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు.

లోకేశ్.. నీ తండ్రితో కలిసి బహిరంగ చర్చకురా

- దళితులపై దాడుల నుంచి సంక్షేమం వరకు చర్చకు నేను రెడీ
- గిరిజన పోలీస్ అధికారిని నిర్బంధిస్తే కేసు పెట్టరా?
- నారా లోకేశ్ సవాల్‌పై తీవ్రంగా స్పందించిన మంత్రి నాగార్జున



సాక్షి, అమరావతి: 'లోకేశ్ నీ తండ్రి నారా చంద్రబాబుతో కలిసి వస్తే రాష్ట్రంలో దళితులపై దాడుల నుంచి సంక్షేమం వరకు ప్రతి అంశంపైనా తాను బహిరంగ చర్చకు సిద్ధం' అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ప్రకటించారు. బహిరంగ చర్చ కోసం ఎప్పుడు, ఎక్కడికి రావాలో లోకేశ్, చంద్రబాబులే చెప్పాలని ఆయన సవాల్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రత్యక్ష ఎన్నికల్లో కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవని, మంగళగిరిలో ఓడిపోయిన సన్నాసి, చేతకాని దద్దమ్మ లోకేశ్‌కు ఏమి అర్హత ఉందని తనను బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారని ప్రశ్నించారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా... అన్న చంద్రబాబుకు కొడుకుగా పుట్టిన లోకేశ్‌కు దళితుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులను అవమానించిన చంద్రబాబు ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక గిరిజన పోలీస్ అధికారిని నిర్బంధిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టరా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను చంద్రబాబు నాశనం చేశారని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులతో పొలంబడి, చంద్రన్న రైతు క్షేత్రాలు, డ్వాక్రా మహిళలకు శానిటరీ నాప్‌కిన్‌లు, చంద్రన్న పెళ్లి కానుక, మా ఇంటి మహాలక్ష్మి వంటి పథకాలను అమలు చేశారని, ఇవన్నీ ఏ దళితుల కోసం చేశారని నాగార్జున నిలదీశారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి మొత్తం రూ.46,117 కోట్లు ఖర్చు చేస్తే, మూడున్నరేళ్లలోనే తమ ప్రభుత్వం రూ.74,013 కోట్లు ఖర్చు పెట్టిందని మంత్రి నాగార్జున వివరించారు. ఒక్క పైసా అవినీతి లేకుండా పూర్తి పారదర్శకతతో ఎస్సీ, ఎస్టీ కాంపొనెట్ అమలులో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు.

ఆ పిటిషన్ విచారణార్హతపై కౌంటర్ వేయండి

సాక్షి, అమరావతి: ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) విద్యా, ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్టానికి అనుగుణంగా రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతంలో తెచ్చిన చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణార్హతపై ఉన్న అభ్యంతరాలను తమ ముందు ఉంచాలని పేర్కొంది. హరిరామజోగయ్య దాఖలు చేసిన వ్యాజ్యం... ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కిందకు వస్తుందని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు హరిరామ జోగయ్య తరఫున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపిస్తూ కాపులకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం 2019లో చట్టం తెచ్చిందన్నారు. సుప్రీంకోర్టు సైతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సమర్థించిందని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి భిన్నంగా జీవో నంబర్ 60 తీసుకువచ్చిందని, హైకోర్టు ఈ చట్టంపై స్టే ఇచ్చిందన్న భావనతో ప్రభుత్వం ఈ జీవో జారీ చేసిందని ఆయన వివరించారు. ఈ జీవో వల్ల విద్యా, ఉపాధి అవకాశాల్లో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు దక్కడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ... అసలు ఈ వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... విచారణార్హతపై అభ్యంతరాలను తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

రాష్ట్ర రెడ్డి సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గుర్రంకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం గుంటూరులో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకటశివారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా వరదారెడ్డి నారదరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపకుడు నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరికి నియామక పత్రాలను అందజేసి సన్మానించారు.

శ్రీచైతన్య విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని సంస్థ ప్రధాన క్యాంపస్‌లో విద్యార్థులను ఆయన అభినందించారు. బి.లోకేష్‌రెడ్డి అత్యధికంగా 99.79 పర్సంటైల్ సాధించాడు. టి.నిఖిలేష్ శివసాయి 99.73, కె.మేఘన 99.61, ఎస్.వెంకట శైలజ 99.59, పి.తేజాస్ కార్తీక్ 99.55, ఎం.మౌనిక 99.54, పి.హన్విత 99.53తో పాటు 99కి పైగా పర్సంటైల్ 25 మందికి వచ్చాయి. 51 మంది 98 పర్సంటైల్, 86 మంది 97 పర్సంటైల్, 100 మందికి పైగా 95 పర్సంటైల్, 220కి పైగా విద్యార్థులు 900కి పైగా పర్సంటైల్ సాధించారు. విద్యార్థులను డీన్ కిషోర్, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు.

విజ్ఞాన్ విజయవిహారం

చేబ్రోలు: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.మోహనరావు మాట్లాడుతూ 25 శాతం మంది విద్యార్థులు 90 శాతంపైగా పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. డి.నీరజ్‌బాబు (99.21), జి.జితేంద్ర మోహన్ (98.48), జి.విష్ణువర్ధన్ బాబు (97.69), ఎం.జస్వంత్ సాయి (97.51), ఎం.పవన్‌సాయి (95.42), ఎ.సంపత్ (95.27), ఎస్.శ్రీరామ్ (95.15), వై.ఈశ్వర సుమంత్ (94.96), ఎం.దిలీప్‌బాబు (94.84), ఎం.వరుణ్ (94.75), జె.చంద్రశేఖర్ (94.37), బి.ఓంసాయి చంద్ (94.3), జె.వీరభద్ర (93.98), కె.వెంకటశివ ప్రణయ్ (93.55), ఎ.లోకేష్ (90) పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ అభినందించారు.

తిరుమల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.వివేక్‌వర్ధన్ 99.999 పర్సంటైల్‌ను, వి.వేణు 99.97, పి.నవీన్‌కుమార్ 99.96, పీవై శ్రీనివాస్ 99.94, కేజీ ధనశ్రీ 99.91, ఆర్.అఖిల్ 99.89, ఎల్‌డీ వర్ధన్ 99.89, వీఎస్ఎస్ తేజస్విని 99.89, ఎంసీహెచ్ అపరాజిత్ 99.86, సీహెచ్ సింజని 99.85, సీహెచ్ రాజీవ్‌లోచన్ 99.85, జీవీఎస్‌జీఎస్ వర్షిత్ 99.83, పి.సునీత 99.83, ఆర్.శివప్రాజిత్ 99.82, కె.వరుణ్‌కుమార్ 99.82 పర్సంటైల్ సాధించారని వివరించారు. 99.5 పర్సంటైల్ పైన 50 మంది, 99 పర్సంటైల్ పైన 96 మంది, 98.5 పర్సంటైల్ పైన 144 మంది, 98 పర్సంటైల్ పైన 187 మంది, 97 పర్సంటైల్ పైన 266 మంది, 96 పర్సంటైల్ పైన 349 మంది, 95 పర్సంటైల్ పైన 415 మంది, 90 పర్సంటైల్ పైన 734 మంది సాధించారని ఆయన తెలిపారు.

సత్తా చాటిన వేలివెన్ను శశి

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. తమ విద్యార్థులు 99.80, 99.79, 99.77, 99.73, 99.69, 99.67, 99.66, 99.62, 99.61 వంటి అత్యుత్తమ పర్సంటైల్స్ సాధించారని వెల్లడించారు. 99 పర్సంటైల్ పైన 21 మంది, 98 పర్సంటైల్ పైన 41 మంది, 95 పర్సంటైల్ పైన 98 మంది, 90 పర్సంటైల్ పైన 205 మంది సాధించారన్నారు. ర్యాంకర్లను వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

భాష్యం భళా..

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు 99.99 పర్సంటైల్‌తో అఖిల భారతస్థాయిలో టాపర్లుగా నిలిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఎ.వెంకట శివరామ్, పి.నిశ్చల్ సుభాష్ 99.99 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో టాపర్లుగా నిలిచారని చెప్పారు. నిశ్చల్ సుభాష్‌కు ఈడబ్ల్యూఎస్ విభాగంలో 4వ స్థానం దక్కిందన్నారు. 18 మంది విద్యార్థులు 99.9, 42 మంది విద్యార్థులు 99.7, 54 మంది విద్యార్థులు 99.5, 82 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు.

జేఈఈ మెయిన్ తొలి విడతలో

బాలుర హవా

▶ మొదటి పేజీ తరువాయి

నలుగురు, జనరల్ ఈడబ్ల్యూఎస్‌లో ఒకరు, ఎస్సీల్లో ఒకరు 100 స్కోర్ పాయింట్లు సాధించారు.

బాలికల్లో టాప్ తెలుగు అమ్మాయిలే..

కాగా 100 స్కోర్ పాయింట్లు తర్వాత మంచి పాయింట్లు సాధించిన వారిలో బాలికలు నిలిచారు. బాలికల విభాగం.. టాప్ టెన్‌లో 99.99 నుంచి 99.97 స్కోర్ పాయింట్లు సాధించిన పది మంది పేర్లను ఎన్‌టీఏ ప్రకటించింది. వారిలో టాప్‌లో మీసాల ప్రణీతి శ్రీజ, రామిరెడ్డి మేఘన, మేధా భవానీ గిరీష్, సీమల వర్ష, అయ్యాలపు రితిక, పీలా తేజ శ్రీ, వాకా శ్రీవర్షిత, గరిమా కల్రా, గున్‌వీన్ గిల్, వాణి గుప్తా ఉన్నారు. వీరిలో తెలుగు అమ్మాయిలే అధికం కావడం విశేషం. ఇక ఓబీసీ కేటగిరీలో బావురుపూడి రిత్విక్, ఈడబ్ల్యూఎస్‌లో మల్లాని తుషార్, దుంపల ఫణీంద్రనాథరెడ్డి, పెందుర్తి నిశ్చల్ సుభాష్, ఎస్సీ కేటగిరీలో కొమరావు వివేక్ వర్ధన్, ఎస్టీల్లో ధీరావత్ తనూజ్, ఉద్యావత్ సాయి లిఖిత్, దివ్యాంగుల్లో బి.శశాంక్, తుమ్మల తిలోక్‌లున్నారు.

రెండో విడత దరఖాస్తులకు మార్చి 7 చివరి తేదీ..

జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు తొలి విడత జేఈఈ మెయిన్ పరీక్షలు నిర్వహించారు. బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పేపర్–1కు 8,60,064 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8,23,967 (95.80 శాతం) మంది పేపర్–1 రాశారు. అలాగే బీఆర్క్, బీప్లానింగ్ కోర్సులకు ఉద్దేశించిన పేపర్–2కు 46,465 మంది దరఖాస్తు చేశారు. పేపర్–2ను 95 శాతానికి పైగా రాశారు. కాగా జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మంగళవారం (ఫిబ్రవరి 7) నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆరంభమైంది. మార్చి 7 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 4వ వారంలో అభ్యర్థుల అడ్మిట్ కార్డులను విడుదల చేయనున్నారు.

తొలివిడత జేఈఈ మెయిన్‌లో 100 స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థులు

గుల్షన్ కుమార్, ద్యానేష్ హేమేంద్ర షిండే, దేశాంక్ ప్రతాప్ సింగ్, సోహమ్‌దాస్, వావిలాల చిద్విలాస్ రెడ్డి, అపూర్వ సమోట, దుగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, ఎన్‌కే విశ్వజిత్, నిపుణ్ గోయల్ రిషి కల్రా, మయాంక్ సోనీ, క్రిషి గుప్తా, సుతార్ హర్షుల్ సంజయ్ భాయ్, బిక్కిన అభినవ్ చౌదరి, అమోఘ్ జలాన్, అభినీత్ మాజేటి, ధ్రువ్ సంజయ్ జైన్, అషిక్ స్టెన్నీ, కౌషల్ విజయ్ వెర్గియా.



సత్యం కోసం పనిచేయడంలో విఫలమైనవాళ్లు జీవితపు పరమోద్దేశాన్ని వదులుకున్నట్టే.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, ఫిబ్రవరి, 8

భూప్రళయం... జన విలయం

పేకమేడల్లా కూలిన అపార్ట్‌మెంట్లు... నేలకొరిగిన ఎత్తైన స్తంభాలు... నిలువునా చీలిన విమానాశ్రయ రన్‌వేలు... ధ్వంసమైన ఆసుపత్రులు... వేలకొద్దీ మృతులు, క్షతగాత్రులు... లక్షల్లో నిరాశ్రయులు... ఇది కనివిని ఎరుగని భూప్రళయం. కన్నీరాగని జన విలయం. సిరియా సరిహద్దులకు సమీపంలో టర్కీ (నూతన నామం తుర్కియా) ఆగ్నేయ ప్రాంతంలో, ఆ పొరుగునే వాయవ్య సిరియాలో సోమవారం తెల్లవారుజామున తీవ్రస్థాయిలో వచ్చిన భూకంపం, ఆపైన ఆగని ప్రకంపనల దృశ్యాలు కదిలించేస్తాయి. 2021 ఆగస్ట్‌లో దక్షిణ అట్లాంటిక్‌లో వచ్చిన ప్రకంపన తర్వాత అమెరికా భూగర్భ సర్వేక్షణ సంస్థ రికార్డ్ చేసిన ప్రపంచంలోని అతి పెద్ద భూకంపం ఇదే. ఇప్పటికి కనీసం 5 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 6 వేల భవనాలు కుప్పకూలాయి. మరో 11 వేల భవనాల పరిస్థితీ అనధికారికంగా అలానే ఉంది. అంకెలు శరవేగంతో మారుతుండడంతో మృతుల సంఖ్య 10 వేలు దాటినా ఆశ్చర్యం లేదు. బాధితుల సంఖ్య 2.3 కోట్ల దాకా ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్క. ఇది 21వ శతాబ్దిలోకెల్లా అతి పెద్ద ప్రకృతి వైపరీత్యం అంటున్నది అందుకే.

భూఉపరితలానికి దిగువన భూఫలకాల మధ్య ఘర్షణతో భూకంపాలు వస్తాయని లెక్క. ప్రపంచంలో ప్రధానంగా అరేబియన్, యురేషియన్, ఇండియన్, ఆఫ్రికన్, మరో చిన్నదైన అనటోలియన్ భూఫలకాలున్నాయి. మధ్యప్రాచ్యంలో భూకంపాలకు ఇవే కారణం. తాజాగా అనటోలియన్, అరేబియన్ భూఫలకాల మధ్య 100 కిలోమీటర్ల పైగా దూరం పగులు, ఒరిపిడితో 7.8 రిక్టర్ స్కేల్ స్థాయి భూకంపం టర్కీ, సిరియాలను తాకింది. టర్కీలో చారిత్రక గాజియన్‌టెప్ సమీపంలో జన సమ్మర్ద ప్రాంతంలో భూకంప కేంద్రం నెలకొంది. సోమవారమే 12 గంటల్లో 3 సార్లు భూమి కంపించింది. రెండోరోజూ 2 తీవ్ర కంపనలొచ్చి, సిరియా, లెబనాన్, ఇజ్రాయెల్‌లలో ప్రభావం చూపాయి. భూకంప అనుబంధ అనంతర ప్రకంపనలైతే డజన్లలో వస్తున్నాయి. వారసత్వ కట్టడాలూ దెబ్బతిన్నాయి.

హృదయవిదారక జగత్ప్రళయ దృశ్యాలతో, వేలాది మరణాలు సంభవించిన భూకంప బాధిత ఆగ్నేయ ప్రావిన్సులు పదింటిలో మూడు నెలలు ఎమర్జెన్సీ విధించారు టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్. ఒక పక్క వాన, మరోపక్క చలికాలపు మైనస్ డిగ్రీల అతి శీతల గాలుల్లో సహాయక చర్యలూ కష్టమే. శిథిలాల కింద నుంచి ఆర్తనాదాలు, మూలుగులు వినిపిస్తున్నా వారిని కాపాడే వ్యక్తులు, వసతులు కరవయ్యాయి. కొనవూపిరితో కొట్టుకుంటున్నవారూ చలిలో గడ్డకట్టుకు పోతున్న పరిస్థితుల్లో... వట్టి చేతులతోనైనా శిథిలాలను తవ్వి అయినవాళ్ళను కాపాడుకోవాలన్న విఫల ప్రయత్నాలు సాగుతున్న వేళ... భారత్ సహా 45 దేశాలు మానవతా దృక్పథంతో అత్యవసర సామగ్రితో సాయానికి దిగాయి.

అసలే యుద్ధంతో, భౌగోళిక రాజకీయాలతో, ఆపైన కరోనాతో, తర్వాత కలరాతో కన్నీట మునిగిన సిరియాకు తాజా భూకంపం దెబ్బ మీద దెబ్బ. యుద్ధంతో ఆ దేశం వదిలి దక్షిణ టర్కీలో క్రిక్కిరిసిన పరిస్థితుల్లో బతుకీడుస్తున్న వారికీ, సిరియాలోనే తిరుగుబాటుదారుల చేతిలోని ఇడ్లిబ్ నగరంలో చమురు కొరత, ఆకాశాన్నంటే ధరల మధ్య అంతర్జాతీయ మానవతా సాయంతో ప్రాణాలు నిలబెట్టుకుంటున్నవారికీ ఇప్పుడు కాలి కింద భూమినీ ప్రకృతి లాగేసింది. వైట్ హెల్మెట్స్ లాంటి సంస్థలు సేవలందించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నా, సామగ్రి కొరతతో కష్టమవుతోంది. ఈ అత్యవసర సమయంలోనూ శరణార్థుల సాయానికి దోవలన్నీ సిరియా మూతబెడితే, బాధితులకు కనీసం తిండి, మంచినీళ్ళు, మందులు అందేదెలా? దౌత్య, రవాణా వసతుల పరంగా పెను సవాలైన దీన్ని అంతర్జాతీయ సమాజం పరిష్కరించకుంటే ఇది మరో పెను మానవవిషాదం.

నిజానికి, భౌగోళికంగా భూకంప ప్రేరక ప్రాంతంలో టర్కీ ఉంది. టర్కీ, సిరియా, జోర్డాన్లున్న తూర్పు మధ్యధరా ప్రాంతాన ఆఫ్రికన్, అరేబియన్, యురేషియన్ భూఫలకాల మధ్య సంక్లిష్ట సంబంధాలున్నాయి. అనటోలియన్ బ్లాక్ సరేసరి. అందుకే, టర్కీలో శతాబ్దాలుగా భూవిలయాలు పరిపాటి. అక్కడ 1939 నాటి భూకంపంలో 33 వేల మంది చనిపోయారు. ఈసారి ఈ శతాబ్దిలోకెల్లా బలమైన భూకంప తాకిడితో ఆ దేశం చిగురుటాకులా వణికింది. లోతైన భూకంపాలు సంభవిస్తే వాటి తాకిడి భూ ఉపరితలానికి తాకేసరికి చాలావరకు శక్తి కోల్పోయి, కొంత తక్కువ నష్టం కలిగిస్తాయి. కానీ, లోతు లేని భూకంపాలు శక్తిమంతంగా పైకి తాకి, పెను విధ్వంసం రేపుతాయి. తాజా భూకంపం అలాంటిదే. అయితే ఈ ప్రకృతి వైపరీత్యాన్ని ముందే ఊహించి, హెచ్చరించే వ్యవస్థలు నేటికీ లేవు. కాంతి వేగం కన్నా చాలా నిదానంగా, సెకనుకు 5 నుంచి 13 కి.మీ.ల దూరం ప్రయాణించే భూకంప తరంగాలు ఉపరితలం చేరడానికి సెకన్ల ముందే తెలుసుకోగలుగుతున్నాం.

టర్కీతో పోలిస్తే హిమాలయ ప్రాంతానికి భూకంపాల ముప్పు ఎక్కువ. ఉపరితలం కింద ఒత్తిడి అనూహ్యంగా పేరుకున్న హిమాలయాల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. భారత్‌లో 59 శాతం ప్రాంతానికి అలా ప్రమాదం పొంచివుంది. టర్కీ ఘటన మనకు మేలుకొలుపు. దీన్నుంచి తక్షణం పాఠాలు నేర్చుకోవాలి. రెండు వారాల క్రితం నేపాల్‌లో భూకంపం తాలూకు ప్రకంపనాలు ఉత్తర భారతదేశంలో అనేక ప్రాంతాల్లో కనిపించాయని మర్చిపోరాదు. ఏటా జనవరి 16న జాతీయ భూకంప దినం జరుపుతూ నేపాల్ లాంటివి జనచైతన్యం పెంచుతుంటాయి. అలాంటి ఆలోచనల్ని మనమూ ఆచరణలో పెట్టాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకొనే కన్నా తెలివిగా, ముందుజాగ్రత్తతో ఉండాలి. ముందస్తుగా కార్యాచరణకు సిద్ధమవ్వాలి. బాధిత దేశాల పునరుజ్జీవనానికి చేయూతనిస్తూనే ఈ పనిలోకీ దిగాలి. హృదయ విదారక ప్రళయసదృశ దృశ్యాలు గుర్తుచేస్తున్నదదే.

లయ తప్పిన రిట్రీట్ ధ్వని

కామెంట్



కరణ్ థాపర్

గణతంత్ర దినోత్సవ ముగింపులో చేసే 'బీటింగ్ రిట్రీట్ మార్చ్'లో సంగీతం మారి ఉండవచ్చు, కానీ బీటింగ్ రిట్రీట్ భావనను మనం పరిరక్షించుకుంటూ వచ్చాము. దాన్ని ఎన్నడూ విదేశీయమైనదిగా మనం భావించలేదు. అది భారతీయ సైన్యంలాగే భారతీయతతో కూడి ఉండేది. మనకు ఈరోజు ఉన్న సైన్యం కూడా బ్రిటిష్ వారు రూపొందించిందే. బీటింగ్ రిట్రీట్‌కి ఉన్న బ్రిటిష్ మూలం కారణంగా అది మనకు చీకాకు కలిగించలేదు. నిజానికది వారసత్వంగా వచ్చిన విలువలకు, సంప్రదాయాలకు ప్రతీకగా గౌరవం పొందుతోంది కూడా. అయితే ఎప్పటికీ ఈ ప్రాధాన్యం ఉంటుందా?

మీరు ఎంత ముసలివాళ్లయితే, అంత ఎక్కువగా గతాన్ని పట్టుకుని వేళ్లాడతారని చెబుతుంటారు. అది తప్పకుండా నిజమేనని నేను తలుస్తున్నాను. గత వారం గణతంత్ర దినోత్సవ ముగింపు వేళ జరిపే 'బీటింగ్ రిట్రీట్'పై నా చికాకుతో కూడిన స్పందనకు ఇది ఒక విశ్వసనీయ వివరణలా కనిపిస్తుంది. నేను దాన్ని ఇష్టపడలేదు. కానీ నేను ఈ విషయాన్ని తర్వాత పేర్కొంటాను. ఓ వారం క్రితం నేను చూసిన ఆ కార్యక్రమం నేపథ్యం గురించి మొదట నన్ను వివరించనీయండి. నేను దానిపై ఇలా అనుభూతి చెందుతున్నాను.

బీటింగ్ రిట్రీట్ ఒక మిలిటరీ వేడుక. బహుశా రెండవ జేమ్స్ ఇంగ్లండ్ రాజుగా ఉన్నప్పుడు 17వ శతాబ్దంలో ఇది ప్రారంభమైంది. ఒక రాత్రిపూట సైనిక దళాలు తిరోగమిస్తున్నప్పుడు యుద్ధ ముగింపునకు సంకేతంగా బీటింగ్ రిట్రీట్‌ని మొదలెట్టారు. 1950లలో భారత దేశం కూడా రిపబ్లిక్ డే ఉత్సవాలకు సంబంధించి మూడురోజుల ముగింపు సందర్భంగా ఈ భావనను బ్రిటిష్ సంప్రదాయం నుంచి అరువు తెచ్చుకుంది. సంవత్సరాలు గడిచే కొద్దీ ఇంగ్లిష్ కవాతుల నుంచి భారతీయులే స్వయంగా స్వరపర్చడం వరకు 'బీటింగ్ రిట్రీట్ మార్చ్'లో సంగీతం మారి ఉండవచ్చు, కానీ బీటింగ్ రిట్రీట్ భావనను మాత్రం మనం పరిరక్షించుకుంటూ వచ్చాము. నిజానికి దాన్ని మనం ఆదరిస్తూ వచ్చాము. దాన్ని ఎన్నడూ విదేశీయమైనదిగా మనం భావించలేదు. అది భారతీయ సైన్యంలాగే భారతీయతతో కూడి ఉండేది. పైగా గుర్తుంచుకోండి. మనకు ఈరోజు ఉన్న సైన్యం కూడా బ్రిటిష్ వారు రూపొందించిందే. బీటింగ్ రిట్రీట్‌కి ఉన్న బ్రిటిష్ మూలం కారణంగా అది మనకు చికాకు కలిగించలేదు. నిజానికది వారసత్వంగా వచ్చిన విలువలకు, సంప్రదాయాలకు ప్రతీకగా గౌరవం పొందుతోంది కూడా.

గణతంత్ర దినోత్సవ సందర్భంగా బీటింగ్ రిట్రీట్‌కే నేను ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుంటాను. నిస్సందేహంగా, సైనికుల కవాతు కచ్చితత్వం చూసి ఆశ్చర్యపడుతుంటాను. భూమ్యాకర్షణ శక్తిని సైతం డేర్ డెవిల్స్ ధిక్కరించడాన్ని చూస్తూ ఆశ్చర్య చకితుడినవుతుంటాను. నేను దాన్ని తోసిపుచ్చలేను. కానీ రిట్రీట్ సంగీతం; నార్త్, సౌత్ బ్లాక్



వెనుక నిలిపి ఉంచిన బ్యాండ్‌ల వర్ణరంజితమైన యూనిఫాంలు, రక్షణ గోడ వద్ద ఉన్న ఒంటెలు, చివరగా దిగంతాల వద్ద సూర్యుడు అస్తమించే సమయం ఎల్లప్పుడూ నన్ను వెంటాడుతుంటుంది. నా జ్ఞాపకాల్లో ఎన్నటికీ నిలిచి ఉండిపోయింది ఏమిటంటే రైసినా హిల్స్‌ని అధిరోహిస్తూ, 'సారే జహాసే అచ్ఛా... హిందూ సితా హమార హమారా' అని ఆలపిస్తూ ఉండే రిట్రీటింగ్ బ్యాండ్లు. వారు శిఖరాన్ని సమీపిస్తున్నప్పుడు సూర్యుడు అస్తమించడం ప్రారంభమవుతుంది. వెంటనే లెక్కలేనన్ని పసుపు పచ్చ దీపాలు మొత్తం విస్టాను ప్రకాశవంతం చేసేవి. ఇది ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తేది. నేటి పదజాలాన్ని ఉపయోగించి చెప్పాలంటే... అదొక విస్మయం కలిగించే క్షణం.

అయ్యో... అది చాలావరకు ఇప్పుడు ఒక చరిత్రగా మిగిలిపోయింది. ఇక అది జరగని పని. ప్రారంభ ప్రయత్నంగా మార్పు చేసిన సంగీతం భయానకమైనది కాకున్నా, కఠోరంగా ఉంటోంది. భారతీయ లేదా బ్రిటిష్ మూలానికి చెందినవైనా సరే పాదతాడనంతో చేసే సైనిక కవాతుల సంగీతం ఇకపై వినిపించదు. దీని స్థానంలో రాగాలు వచ్చి చేరాయి. సైనిక వేడుకల్లో వాటికి తావులేదు. వీటిని ఇంట్లో లేదా కాన్సర్ట్ హాల్‌లో అయితే బాగా ఆస్వాదించవచ్చు. విజయ్ చౌక్‌లో సైనిక బ్యాండ్లు ఆలపించేవి కాదు. మరీ ఘోరమైన విషయం ఏమిటంటే, ఈ సంవత్సరం ఆలపించిన బీటింగ్ రిట్రీట్ రాగం (ఇది సరైన పదమే అయితే) ఏమాత్రం లయబద్ధంగా లేదు. మాధుర్యంతోనూ లేదు. దీంట్లో సంగీతం కంటే రొద మాత్రమే ఎక్కువగా ఉండింది. అది నరకద్వారంలో ఎవరైనా ఊహించే రొదలా ఉండింది కానీ స్వర్గలోకపు ద్వారాల వద్ద వినిపించే సంగీతంలా లేదు. ఈ ఒక్క మార్పు దాని అర్థాన్ని మాత్రమే కాదు, బీటింగ్ రిట్రీట్ తక్షణ సారాన్నే ధ్వంసం చేసిపడేసింది. అయినా సరే ఎవరైనా దీన్ని పరిగణిస్తారా? దీనిలోని ఇతర అంశాలు కూడా అదృశ్యమైపోయాయి. ఎత్తయిన ప్రాంతంలో ఉన్న గంటల నుంచి వినిపించే దాని శ్రావ్యమైన మాధుర్యం కూడా పరిత్యజించబడింది. భవనాలను వెలిగించే లక్షలాది పసుపుపచ్చ బల్బుల స్థానంలో బహుళరంగులు గోడలపై ప్రదర్శితమవుతున్నాయి. అంతకు ముందున్నవి ధ్వనింపజేసే ఆశ్చర్యం, ఆనందం స్థానంలో ఇప్పుడు ఒక యాంటీ క్లైమేట్‌ని తలపించే నీరసమైన అసంతృప్తి చోటు చేసుకుంది.

బీటింగ్ రిట్రీట్‌లోని ఆనాటి మ్యాజిక్ కనుమరుగైనట్లు కనిపిస్తోంది. ఒక సాధారణమైన, ఉత్తేజపూరితం కానిది మాత్రమే మనకు ఇప్పుడు మిగిలింది. ఒకప్పుడు బీటింగ్ రిట్రీట్‌కి చెందిన అద్భుతం కానీ, మనోహర దృశ్యం కానీ ఇప్పుడు లేవు. మనకు జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. కాలంతోపాటు అవి కనుమరుగైపోతాయి. గత వారం రిట్రీట్ సందర్భంగా వర్షం కురిసినప్పుడు, దేవుళ్లు సైతం విలపిస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. అది తగిన స్పందనలాగే కనిపించింది. ప్రపంచం మారుతోందనీ, ఆ మార్పు వెనకాలే నేను మిగిలిపోయాననీ గుర్తించాను. అందుకే నేను విషాదంతో ఉన్నాను. అందుకే నేను ఇంత ప్రతికూల దృక్పథంతో ఉంటుండవచ్చు. చివరగా, నేను ముందుకేసి చూస్తున్నప్పుడు, నా మనస్సును రెండు ప్రశ్నలు చుట్టుముట్టాయి. ఇక్కడ చుట్టుముట్టడం అనేది సరైన పదం. ఎందుకంటే వాటికి నేను సమాధానం చెప్పలేను మరి. సారే జహా సే అచ్ఛా పాట పాడి ఎంతకాలమైంది! కచ్చితంగా దాని మూలాలే ఆ పాటను అనుమానించేలా చేశాయా? అలాగయితే బీటింగ్ రిట్రీట్ ఎప్పుడు ముగిసిపోతుంది? ఏమైనా దాని వలసవాద చరిత్రను మీరు తోసిపుచ్చలేరు కదా. పైగా అది ఆత్మనిర్భర్ కాదు కూడా మరి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆపన్నహస్తం



టర్కీలో వచ్చిన భయానక భూకంపం నేపథ్యంలో ఇజ్రాయిల్ అక్కడికి 150 మంది భద్రతా, వైద్య బలగాలను పంపింది. స్నేహహస్తం ఇవ్వడం (ఆపరేషన్ ఆలివ్ బ్రాంచ్) మొదలైంది.

– అవీవా క్లోంపాస్, ఇజ్రాయిల్ రచయిత్రి

ఇదా స్నేహం?



టర్కీకి పునరావాస సామగ్రిని మోసుకెళ్తున్న భారత విమానానికి పాకిస్తాన్ తన గగనతలాన్ని నిరాకరించింది. టర్కీకి పాకిస్తాన్ ఎలాంటి మిత్రదేశమో చూడండి.

– ఇంతియాజ్ మహమూద్, స్వేచ్ఛావాది

ఎలా తెలుసు?



వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మోడెర్నా కంపెనీ సీఈఓ తనకు మహమ్మారి రాబోతోందని తెలుసునని అన్నారు. అందుకే టీకాల ఉత్పత్తి పెంచామని చెప్పారు. ఆయనకు ఎవరు చెప్పారు?

– బెర్నీ స్పాఫోర్త్, కామెంటేటర్

అదే ఉదారతా?



మన అల్ప ప్రమాణాల భారతీయ ఉదారవాదుల లెక్కల్లో చూసినా కూడా... ఉదారవాది అని నిరూపించుకోవడానికి మొన్న మరణించిన పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్‌ను కూడా పొగడటం మరీ అతిగా లేదూ!

– బి. రూప, వ్యాఖ్యాత

అర్థమౌతోందిగా!



మనకు రాజకీయ, మత విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ మనల్ని మనం గౌరవించుకోవచ్చు. మనం విదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు అక్కడ కేవలం భారతీయులం అవుతాము. హిందూ ఇండియన్, ముస్లిం ఇండియన్ అని ఉండరు. నేనేం చెప్తున్నానో మీకు బాగా తెలుసు...

– ఉర్ఫీ జావేద్, నటి

భావజాల సమస్య



తీవ్ర వామపక్షీయులలో నాకు నచ్చేది ఇదే. కోవిడ్ టీకాలు, ఆదేశాల మీద నా అభిప్రాయం ఎంత తప్పో అని వాళ్లు నాతో వాదించాలనుకుంటారు. నిజానికి వాళ్లకు నచ్చిన ఆ విధానాలను రూపొందించడంలో సాయపడిన లోపలి మనుషుల్లో నేనూ ఒకడినని వాళ్లు అంగీకరించరు. కొందరు ఎప్పటికీ మేలుకోరు.

– ర్యాన్ కన్నింగ్‌హామ్, అమెరికా పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్సర్

సగం పంజాబే చాలా?



ఈ అన్ని సోకాల్డ్ 'ఖలిస్తానీ రిఫరెండాల్లో', వాళ్లు ఎప్పుడూ 'ఇండియా పాలనలో ఉన్న పంజాబ్' అనే ప్రస్తావిస్తారు– అంతేగానీ మిగతా పంజాబ్ ఊసెత్తరు. ఆఖరికి సిక్కు సామ్రాజ్యపు గొప్ప రాజధాని నగరం అయిన లాహోర్ సహా. ఖలిస్తానీలు ఎప్పుడూ నాన్‌కానా సాహిబ్, ఖర్తార్‌పూర్ లాంటివాటి గురించి కూడా డిమాండ్ చేయరు. ఎందుకు?

– హిందోల్ సేన్‌గుప్తా, రచయిత

విశ్వ కథాప్రేమికుడు

'అక్షరాలు, అందులోంచి వచ్చిన భాష, భాషను సానబట్టి అందించిన సాహిత్యం – నా జీవితాన్ని ప్రేమతో నింపాయి. మనుషులను ప్రేమించగలగడం అనే గొప్ప వరాన్ని నాకు అందించేయి. మానసికమైన ఆరోగ్యాన్ని, ఆరోగ్యకరమైన ఆలోచనల్ని సాహిత్యం నాకు ప్రసాదించింది. సాహిత్య సృజనకు అక్షరాలే ప్రాణం కదా! అక్షరాలకు జేజేలు' అంటూ అక్షరగానం చేసిన సాహిత్య పిపాసి భమిడిపాటి జగన్నాథరావు... కథకుడు, కథా విశ్లేషకుడు, కథాప్రేమికుడు. అంతకు మించి మంచి కథల పాఠకుడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ పదవుల్లో పనిచేసి... చివర్లో జాయింట్ డైరక్టరుగానూ పనిచేసి, 'ప్రెస్ సెక్రటరీ టు ది గవర్నమెంట్ ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్'గా 1992లో పదవీ విరమణ పొందారు.

ఎనభై తొమ్మిదేళ్ల వయసులో కూడా 'ఈ నాటికీ చదవడమే నాకిష్టం. నిత్యం చదువుతాను. సాహిత్యంలో అన్ని ప్రక్రియలకు చెందిన పుస్తకాలు అందులో ఉంటాయి. కానీ నా ప్రాధాన్యం మాత్రం కథే. కథలంటే నాకు అమితమైన ఇష్టం' అని చెప్పుకునే భమిడిపాటి జగన్నాథరావు నూటికి నూరుపాళ్లూ అచ్చమైన కథాప్రేమికుడు. మంచి కథలను చదివి ఆనందించడమే కాదు, తను చదివిన ప్రతి మంచికథనూ, కనిపించిన పదిమందికీ చెప్పి, కనిపించని వంద మందిచేత ఆ కథను చదివించి ఆనందింప జేయడం ఆయనకున్న గొప్ప లక్షణం. మంచి కథలను ప్రేమించడమే కాదు, కథలు రాసే వారిని అభిమానించడం, కథలు చదివేవారిని గౌరవించడం భమిడిపాటి మరో గొప్పలక్షణం.



భమిడిపాటి జగన్నాథరావు (1934–2023)

1952లో రాసిన 'వరహీనం' కథతో సాహిత్య లోకంలోకి అడుగుపెట్టిన భమిడిపాటి జగన్నాథరావు, తన కథారచయిత జీవితం మొత్తంలో రాసిన కథలు 'భమిడిపాటి జగన్నాథరావు కథలు', 'మువ్వలు', 'అడుగుజాడలు' అనే కథా సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. ఆయన కథలపై సహ రచయితలు రాసిన వ్యాసాలు, పుస్తకాలపై వచ్చిన సమీక్షలు కలిపి 'పరస్పరం' వెలువడింది.

'జగన్నాథరావు శైలి ఆయనంత సింపుల్. ఇతివృత్తాన్ని బట్టి ముందు వెనుకలకి కథను నడిపిస్తారు... అటు వైయక్తిక జీవితంలో, కథకుడిగానూ ఆయనది సమగ్ర దృష్టి. హోలిస్టిక్ అప్రోచ్. మనిషి పరిపూర్ణ వికాసం ఆయన కథల్లోని కథ. మానవత్వం నుంచి దైవత్వానికి అది తొలిమెట్టు' అంటూ కప్పగంతుల మల్లికార్జునరావు కితాబు నిచ్చారు. 'ఆయనతో ఎవరైనా అరగంట గడిపితే, కనీసం పది ఆణిముత్యాల్లాంటి తెలుగు కథల గురించి వివరాలు తెలుస్తాయి. పాత, కొత్త, పెద్ద, చిన్న భేదం లేకుండా కేవలం మంచి కథలని పలవరించడమే ఆయనకి అత్యంత ఆప్తవ్యాపకం' అంటూ వి. రాజా రామమోహనరావూ ప్రశంసించారు. భమిడిపాటి జగన్నాథరావు – 1996లో 'బుచ్చిబాబు స్మారక పురస్కారం', 1997లో 'జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు పురస్కారం', 2003లో 'పులికంటి సాహితీ సత్కృతి పురస్కారం' అందుకున్నారు. 'తెలుగు కథ అందలాలు ఎక్కినా, నేలమీదే కాళ్లు ఊని, సాంఘిక, సామాజిక, రాజకీయ పరిణామాల ఉరవడిలో తెలుగు జీవితాన్ని తాత్త్విక సూత్రాలలో ఇముడ్చుకొని, పాఠకులను ఆలోచింపజేసి కదిలించగలిగింది' అంటూ తెలుగు కథల గొప్పతనాన్ని కథలు కథలుగా చెప్పే భమిడిపాటి జగన్నాథరావు... 1934 డిసెంబర్ 1న పశ్చిమ గోదావరి జిల్లా గుడివాడలో జన్మించారు. 2023 ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అజరామరం.

– సింగంపల్లి అశోక్ కుమార్, కవి, విమర్శకుడు I మొబైల్: 92462 77375

(కథా రచయిత భమిడిపాటి జగన్నాథరావు ఫిబ్రవరి 6న మరణించారు.)

ఏపీ ప్రతిపాదిత పెన్షన్ విధానంపై కేంద్రం ఆసక్తి

విశ్లేషణ



పి. వైద్యనాథన్ అయ్యర్

కొత్తదా? లేక పాతదా? ఉద్యోగుల పింఛన్ల విషయంలో ఇప్పుడు దేశంలో చెలరేగుతున్న చర్చ ఇది. దాదాపు నాలుగు రాష్ట్రాలు మళ్లీ పాత పింఛన్ విధానం వైపు మళ్లాయి. అలాగే మహారాష్ట్రలోని శివసేన (షిండే)–బీజేపీ కూటమి ప్రభుత్వం కూడా పాత పింఛన్ విధానం పట్ల మొగ్గు చూపుతున్నదన్న వార్త నేపథ్యంలో మొదలైన చర్చకు ఇప్పుడు ఇంకో కొత్త, వినూత్నమైన కోణం వచ్చి చేరింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన సరికొత్త పింఛన్ విధానం కేంద్ర ప్రభుత్వాన్ని సైతం ఆకర్షించడమే ఆ కోణం. 2004 తరువాత ఉద్యోగాల్లో చేరినవారు తమ జీతాల్లోంచి కొంత భాగాన్ని పింఛన్ ఫండ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. అయితే పాత పింఛన్ విధానంలో మాదిరిగా రిటైర్మెంట్ తరువాత కచ్చితంగా నిర్దిష్ట మొత్తం నెలవారీ అందుతుందన్న గ్యారెంటీ మాత్రం లేదు. ఎందుకంటే పాత పెన్షన్ విధానం స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) తాలూకు ప్రయోజనాలు మార్కెట్ల వైఖరిపై ఆధారపడి ఉంటాయి కాబట్టి! ఈ కారణంగానే రాష్ట్రాల్లోనూ, అటు కేంద్రంలోనూ కొంత మంది ఉద్యోగులు తమకు పాత పింఛన్ విధానం కావాలని పట్టుబడుతున్నారు.

ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అటు పాత, ఇటు కొత్త పింఛన్ విధానాల మేలి మేళవింపుగా 'గ్యారెంటీడ్ పింఛన్ స్కీమ్' (జీపీఎస్) పేరుతో వేరొక కొత్త పద్ధతిని ప్రతిపాదిస్తోంది. ఇప్పటికైతే ఈ విషయమై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వద్ద ఇలాంటి ప్రతిపాదన లేకపోయినా, కేంద్రంలోని అధికారులు మాత్రం ఈ సరికొత్త పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు. అంతర్గతంగానైనా జీపీఎస్ లాభ నష్టాలపై చర్చలు చేస్తున్నారు.

ఇంతకీ ఈ కొత్త జీపీఎస్ విధానం ఎలా పనిచేస్తుందని అనుకుంటున్నారా? ఆ విషయాన్నే పరిశీలిద్దాం. ఇందులో ఉద్యోగులకు రెండు ఆప్షన్స్ ఉంటాయి. మూల వేతనంలో పది శాతాన్ని పింఛన్ ఫండ్‌కు ఇవ్వడం ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం అంతే మొత్తాన్ని తన వంతు వాటాగా అందిస్తుంది. రిటైర్మెంట్ తరువాత మీరు చివరగా అందుకున్న వేతనంలో 33 శాతం పింఛన్‌గా పక్కాగా లభిస్తుంది! ఒకవేళ మీరు మీ మూల వేతనంలో 14 శాతం లేదా అంతకంటే ఎక్కువ... పింఛన్ నిధికి చెల్లించారని అనుకుందాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని జోడిస్తుంది. మీ పింఛన్ కూడా చివరి వేతనంలో 33 శాతం కాకుండా 40 శాతం అవుతుంది!!

జీపీఎస్ విధానం గురించి తామిప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు తెలియజేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర స్థాయిలో అమలు చేసేందుకు కేంద్రం అనుమతులేవీ కోరలేదనీ, ఆ అవసరం కూడా రాదనీ అధికారులు చెప్పారు. కానీ... కేంద్ర ప్రభుత్వ అధికారులు జీపీఎస్ మోడల్ ఆసక్తికరంగా ఉందనీ, మరింత వివరంగా పరిశీలన, అధ్యయనం చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

పాత పింఛన్ విధానం ఆర్థికంగా ఏమంత ప్రయోజనకరమైంది కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయంతో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం 2023లో వేతనాలు, పింఛన్‌ల కింద



రూ. 76,590 కోట్లు ఖర్చు అవుతుంది. అయితే 2040 నాటికి ఇదే పద్దు అందుకు రెట్టింపు దాటి, ఏకంగా రూ.1,85,172 కోట్లకు ఖర్చు చేరుకుంటుందనేది అంచనా. పాత విధానాన్ని పునరుద్ధరిస్తే దాని ప్రభావం భవిష్యత్ తరాలపై తీవ్రంగా ఉంటుందని రాష్ట్రం అంచనా వేస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)గానూ వ్యవహరించే కొత్త పింఛన్ విధానంలో ఉద్యోగులకు అందే మొత్తం చాలా తక్కువన్నది కూడా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీలు క్రమేపీ తగ్గుతున్న సమయంలో ఉద్యోగులకు అందే మొత్తం వారి చివరి వేతనంలో 20 శాతం వరకు మాత్రమే ఉంటుందని అంచనా. ఉద్యోగులు జీపీఎస్‌కు అంగీకరిస్తే పింఛన్ మొత్తాదులో 70 శాతం వరకూ పెరుగుదల ఉంటుందని చెబుతోంది.

అయితే కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎన్‌పీఎస్ విధానంలో దాదాపు 9.5 శాతం రాబడులు వస్తాయనీ, ఉద్యోగుల చివరి వేతనంలో 40 శాతం వరకూ పింఛన్ ఉంటుందనీ చెబుతున్నారు. ఎన్‌పీఎస్‌లో యాభై శాతం కచ్చితంగా వస్తుందని చెప్పలేకపోయినా, సృజనాత్మక ఆలోచనతో ఈ సమస్యను పరిష్కరించవచ్చని పేరు చెప్పేందుకు ఇష్టపడని కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. పాత, కొత్త పింఛన్ విధానాల మధ్య ఉన్న పది శాతం అంతరాన్ని కేంద్రం భర్తీ చేయడం ఒక ఆలోచన అనీ, పింఛన్ నిధికి ప్రభుత్వాలు నెలవారీ అందించే మొత్తాన్ని పెంచడం రెండో ఆలోచన అనీ ఆ అధికారి వివరించారు.

కేంద్ర ప్రభుత్వం 2019 ఏప్రిల్ నెల నుంచి పింఛన్ నిధికి చెల్లించే మొత్తాన్ని ఉద్యోగి మూలవేతనంలో 14 శాతానికి పెంచింది. ఉద్యోగి చెల్లించేది పది శాతం మాత్రమే. అయితే దీనిపై కూడా 2004 జనవరి నుంచి 2019 మార్చి మధ్యలో ఉద్యోగాల్లో చేరిన వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎందుకంటే వీరు మూల వేతనంలో పది శాతం పింఛన్ నిధికి చెల్లిస్తే కేంద్రం కూడా పది శాతమే చెల్లించింది కాబట్టి. అంటే... 2019 ఏప్రిల్ నుంచి కొత్తగా చేరిన వారితో పోలిస్తే వీరి పింఛన్ నిధి పెద్దగా పెరగదు.

కేంద్రం అవసరమైతే కొత్త పింఛన్ విధానంలో ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని మరింత పెంచేందుకూ సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే ఉద్యోగులకు అందే పింఛన్ వారి చివరి వేతనంలో సగం వరకూ ఉండే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త ఎన్‌పీఎస్ విధానంలో వచ్చే రాబడులు 30 ఏళ్ల కాలంలో 9 – 10 శాతం ఉంటాయని లెక్కిస్తే ఇది సాధ్యమని వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జీపీఎస్‌పైనా, అమల్లో ఉన్న కొత్త పింఛన్ విధానం ఎన్‌పీఎస్ సాధకబాధకాలపైనా... చర్చలు మరికొంత కాలం జరుగుతాయనీ, 2024 లోక్‌సభ ఎన్నికల సమయానికి ఇవి ఒక కొలిక్కి వచ్చి రాజకీయ ముఖచిత్రంపై కూడా కనిపించవచ్చుననీ అధికారులు అంటున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.తదియ తె.4.28 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి చవితి, నక్షత్రం: పుబ్బ సా.6.56 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.2.40 నుండి 4.22 వరకు, దుర్ముహూర్తం: ప.11.52 నుండి 12.36 వరకు, అమృతఘడియలు: ప.11.58 నుండి 1.44 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.54.

క్లుప్తంగా...

శ్రీశైలం మల్లన్న తలపాగాకు ప్రత్యేక పూజలు



శ్రీశైలం మల్లన్న తలపాగాను భీమేశ్వరస్వామి ఆలయంలోకి తీసుకువెళ్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలం మల్లికార్జునస్వామికి సమర్పించే 365 మూరల తలపాగాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ పంచారామ క్షేత్రంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన అందే పార్వతీశం, కోటమ్మ దంపతులు దీక్షగా సంవత్సరం పాటు రోజుకు ఒక మూర చొప్పున 365 మూరల మేర ఈ తలపాగా నేశారు. దీనిని ద్రాక్షారామ శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ ఆధ్వర్యాన ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి తీసుకుని వచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులతో ఈ తలపాగాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు పాల్గొన్నారు.

టర్కీకి భారత సైన్య వైద్య బృందం



టర్కీకి పయనమైన భారత సైన్య వైద్య బృందం

దొండపర్తి (విశాఖ దక్షిణ): టర్కీలో సంభవించిన భూకంప ప్రాంతంలో బాధితులకు వైద్య సేవలు అందించేందుకుగాను భారత సైన్య వైద్య బృందం అక్కడికి పయనమైంది. ఆగ్రా ఆర్మీ ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 89 మంది సభ్యుల వైద్య బృందాన్ని ప్రభుత్వం టర్కీకు పంపించింది. ఇందులో ఆర్థోపెడిక్ సర్జికల్, జనరల్ సర్జికల్ స్పెషలిస్ట్, మెడికల్ స్పెషలిస్ట్ టీంతో పాటు మెడికల్ స్పెషలిస్ట్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ టీంలు ఉన్నాయి. 30 పడకల వైద్య సదుపాయంతో పాటు ఎక్స్ రే యంత్రాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ కార్డియాక్ మానిటర్లు, ఇతర అనుబంధ పరికరాలను బృందం తీసుకువెళ్లింది.

చెట్ల నరకడంపై విచారణ చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీకాకుళం జిల్లా తొగిరి గ్రామంలో చెట్ల నరికివేతపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను జాతీయ హరిత ట్రిబ్యునల్ చెన్నై ధర్మాసనం ఆదేశించింది. కుమ్మరి గుంట గ్రామంలోని సర్వే నంబర్ 360లో ప్రైవేటు భవనాలు నిర్మిస్తున్నారని, సర్వే నంబర్ 452/2లో 150 ఏళ్లనాటి చెట్లు నరికేశారంటూ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్, యాంటీ కరప్షన్ అనే ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల జస్టిస్ పుష్ప సుబ్రహ్మణ్యం, విషయ నిపుణుడు సత్యగోపాల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ''చెట్ల నరికివేతపై జిల్లా కలెక్టర్ విచారణ చేసి 4 వారాల్లో నివేదిక అందజేయాలి'' అని ధర్మాసనం ఆదేశించింది.

టీడీపీ నేత పొలంలో గంజాయి సాగు

గాండ్లపెంట: శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం గుండేవాండ్లపల్లికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ వీరంనాయుడు తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసింది. కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ తెలిపిన వివరాలు.. గ్రామ సమీపంలోని గంగమ్మమోరులో ఉన్న సర్వే నంబర్ 245లోని వీరంనాయుడు పొలంలో గంజాయి మొక్కలను మంగళవారం పోలీసులు గుర్తించారు. ఎవరు సాగు చేస్తున్నారని ఆరా తీయగా మాజీ ఎంపీటీసీ వీరంనాయుడు పొలంలో అనుచరుడు రామకృష్ణ సాగు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వచ్చారన్న విషయం తెలుసుకున్న రామకృష్ణ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా..పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. సీఐతో పాటు మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రియ, వీఆర్వో జయరాం పొలాన్ని పరిశీలించారు. వారి సమక్షంలో గంజాయి మొక్కలను తొలగించారు. మాదకద్రవ్య నిరోధక చట్టం కింద రామకృష్ణపై కేసు నమోదు చేశారు. వీరంనాయుడు తన రెండెకరాల పొలంలో వేరుశనగ సాగు చేస్తున్నాడని, పొలం సరిహద్దు పంటగా చుట్టూ మేర సాళ్లల్లో జొన్న గడ్డిని పెంచి అందులో అక్కడక్కడా గంజాయి మొక్కలు పెంచాడని తెలిపారు. పొలం యజమాని అందుబాటులో లేడని, దీనిపై లోతుగా విచారించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.



షిప్.. షిప్.. హుర్రే!

నౌకల నిర్మాణంలో హిందుస్థాన్ షిప్ యార్డు కొత్త అధ్యాయం

నౌకల నిర్మాణం, మరమ్మతుల విషయంలోనూ హిందుస్థాన్ షిప్ యార్డు తనదైన ముద్ర వేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల నిర్మాణంలో దూసుకుపోతూ.. మరోవైపు సాంకేతికతకు పదును పెడుతోంది. భారత నౌకాదళం కోసం నిర్మిస్తున్న షిప్‌లో తొలిసారిగా 3 మెగా వాట్ల భారీ డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి అబ్బురపరిచింది.

-సాక్షి, విశాఖపట్నం

రూ.2,100 కోట్ల ప్రాజెక్టులో వినూత్న ఆలోచనకు శ్రీకారం

- డైవింగ్ సపోర్టు వెసల్ నిర్మాణంలో భారీ డీజిల్ జనరేటర్ల ఏర్పాటు
- నిస్టార్ షిప్ తయారు చేస్తూ ప్రయోగాత్మకంగా ప్రారంభం
- షిప్‌లో తొలిసారిగా 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు

ప్రపంచ దేశాలకు చెందిన సంస్థలు జత కడుతున్న నేపథ్యంలో నౌకా నిర్మాణంలో హిందుస్థాన్ షిప్‌యార్డు సరికొత్త అధ్యాయాల్ని లిఖిస్తోంది. ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులు, నిర్మాణాలనైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు దేశంలోనే అతిపెద్ద ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. తాజాగా భారత నౌకాదళం కోసం డైవింగ్ సపోర్ట్ వెసల్ షిప్‌లో తొలిసారిగా 3 మెగావాట్ల భారీ డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి ఉపక్రమించిన హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) భారత నౌకాదళానికి చెందిన షిప్ తయారీలో ప్రత్యేక వ్యవస్థని అందుబాటులోకి తీసుకొచ్చింది. సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ నౌకా నిర్మాణం, మరమ్మతుల విషయంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. డీప్‌సీ డైవింగ్, సబ్‌మెరైన్ రెస్క్యూ ఆపరేషన్ల కోసం ఐఎన్‌ఎస్ నిస్టార్, ఐఎన్‌ఎస్ నిపుణ్ యుద్ధనౌకల్ని తయారు చేస్తోంది. తొలిసారిగా యుద్ధ నౌకలో 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి చారిత్రక అధ్యాయాన్ని లిఖించింది. ఐఎన్‌ఎస్ నిస్టారాలో గురువారం ఉదయం ఈ భారీ జనరేటర్‌ని ఏర్పాటు చేశారు.



హిందుస్థాన్ షిప్‌యార్డు

ప్రతి షిప్‌లో 5 జనరేటర్లు

సాధారణంగా ప్రతి యుద్ధ నౌకలోనూ 5 జనరేటర్లు ఉంటాయి. నిర్మాణ సమయంలో మొదటి జనరేటర్ సేవలు ప్రారంభిస్తే.. నౌకా నిర్మాణం దాదాపు పూర్తయినట్లేనని భావిస్తారు. ఈ జనరేటర్ ప్రారంభమైతే.. షిప్‌కు కావాల్సిన విద్యుత్ ఉత్పత్తి మొదలవుతుంది. ఇప్పటివరకూ 2 మెగావాట్ల డీజిల్ జనరేటర్లు మాత్రమే వినియోగించారు. కానీ.. నిస్టార్‌కు మాత్రం 3 మెగావాట్ల జనరేటర్‌ని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. షిప్‌యార్డు డిజైన్ మేనేజర్ ఉషశ్రీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు నిరంతరం శ్రమించి దీనిని రూపొందించారు. ఈ జనరేటర్ ప్రారంభంతో నిస్టార్ షిప్ పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయని షిప్‌యార్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది చివరి నాటికి ఐఎన్‌ఎస్ నిస్టార్‌ను భారత నౌకాదళానికి అప్పగించేందుకు షిప్‌యార్డు బృందం నిరంతరం శ్రమిస్తోంది. ఈ యుద్ధనౌక నిర్మాణ ప్రాజెక్టును రూ.2,100 కోట్ల వ్యయంతో హెచ్‌ఎస్‌ఎల్ చేపడుతోంది.

ఐఎన్ఎస్ నిస్టార్ స్వరూపమిదీ..

- ప్రాజెక్ట్ వ్యయం :రూ.2,100 కోట్లు
- బరువు: 9,350 టన్నులు
- పొడవు: 118.4 మీటర్లు
- వెడల్పు: 22.8 మీటర్లు
- స్వదేశీ పరిజ్ఞానం: 80 %

ఇది ఆరంభం మాత్రమే



దేశంలోని 14 షిప్ యార్డులతో పోల్చి చూస్తే.. హిందుస్థాన్ షిప్ యార్డు నాలుగో స్థానంలో ఉంది. రానున్న రెండేళ్లలో కోల్‌కతా షిప్ యార్డ్‌ని అధిగమించి మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రాబోయే నాలుగేళ్లలో నంబర్ వన్‌గా నిలిచేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నాం. షిప్ బిల్డింగ్‌లో పురోగతి సాధించాం. 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు వెనుక షిప్ యార్డు ఉద్యోగులు, కార్మికులంతా ఉన్నారు. ఇది ఆరంభం మాత్రమే. ఇదే ఊపుతో స్వదేశీ పరిజ్ఞానాన్ని.. దేశీయ పరిశ్రమల్ని మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నాం.

– కమాండర్ హేమంత్ ఖత్రీ, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్

మహిళా సర్పంచ్‌పై టీడీపీ రౌడీమూకల దాడి

- పంచాయతీ స్థలం ఆక్రమణను ప్రశ్నించినందుకు దౌర్జన్యం

చంద్రగిరి(తిరుపతి జిల్లా): టీడీపీ నాయకుల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడమే కాకుండా.. ప్రశ్నించినందుకు ఓ మహిళా సర్పంచ్‌పై దాడికి తెగబడ్డారు. ఈ ఘటన మంగళవారం తిరుపతి జిల్లా ముంగిళిపట్టులో జరిగింది. వివరాలు.. ఎం.కొంగరవారిపల్లి సర్పంచ్‌గా జాగర్లమూడి భారతి భారీ మెజారిటీతో గెలుపొందడాన్ని స్థానిక టీడీపీ నాయకులు జీర్ణించుకోలేపోయారు. దీంతో ఆమెపై కక్ష సాధింపులకు పాల్పడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు మునిశేఖర్‌నాయుడు తన ఇంటి ముందు ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి.. అక్రమంగా ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు సర్పంచ్ భారతి.. మునిశేఖర్‌నాయుడికి మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. దీంతో మరింత కక్షగట్టిన మునిశేఖర్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మరికొందరితో కలిసి.. సర్పంచ్ భారతి, ఆమె భర్త దామోదరనాయుడిపై దాడి చేసి దూషించారు. వారి ఇంటి ముందున్న ఇసుకను.. దౌర్జన్యంగా హాలు, వంట గది, పూజ గదుల్లో పోశారు. ఇంట్లోని రూ.50 వేల నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. టీడీపీ నాయకుల దౌర్జన్యంపై సర్పంచ్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10 నుంచి కురుక్షేత్రలో లక్ష చండీ మహా యజ్ఞం

- విశాఖ శారదా పీఠం పర్యవేక్షణలో భారతావనిలోనే తొలిసారి నిర్వహణ
- 1,760 మంది రుత్విక్కుల భాగస్వామ్యం
- మరో 400 మంది బ్రాహ్మణోత్తముల సహకారం
- 55 ఎకరాల విస్తీర్ణంలో యాగ శాలలు, మహా మండపాలు
- 110 హోమ గుండాలు ఏర్పాటు
- 16 రోజుల పాటు నిర్వహణ
- వివరాలు వెల్లడించిన విశాఖ శ్రీ శారదా పీఠం

సింహాచలం: విశాఖ శ్రీశారదా పీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్ర సమీపంలోని షహబాద్‌లో ఈనెల 10 నుంచి 16 రోజులపాటు లక్ష చండీ మహాయజ్ఞం జరగనుంది. దీనికి అష్టోత్తర శత కుండాత్మక అప్రతిహత లక్ష చండీ మహా యజ్ఞంగా నామకరణం చేశారు. భారతావనిలోనే తొలిసారిగా ఈ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మహా యజ్ఞం వివరాలను విశాఖ శ్రీశారదా పీఠం మంగళవారం వెల్లడించింది. గుంతి మాత సంకల్పించిన ఈ భారీ యజ్ఞాన్ని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షిస్తారు. ఈ యజ్ఞాన్ని సందర్శించిన వారికి ద్వాపర యుగంలో ధర్మరాజు చేపట్టిన రాజసూయ యాగం చేయడం వల్ల దక్కిన ఫలితం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున చండీ యజ్ఞాన్ని గతంలో తలపెట్టిన దాఖలాలు లేవు. ఛత్రపతి శివాజీ, పూనా శ్రీమంతులు నిర్వహించినట్టు చరిత్రలో చెప్పుకోవడమే తప్ప ఆధారాలు లేవు. ఇప్పటివరకు సహస్ర, అయుత చండీ యాగాలు మాత్రమే జరిగాయి.



కురుక్షేత్రలో నిర్మించిన యజ్ఞశాలలు

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

వైదిక ప్రపంచంలో కనీ వినీ ఎరుగని ఈ యజ్ఞంలో 22 రాష్ట్రాల నుంచి 1,760 మంది రుత్విక్కులు, వీరికి సహాయకులుగా మరో 400 మంది బ్రాహ్మణోత్తములు మొత్తం 2160 మంది వేద పండితులు ఏకకాలంలో పాల్గొంటారు. వీరిలో సింహభాగం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారే. వీరంతా 110 హోమ గుండాల్లో రోజుకి 7,040 చండీ పారాయణ హోమాలు చేస్తారు. పదహారు రోజులపాటు 1,12,640 చండీ పారాయణ హోమాలు చేస్తారు. ఇందుకోసం 55 ఎకరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. రోజుకి లక్ష మంది సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. ఐదు ఎకరాల్లో యాగశాలలు, మిగిలిన ప్రాంతంలో గుడారాలు, మహా మండపాలు, వసతి, భోజన సదుపాయాలు తదితరమైనవి ఏర్పాటు చేశారు.

టన్నులకొద్దీ విశేష ద్రవ్యాల వినియోగం

యజ్ఞంలో టన్నులకొద్దీ విశేష ద్రవ్యాలను వినియోగిస్తారు. 1,500 టన్నుల స్వచ్ఛమైన నెయ్యి, 8 వేల కిలోల నువ్వులు, ధాన్యాన్ని వినియోగిస్తారు.

మహాయజ్ఞం ఇలా..

- 10వ తేదీ ఉదయం మండప ప్రవేశంతో యజ్ఞం ప్రారంభం
- ఆరోజు మధ్యాహ్నం నుంచి హవనం ప్రారంభం
- ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హవనం
- రోజూ సాయంత్రం 6 గంటలకు మహా హారతి
- నిత్యం సాంస్కృతిక ఆరాధన
- 26వ తేదీ ఉదయం 11.30 గంటలకు మహా పూర్ణాహుతితో మహా క్రతువు పూర్తి

16 రోజుల్లో 41 కిలోల చందనం, పది కిలోల కుంకుమపువ్వు, 550 కిలోల కర్పూరం, 5 వేల కొబ్బరి కాయలు, 16 వేల మారేడు కాయలతో పాటు ఇతర విశేష ద్రవ్యాలు, సమిధలను సిద్ధంచేశారు. దీక్షా వస్త్రాల కోసం 6,600 పంచెలను, 2,200 చొప్పున పంచపాత్రలు, ధర్బాసనాలు, జపమాలలు, చండీ పారాయణ గ్రంథాలు, ఉప వస్త్రాలను బ్రాహ్మణులకు అందిస్తారు.

రేపటి నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

10 రోజుల పాటు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహణ



పుస్తక మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 33వ విజయవాడ పుస్తక మహోత్సవం ఈ నెల 9న ప్రారంభించనున్నట్లు ప్రముఖ ప్రచురణకర్త ఎమెస్కో విజయ్‌కుమార్ చెప్పారు. ఈ నెల 19 వరకు కొనసాగే ఈ మహోత్సవాన్ని విజయవాడలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పుస్తక మహోత్సవం ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహరనాయుడు, లక్ష్మయ్యతో కలిసి విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి 130 మంది ప్రచురణకర్తలు ఈ మహోత్సవానికి తరలిరానున్నారని, 220 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ పుస్తక మహోత్సవాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రారంభిస్తారని తెలిపారు. స్టోరీ టెల్లింగ్, పప్పెట్ షో కార్యక్రమాలు ప్రత్యేకంగా ఉంటాయన్నారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ, సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ వంటి ప్రభుత్వ సంస్థలు కూడా పుస్తక మహోత్సవంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఈ-ఫార్మశీకి వ్యతిరేకంగా 15 నుంచి ఔషధ వ్యాపారుల ఆందోళన

గుంటూరు మెడికల్: ఈ-ఫార్మశీతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, కేంద్రం ఈ-ఫార్మశీని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ కే.పి.రంగారావు అన్నారు. మంగళవారం గుంటూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ-ఫార్మశీకి వ్యతిరేకంగా ఫిబ్రవరి 15 నుంచి దేశవ్యాప్తంగా అన్ని మండలాలు, జిల్లాలు, రాష్ట్ర రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఔషధాల షాపులు మూసివేసి తమ నిరసన, ఆందోళన తెలియజేస్తామన్నారు. ఈ-ఫార్మశీ నిర్వాహకులు చట్టాలను ఉల్లంఘిస్తూ..ప్రజారోగ్యాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. పౌరులకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్‌లో మందులు విక్రయిస్తున్నాయని చెప్పారు. నార్కోటిక్స్, సైకోట్రోపిక్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ పిల్స్ మందులను వైద్యుల సలహాలు లేకుండా ఆన్‌లైన్‌లో విక్రయించడం ద్వారా ప్రజలు కొంత మంది మత్తు మందులకు బానిసలవుతారన్నారు. వైద్యుల సూచనలు లేకుండా పలుమార్లు యాంటి మైక్రోబయల్ రెసిస్టెన్స్ మందులు అమ్మకాలు చేయడం ద్వారా భవిష్యత్తులో యాంటిబయోటిక్ మందులు పనిచేయకుండా మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ-ఫార్మశీలు డేటా గోప్యత, డేటా భద్రత, డేటా సమగ్రత ప్రాథమిక సూత్రాన్ని, వ్యక్తిగత డేటా రక్షణ బిల్లు 2019 ప్రాథమిక సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. కేంద్రం దీన్ని దృష్టిలో పెట్టుకుని జీఎస్ఆర్ 817 (ఈ) డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

టిష్యూ అరటి.. రాబడి మేటి

ఉమ్మడి పశ్చిమలో 1300 ఎకరాల్లో సాగు

- ఎకరానికి రూ.లక్ష వరకూ ఆదాయం
- విపత్తులు, తెగుళ్లు తట్టుకునేలా టిష్యూ అరటి అభివృద్ధి
- రైతులను ప్రోత్సహిస్తున్న ఉద్యానవన శాఖ

బుట్టాయగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అరటికి ఉన్న ప్రాధాన్యం ఎనలేనిది. ఈ నేపథ్యంలో అరటి దిగుబడిని పెంచేందుకు రూపొందించిన టిష్యూ అరటి ఇప్పుడు రైతుల అభిమానాన్ని అందుకుంటుంది. మంచి పరిమాణంలో ఉన్న కాయలతో పెద్ద సైజ్ గెలలతో ఎకరానికి 40 టన్నులు వరకూ అత్యధిక ఇస్తుంది. ఈ టిష్యూ కల్చర్ సాగును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తరింపజేసేలా రైతులను ఉద్యానశాఖ అధికారులు ప్రోత్సహించడంతో సాగు విస్తీర్ణం ప్రతీ ఏడాది పెరుగుతుంది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2500 ఎకరాల్లో టిష్యూ కల్చర్‌లో సుమారు 800 మంది రైతులు అరటి సాగు చేపట్టారు. జిల్లాల విభజనతో కొవ్వూరు తూర్పు గోదావరి జిల్లాలో కలవడంతో.. ప్రస్తుతం భీమవరం, ఏలూరు జిల్లాల పరిధిలో 750 మంది రైతులు సుమారు 1300 ఎకరాల్లో టిష్యూ కల్చర్‌లో అరటి సాగు చేస్తున్నారు. సాధారణంగా అరటి సాగును పిలకల ద్వారా చేస్తారు. కూర అరటి, కర్పూర, చక్కెర కేళి, అమృతపాణి, తదితర అరటి పంటలను పిలకల ద్వారానే సాగు చేస్తారు. అయితే టిష్యూ కల్చర్ సాగు అందుబాటులోకి రావడంతో దీనిపై అవగాహన పెంచుకున్న రైతులు టిష్యూ కల్చర్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

1300 ఎకరాల్లో సాగు

టిష్యూ అరటిలో అధిక ఆదాయం రావడంతో పాటు వాతావరణ స్థితిగతులు, గాలి దుమారాలను తట్టుకునే శక్తి ఉండడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 1300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం మండలాల్లో వర్జీనియా పొగాకు రైతులు కూడా టిష్యూ అరటి తోటల సాగువైపు చూస్తున్నారు. ముఖ్యంగా టిష్యూ అరటితోటలు జిల్లాలోని ముసునూరు, కొయ్యలగూడెం, కామవరపుకోట, చింతలపూడి, ద్వారకా తిరుమల మండలాల పరిధిలో అత్యధికంగా సాగు చేస్తున్నారు. టిష్యూ కల్చర్ అరటిలో గ్రాండ్ 9 రకాన్ని రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసిన అరటి చెట్టు తక్కువ ఎత్తులో 5 నుంచి 5.65 అడుగులు ఉండడంతో గాలి దుమారాలను తట్టుకుంటాయని అధికారులు అంటున్నారు. ఆరోగ్యకరమైన మొక్కల నుంచి కణజాలాన్ని తీసుకుని అభివృద్ధి చేయడం వల్ల తెగుళ్లు దరిచేరవు. ఎకరానికి 1234 మొక్కలు నాటుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన కంపెనీలు ఒక్కో మొక్కను రూ.12కు అందిస్తున్నారు.

అధిక దిగుబడి.. ఆదాయం మేటి

టిష్యూ కల్చర్ ద్వారా చేస్తున్న అరటి దిగుబడి ఎకరానికి 40 టన్నుల వరకూ వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో రైతులకు ఆదాయం కూడా అధికంగా వస్తుంది. టిష్యూ కల్చర్ అరటి ధర కాలాన్ని బట్టి ఉంటుందని అయితే ఎకరానికి రూ. లక్ష వరకూ ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రైతులకు టిష్యూ కల్చర్‌పై అవగాహన కలిగించి సాగు విస్తరణ మరింత పెంచేలా కృషి చేస్తామని అధికారులు అంటున్నారు. టిష్యూ కల్చర్‌లో అరటి సాగుకు ప్రభుత్వం సుమారు రూ. 40,985 వరకూ రాయితీగా ఇస్తుంది. మొదటి దశలో రూ. 30739, రెండో సంవత్సరం రూ. 10,246 చొప్పున రాయితీ ఇచ్చి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.



టిష్యూ కల్చర్ సాగును ప్రోత్సహిస్తాం



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టిష్యూ కల్చర్ అరటి సాగు ప్రతీ ఏటా పెరుగుతుంది. ఉద్యానవన శాఖ ద్వారా ఈ సాగును ప్రోత్సహిస్తున్నాం. టిష్యూ అరటిలో అధిక ఆదాయం రావడంతో పాటు వాతావరణ పరిస్థితులను తట్టుకునే పరిస్థితులు ఉండడంతో రైతులు టిష్యూ కల్చర్ అరటిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేలా నిర్ణయించింది.

– ఏ. దుర్గేష్, ఉద్యానవన శాఖ ఏడీ– పశ్చిమ గోదావరి జిల్లా

10 ఎకరాల్లో సాగు చేస్తున్నాను



నేను 10 ఎకరాల్లో టిష్యూ కల్చర్ అరటి సాగు చేస్తున్నాను. ప్రభుత్వాలు హెక్టారుకు రూ. 30,000 సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రెండేళ్లపాటు సబ్సిడీ ఇస్తుంది. ప్రస్తుతం సబ్సిడీ రావాల్సి ఉంది. సబ్సిడీ ఇచ్చి రైతును ప్రోత్సహిస్తే టిష్యూ కల్చర్ అరటిసాగు లాభదాయకంగా ఉంటుంది.

– లింగారెడ్డి శ్రీనివాసరావు, రైతు, కె.జగ్గవరం, టి.నర్సాపురం మండలం

టీడీపీతో కలిసే ప్రసక్తే లేదు

బీజేపీ కేంద్ర-రాష్ట్రాల సమన్వయకర్త పురిఘళ్ల రఘురామ్

కొత్తపేట: టీడీపీతో తాము కలిసే ప్రసక్తే లేదని బీజేపీ కేంద్ర-రాష్ట్రాల సమన్వయకర్త పురిఘళ్ల రఘురామ్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఏనుగులమహల్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని మంగళవారం ఆయన సతీసమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రఘురామ్ విలేకరులతో మాట్లాడుతూ 'రాష్ట్ర విభజన తర్వాత టీడీపీకి ఒకసారి అధికారం ఇచ్చారు. ఇక టీడీపీని ప్రజలు నమ్ముతారా? ఆ పార్టీతో పొత్తు ప్రసక్తే లేదు' అని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వబోమన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటన ఆయన వ్యక్తిగతమని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ మూడోసారి కూడా కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగిందని, రానున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు.

నృసింహుని సన్నిధిలో ఆక్టోపస్ టెక్నికల్ రెక్కీ

మంగళగిరి: దేవస్థానాల భద్రతకు సంబంధించి సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఆక్టోపస్ టీమ్ సభ్యులు మంగళవారం టెక్నికల్ రెక్కీ నిర్వహించారు. ఫార్ త్రీడీ లేజర్ స్కానర్ అనే అత్యాధునిక పరికరం ద్వారా ఆక్టోపస్ సిబ్బంది టెక్నికల్ రెక్కీ నిర్వహించి 360 డిగ్రీల కోణంలో దేవస్థాన వ్యూను పూర్తిస్థాయిలో రికార్డింగ్ చేశారు. భవిష్యత్తులో దేవస్థానాల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, ఏ విధమైన అపాయం కలిగినా సమగ్రంగా ఎదుర్కొనే అవకాశం ఉందని ఆక్టోపస్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

ఒక్కరికే 36 యావజ్జీవాలు!

లండన్‌లో భారత సంతతి జడ్జి తీర్పు

లండన్: అత్యాచారం కేసుల్లో నిందితుడికి భారత సంతతి న్యాయమూర్తి పరమ్‌జిత్ కౌర్ బాబీ చీమా–గ్రేవ్ ఏకంగా 36 యావజ్జీవ కారాగార శిక్షలు విధించడం యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో సంచలనాత్మకంగా మారింది. మెట్రోపాలిటన్ పోలీసు మాజీ అధికారి అయిన డేవిడ్ కారిక్(48) 2003 నుంచి 2020 దాకా.. 17 ఏళ్ల వ్యవధిలో దాదాపు 12 మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వారిని దారుణంగా హింసించాడు. అతడు 49 నేరాలకు పాల్పడినట్లు తేలింది. నేరాలన్నీ నిరూపితమయ్యాయి. లండన్‌లోని సౌత్‌వార్క్ క్రౌన్ కోర్టు న్యాయమూర్తి పరమ్‌జిత్ కౌర్ మంగళవారం తీర్పు ప్రకటించారు. దోషికి 36 యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని, పెరోల్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం 30 ఏళ్లు జైల్లో ఉండాల్సిందేనని ఆమె తేల్చిచెప్పారు.

ప్రపంచంలోనే తెలివైన విద్యార్థి...
ఈ ఇండియన్ అమెరికన్



వాషింగ్టన్: ప్రపంచంలో అసాధారణ తెలివితేటలు కలిగిన విద్యార్థిగా 13 ఏళ్ల ఇండియన్ అమెరికన్ నటాషా పెరియనాయగం నిలిచింది. అమెరికాకు చెందిన జాన్ హాప్‌కిన్స్ సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ నిర్వహించిన పలు రకాల పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచి వరసగా రెండో సంవత్సరం ఈ ఘనత సాధించింది. మొత్తం 76 దేశాల నుంచి 15 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు జాన్ హాప్‌కిన్స్ సెంటర్ పరీక్షల్లో పాల్గొంటే నటాషా అత్యంత తెలివైనదానిగా తన ప్రతిభ కనబరిచింది. న్యూజెర్సీ ఫ్లోరెన్స్ ఎం గాడినీర్ మిడిల్ స్కూల్లో చదువుతున్న నటాషా 2021లో జరిగిన పోటీల్లో కూడా పాల్గొని మొదటి స్థానంలో నిలవడం విశేషం. శాట్, యాక్ట్, స్కూల్, కాలేజీ ఎబిలిటీ టెస్టుల్లో నటాషా అసాధారణ ప్రతిభ కనబరిచినట్టుగా జాన్ హాప్‌కిన్స్ సెంటర్ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లో చెన్నైకి చెందిన నటాషా తల్లిదండ్రులు తమ కుమార్తె తెలివితేటలకి మురిసిపోతున్నారు. నటాషా ఖాళీగా ఉన్న సమయంలో జేఆర్ఆర్ టోల్కిన్ నవలలు చదువుతుందని, డూడ్లింగ్ చేస్తుందని తెలిపారు.

ఘోర విపత్తు!


టర్కీలోని హతే నగరంలో భూకంప విధ్వంసం

6,200 దాటిన తుర్కియే, సిరియా భూకంప మృతులు

ప్రపంచ దేశాల నుంచి వెల్లువెత్తుతున్న సాయం


అదానా: తుర్కియే (టర్కీ), సిరియాల్లో సంభవించిన ఘోర భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేటమట్టమైన వేలాది భవనాల శిథిలాల కింద భారీగా శవాలు బయటపడుతున్నాయి. ఇప్పటిదాకా మృతుల సంఖ్య 6,200 దాటింది. ఒక్క తుర్కియేలోనే దాదాపు 6,000 పై చిలుకు భవనాలు కూలిపోయినట్లు నిర్ధారించారు. విపరీతమైన చలి వణికిస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. శిథిలాలను తొలగించడం, వాటి కింద చిక్కుకున్న వారిని గుర్తించడం కష్టతరంగా మారింది. సోమవారం మూడు భారీ భూకంపాలు ఇరు దేశాలను కుదిపేయడం తెలిసిందే. అనంతరం ఇప్పటిదాకా కనీసం 200కు పైగా చిన్నా పెద్దా ప్రకంపనలు వణికించాయి. వాటి భయానికి భారీగా జనం ఇళ్లూ వాకిలీ వీడి వలస బాట పడుతున్నారు.

అంతటా ఆర్తనాదాలే

శిథిలాల కింది నుంచి బాధితుల ఆక్రందనలు హృదయవిదారకంగా వినిపిస్తున్నాయని భూకంపం నుంచి బయటపడ్డవారు చెప్తున్నారు. ''కానీ వారిని కాపాడుకొనే మార్గం కనిపించడం లేదు. కాంక్రీట్ స్లాబ్‌లను తొలగించే పరికరాలు మా దగ్గర లేవు. ప్రభుత్వం నుంచి ఏ సాయమూ అందడం లేదు'' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా జాప్యం జరిగితే బాధితులు చనిపోయే ప్రమాదముందంటున్నారు. తుర్కియేలోని హతాయ్ ప్రావిన్స్‌లో వేలాది మంది క్రీడా ప్రాంగణాలు, ఫంక్షన్ హాళ్లలో తలదాచుకున్నారు. సైన్యం రంగంలోకి దిగి టెంట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. షాపింగ్ మాల్స్, స్టేడియాలు, మసీదులు, కమ్యూనిటీ సెంటర్లలోనూ నిరాశ్రయులకు వసతి కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఆహారం, నీరు అందజేస్తున్నాయి. భూకంప కేంద్రమైన గాజియాన్‌టెప్ నగరంలో పరిస్థితి భీతావహంగా మారింది. ఎటు చూసినా బాధితుల ఆక్రందనలే వినిపిస్తున్నాయి.

సహాయక చర్యలు పూర్తయితేనే స్పష్టత

తుర్కియేలో ఇప్పటిదాకా 3,400 మందికి పైగా మరణించారని, 21,000 మందికి పైగా గాయపడ్డారని ఉపాధ్యక్షుడు ఫౌత్ ఒక్తాయ్ ప్రకటించారు. 10 ప్రావిన్స్‌ల్లో 7,800 మందిని రక్షించారు. సిరియాలో ప్రభుత్వ ఆధీనంలోని ప్రాంతంలో 800 మంది మృతిచెందారని, 1,400 మంది క్షతగాత్రులయ్యారని ఆరోగ్య శాఖ వెల్లడించింది. తిరుగుబాటుదారుల ఆక్రమణలోని వాయవ్య ప్రాంతంలో 790 మంది మరణించారని, 2,200 మందికి పైగా గాయాల పాలయ్యారని సహాయక చర్యల్లో నిమగ్నమైన వైట్ హెల్మెట్స్ అనే వైద్య సంస్థ తెలిపింది. రెండు దేశాల్లోనూ మృతుల సంఖ్య భారీగా పెరగనుందని, సహాయక చర్యలు పూర్తయ్యాకే దీనిపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది.


హతే పట్టణంలో శిథిలాల్లో ఇరుక్కుని నిస్సహాయంగా చూస్తున్న ఓ అభాగ్యుడు

దేశాల ఆపన్న హస్తం

తుర్కియే, సిరియాకు అండగా నిలిచేందుకు ఐక్యరాజ్యసమితితోపాటు పలు దేశాలు ముందుకొచ్చాయి. సహాయక సిబ్బంది, నిత్యావసరాలు, వైద్య సామగ్రి పంపుతున్నాయి. భారత్ ఎక్స్‌–రే యంత్రాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లు, కార్డియాక్ మానిటర్లను అందజేసింది. నిత్యావసరాలు, వైద్య పరికరాలతో రెండు విమానాలను పంపనుంది. ఇప్పటికే రెండు సైనిక రవాణా విమానాల్లో రెస్క్యూ టీమ్‌లను తుర్కియేకు పంపినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తుర్కియే అధ్యక్షుడు తయ్యీప్ ఎర్డోగాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భూకంప మృతులకు సంతాపం ప్రకటించారు. అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ బుధవారం తుర్కియేలో పర్యటించనున్నారు. పలు దేశాల అంతరిక్ష సంస్థలు అందించిన భూకంపం, అనంతర పరిణామాల శాటిలైట్లు చిత్రాలు సహాయక చర్యల్లో ఉపయోగపడుతున్నాయి.


సహాయ సామగ్రి, సిబ్బందితో తుర్కియేకు బయల్దేరిన భారత విమానం

సిరియా జైలు నుంచి 20 మంది ఉగ్రవాదుల పరారీ

సిరియాలో భూకంపంలో ధ్వంసమైన జైలు నుంచి 20 మంది ఉగ్రవాదులు పరారయ్యారు. వీరిలో చాలామంది అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. తుర్కియే సరిహద్దులో రాజో పట్టణంలోని ఈ మిలటరీ పోలీసు జైలులో 2,000 మంది ఖైదీలున్నారు. వీరిలో 1,300 మంది ఐసిస్ ఉగ్రవాదులే. భూకంపంతో జైలు గోడలు, ద్వారాలు ధ్వంసమయ్యాయి. దాంతో 20 మంది సులభంగా తప్పించుకున్నట్లు భావిస్తున్నారు.


టర్కీలోని హతే పట్టణంలో అయినవాళ్లతో పాటు సర్వం కోల్పోయి రోదిస్తున్న స్థానికులు

అమ్మ ఎక్కడ..?



ప్రకృతి ఉగ్రరూపానికి తల్లడిల్లుతున్న తుర్కియే (టర్కీ) సిరియాల్లో తల్లీ బిడ్డల్ని వేరు చేసిన ఘటనలు హృదయాన్ని కదిలిస్తున్నాయి. కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకొని అనాథగా మారిన ఏడాదిన్నర బిడ్డ మా అమ్మ ఏది, ఎక్కడుంది ? అని అడుగుతూ ఉండడం అందరి హృదయాలన్ని పిండేస్తోంది. సిరియాలోని అజాజ్‌లో ఏడాదిన్నద వయసున్న ఒక పాప శిథిలాల కింద నుంచి మృత్యుంజయురాలై బయటకు వచ్చింది. గర్భిణీగా ఉన్న ఆమె తల్లి, సోదరుడు, సోదరి ఇలా కుటుంబమంతా శిథిలాల కింద పడి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతే, వెన్ను విరిగిపోయిన తండ్రి చావు బతుకుల మధ్య ఉన్నాడు. ఇలా కుటుంబాన్ని కోల్పోయి బిక్కుబిక్కుమంటున్న చిన్నారుల్ని చూస్తుంటే అందరి గుండెలు పగిలిపోతున్నాయి.

ఆస్పత్రుల్లో జీవచ్ఛవాలు

తుర్కియే, సిరియాల్లోని ఆస్పత్రుల్లో ఒక వైపు శవాల గుట్టలు, మరోవైపు చావు బతుకుల మధ్య జీవచ్ఛవాలుగా మారిన వారితో నిండిపోయాయి. భూకంపం ధాటికి సర్వస్వం కోల్పోయిన వారు, కుటుంబాల్ని కోల్పోయి అనాథలుగా మిగిలిన పసివారి రోదనలతో హృదయవిదారకంగా మారింది. ఒక స్వచ్ఛంద సంస్థ తరఫున వైద్యం అందించడానికి బ్రిటన్ వైద్యుడు పరిస్థితుల్ని చూసి తల్లడిల్లిపోతున్నారు. వెంటిలేటర్లు సరిపడా లేకపోవడంతో ఒక రోగి నుంచి వెంటిలేటర్ తీసేసి మరో రోగికి అమరుస్తున్నారు. మరోవైపు, బతికే అవకాశాలు ఎవరికి ఎక్కువ ఉన్నాయో వారికే వైద్యం చేస్తున్నామని, ఇలా చేయడం చాలా దుర్భరంగా అనిపిస్తోందని ఆ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు!


సిరియాలో సామూహిక ఖననాలు

గూడు వీడిన పక్షులు

తుర్కియేలో భూకంపం సంభవించడానికి ముందే పక్షులు గుంపులు గుంపులుగా తమ గూళ్లని వదిలి వెళ్లిపోయిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. పక్షులన్నీ రొద చేసుకుంటూ గుంపులుగా హడావుడిగా గూడి వదిలి ఆకాశంలో ఎగురుకుంటూ వెళ్లిపోయిన దృశ్యాలు అందులో ఉన్నాయి. సాధారణంగా భూకంపాన్ని పక్షులు, జంతువులు ముందే పసిగడతాయని అంటారు. ఈ వీడియోని పారిశ్రామికవేత్త ఆనంద్ మహేంద్ర కూడా షేర్ చేశారు. ''ప్రకృతి మనకు ఇచ్చిన హెచ్చరికల వ్యవస్థ. కానీ మనకే వాటిని అర్థం చేసుకోవడం తెలీడం లేదు' అని కామెంట్ చేశారు. 2004లో సునామీకి ముందు కూడా ఇలాగే జరిగిందని ఆయన గుర్తు చేసుకున్నారు. క్రీస్తుపూర్వం 373లో గ్రీస్‌లో భూకంపం సంభవించడానికి చాలా రోజుల ముందే ఎలుకలు, పాములు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిన పోయిన విషయాన్ని ఈ సందర్భంగా అమెరికా జియోలాజికల్ సర్వే ఒక నివేదికలో గుర్తు చేసింది.

చాట్‌జీపీటీకి పోటీగా... గూగుల్ బార్డ్ వచ్చేస్తోంది



న్యూయార్క్: తిరుగులేని ఆదరణతో దూసుకుపోతున్న చాట్‌జీపీటీ (చాట్ జెనరేటివ్ ప్రీ ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్)కి పోటీగా గూగుల్ కూడా కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బోట్ 'బార్డ్'ను తీసుకొస్తోంది. ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తన బ్లాగ్‌స్పాట్‌లో ఈ మేరకు ప్రకటించారు. విడుదలకు ముందు ఈ చాట్‌బోట్‌ను 'నమ్మకస్తులైన టెస్టర్ల'తో కొద్ది వారాలపాటు మదింపు చేస్తామని తెలిపారు. ''బార్డ్ మీ సృజనాత్మకతకు చక్కని తోడవుతుంది. మీ ఉత్సుకతకు రెక్కలు తొడుగుతుంది. నాసా జేమ్స్ వెబ్ టెలిస్కోప్ కొత్త ఆవిష్కరణలు మొదలుకుని ఎలాంటి సంక్లిష్టమైన విషయాలనైనా తొమ్మిదేళ్ల పిల్లలకు కూడా సులువుగా అర్థమయ్యేలా వివరించగలగడం దీని ప్రత్యేకత'' అని చెప్పుకొచ్చారు. చాట్‌జీపీటీని మైక్రోసాఫ్ట్ తన సెర్చ్ ఇంజన్ బింగ్‌కు అనుసంధానం చేయనుందన్న వార్తల నేపథ్యంలో గూగుల్ ప్రకటన ఆసక్తికరంగా మారింది. గూగుల్ ప్రధాన ఆదాయ వనరు కూడా సెర్చ్ ఇంజనే అన్నది తెలిసిందే. చాట్‌జీపీటీ రూపంలో కంపెనీకిప్పుడు పెను సవాలు ఎదురైంది.

లాఎండీఏ మోడల్‌పైనే...

బార్డ్‌ను గూగుల్ తన ప్రస్తుత ఏఐ లాంగ్వేజ్ మోడల్ లాఎండీఏపైనే అభివృద్ధి చేసింది. ఇది బోల్డ్‌గా, సృజనాత్మకంగా ఉంటూనే బాధ్యతాయుతంగా పని చేస్తుందని పిచాయ్ చెప్పారు. ''బార్డ్‌ను తొలుత తక్కువ కంప్యూటింగ్ పవర్‌తో కూడా నడిచే లైట్‌వెయిట్ మోడల్‌లో విడుదల చేస్తాం. ఫీడ్‌బ్యాక్, యూజర్ల సంఖ్య ఆధారంగా ముందుకెళ్తాం'' అని వివరించారు. 2022 నవంబర్లో విడుదలైన చాట్‌జీపీటీ సూపర్‌హిట్‌గా నిలిచింది. ఓపెన్ ఏఐ కంపెనీకి చెందిన ఈ ప్రాజెక్టులో మైక్రోసాఫ్ట్ బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెట్టింది.

2014 తర్వాతే 'అదానీ మ్యాజిక్'

మోదీ హయాంలోనే ఆయన సంపద ఇంతింతలైంది

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్

న్యూఢిల్లీ: అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక మ్యాజిక్ జరిగి ప్రపంచంలో 609వ స్థానంలో ఉన్న వ్యాపారవేత్త అదానీ కాస్తా ఏకంగా రెండో స్థానానికి ఎగబాకారని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొని, మొదటి ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగించారు. విదేశాల్లో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల కాంట్రాక్టులు అదానీకే దక్కేందుకు ప్రధాని మోదీ సాయపడ్డారని ఆరోపించారు. అదానీతో కలిసి ఎన్ని విదేశీ పర్యటనలు చేశారు? మీరు వెళ్లొచ్చాక ఆ దేశాలకు అదానీ ఎన్ని సార్లు వెళ్లారు? మీతో పాటు వచ్చినప్పుడు ఎన్ని కాంట్రాక్టులు అదానీ పొందారు? అని అంటూ అదానీ, మోదీ ఉన్న ఫొటోలను ఆయన ప్రదర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా గత 20 ఏళ్లలో బీజేపీకి ఎంత విరాళమిచ్చారో తెలపాలన్నారు. ''భారత్ జోడో యాత్రలో ప్రతి చోటా అదానీ పేరే వినిపించింది. 2014–22 మధ్యలో అదానీ ఆస్తులు 8 బిలియన్ డాలర్ల నుంచి 140 మిలియన్ డాలర్లకు ఎలా పెరిగాయని యువత నన్ను ప్రశ్నించారు. అదానీకి విదేశాల్లో నకిలీ కంపెనీలున్నాయని హిండెన్‌బర్గ్ పరిశోధనలో తేలింది. సీబీఐ, ఈడీ సాయంతో ముంబై ఎయిర్‌పోర్టును జీవీకే నుంచి లాగేసుకుని అనుభవం లేని అదానీ సంస్థకు కట్టబెట్టారు'' అన్నారు. వీటిపై అధికార బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు చూపాలన్నారు. మోదీ, అదానీ ఫొటోలను ప్రదర్శించినందుకు స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబం భారీ కుంభకోణాలతో దేశ ప్రతిష్ట దెబ్బతిందని బీజేపీ నేత రవి శంకర్ ప్రసాద్ మీడియాతో అన్నారు.



రాజస్తాన్ సంగతి చూసుకో: బీజేపీ

బీజేపీ సభ్యుడు సీపీ జోషి మంగళవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చ ప్రారంభించారు. ప్రధాని మోదీ దేశాన్ని ఆధ్యాత్మికంగా, డిజిటల్‌గా ఐక్యంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. రాముడికి, మోదీకి సారూప్యతలున్నాయన్నారు. రాహుల్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ ముందుగా రాజస్తాన్‌లో కాంగ్రెస్ కుమ్ములాటలను చక్కదిద్ది తర్వాత దేశం విషయం ఆలోచించాలన్నారు. ప్రధాని పదవి కాపాడుకునేందుకే కాంగ్రెస్ దేశాన్ని విభజించిందని ఆరోపించారు. అల్లావుద్దీన్ ఖిల్జీ బారి నుంచి తన పాతివ్రత్యాన్ని కాపాడుకునేందుకు మేవాడ్ రాణి పద్మావతి ఆత్మత్యాగం చేసుకున్నారన్న జోషి వ్యాఖ్యలపై దుమారం రేగింది. సతీసహగమన దురాచారాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. వెల్‌లోకి వెళ్లి నినాదాలకు దిగడంతో స్పీకర్ సభను 20 నిమిషాల సేపు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక, అభ్యంతరకర వ్యాఖ్యలుంటే తొలగిస్తామని స్పీకర్ హామీ ఇవ్వడంతో కార్యకలాపాలు కొనసాగాయి.

జడ్జిగా గౌరి నియామకం సరైందే

- ఆమెకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టేసిన సుప్రీం
- మద్రాస్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా గౌరి ప్రమాణం



న్యూఢిల్లీ/చెన్నై: మద్రాస్ హైకోర్టులో అడిషనల్ జడ్జిగా లాయర్ లెక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరి ప్రమాణ స్వీకారాన్ని ఆపాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కొలీజియంలో చర్చ జరిగాకే ఆమె పేరు ప్రతిపాదించినట్టు పేర్కొంది. సంబంధిత హైకోర్టు జడ్జిల అభిప్రాయాన్ని కూడా తెలుసుకున్నట్టు తెలిపింది. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌ల ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపింది. ప్రమాణాన్ని ఉల్లంఘించినట్లు తేలినా లేదా ప్రమాణానికి లోబడి విధులను నిర్వర్తించకున్నా రెండేళ్ల తర్వాత ఆమె పనితీరు సంతృప్తికరమని భావిస్తేనే శాశ్వత జడ్జిగా ప్రతిపాదించే అవకాశం కొలీజియంకు ఉందని గుర్తు చేసింది. గతంలో అడిషనల్ జడ్జిలుగా పనిచేసిన వారు శాశ్వత జడ్జీలు కాలేకపోయిన ఘటనలు అనేకం ఉన్నాయంది. ఒక వ్యక్తి రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలు ఆ వ్యక్తి పేరును జడ్జిగా సిఫారసు చేయకపోవడానికి కారణం కాదని కొలీజియం భావించిందని పేర్కొంది. గౌరి మైనారిటీలకు వ్యతిరేకంగా విద్వేష వ్యాఖ్యలు చేశారంటూ కొందరు లాయర్లు కేసు వేయడం తెలిసిందే.

సుప్రీంకోర్టు తీర్పు కంటే ముందే...

మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పుకు ముందే మద్రాస్ హైకోర్టు అదనపు జడ్జిగా గౌరి ప్రమాణం చేశారు! తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.రాజా మంగళవారం ఉదయం 10.45 గంటల సమయంలో ఆమెతో ప్రమాణం చేయించారు. తనకు గొప్ప అవకాశమిచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సహా ఇతర న్యాయమూర్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 1973లో జన్మించిన గౌరి, 1995లో లాయర్‌గా పేరు నమోదు చేయించుకున్నారు. మదురై బెంచ్ అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా 2022 నుంచి పనిచేస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం జనవరి 17వ తేదీన గౌరితో కలిపి మొత్తం ఐదు పేర్లను హైకోర్టు జడ్జీలుగా నియమించేందుకు కేంద్రానికి సిఫారసు చేసింది.

వాట్సాప్‌లో ఇకపై ఒకేసారి 100 ఫైళ్లు

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో త్వరలో ఒకేసారి 100 మీడియా ఫైళ్లను షేర్ చేయవచ్చు. ఎంపిక చేసిన బెటా టెస్టర్లకు ఇదిప్పటికే అందుబాటులోకి వచ్చిందని వాట్సాప్ న్యూస్ ట్రాకర్ వెబ్‌సైట్ డబ్ల్యూఏ బెటా ఇన్ఫో తెలిపింది. ప్రస్తుతం వాట్సాప్ నుంచి ఒకేసారి 30 ఫైళ్లకు మించి షేర్ చేయడం కుదరదు. కొత్త ఫీచర్ త్వరలో అందుబాటులోకి వస్తుందని బెటా చెబుతోంది.

ముగిసిన ముషారఫ్ అంత్యక్రియలు

కరాచీ: పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు జనరల్ పర్వేజ్ ముషారఫ్ (79) అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. కరాచీలోని సైనిక శ్మశానవాటికలో పూర్తి సైనిక లాంఛనాలతో భార్య, కుమారుడు, కుమార్తె, సన్నిహిత బంధువుల సమక్షంలో కార్యక్రమం జరిగింది. ప్రస్తుత, మాజీ సైనిక ఉన్నతాధికారులు, ఐఎస్ఐ చీఫ్‌లు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. దేశాధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, ప్రధాని షహబాజ్ షరీఫ్ దూరంగా ఉన్నారు. ముషారఫ్ ఆదివారం దుబాయ్‌లో కన్నుమూయడం తెలిసిందే. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం ప్రత్యేక విమానంలో పాకిస్తాన్‌కు తరలించారు.

సీఏపీఎఫ్‌లో 83 వేలకు పైగా ఖాళీలు

న్యూఢిల్లీ: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో 83 వేలకి పైగా పదవులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంటులో వెల్లడించింది. మొత్తం పదవులు 10,15,237 కాగా ప్రస్తుతం 83 వేలకు పైగా ఖాళీలున్నాయని తెలిపింది. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), అస్సాం రైఫిల్స్‌లో 83,127 పదవులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

బాల్య వివాహాలపై కొరడా

- ఒక్కసారిగా చర్యలకు దిగిన అస్సాం
- 4 రోజుల్లోనే వేలాది కేసులు, అరెస్టులు
- ఎన్నికల ఎత్తుగడేనంటున్న విశ్లేషకులు
- రాష్ట్రంలో బాల్య వివాహాలు లక్షకు పైనే!

బాల్య వివాహాల వ్యవహారం ఈశాన్య రాష్ట్రం అస్సాంను కుదిపేస్తోంది. చట్టవిరుద్ధమైన ఈ పెళ్లిళ్లను ఇన్నాళ్లూ చూసీచూడనట్లు వ్యవహరించిన ప్రభుత్వం ఉన్నట్టుండి ఉక్కుపాదం మోపుతుండడం సంచలనం సృష్టిస్తోంది. దశాబ్దాల క్రితం చిన్న వయసులో పెళ్లి చేసుకున్నవారు ఇప్పుడు కేసులు, అరెస్టుల భయంతో వణికిపోతున్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వార్తలొస్తున్నాయి! అస్సాం పోలీసులు 4,074 కేసులు నమోదు చేశారు. 8,000 మందికిపైగా నిందితులను గుర్తించారు, వారిలో 2,500 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 60 మంది ఖాజీలూ ఉన్నారు.



ప్రభుత్వ చర్యలకు జడిసి రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బాల్య వివాహాలు రద్దవడమో, వాయిదా పడడమో జరిగిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రెండు చట్టాల కింద అరెస్టులు

భారత్‌లో యువతుల చట్టబద్ధమైన వివాహ వయసు 18 ఏళ్లు. అంతకంటే తక్కువ వయసున్న అమ్మాయిలను పెళ్లాడిన పురుషులను అరెస్టు చేసి శిక్షించాలని జనవరి 23న అస్సాం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు 14 ఏళ్ల కంటే తక్కువ వయసు బాలికలను పెళ్లాడితే 'పోక్సో' చట్టం కింద, 14–18 ఏళ్ల లోపు బాలికలను పెళ్లాడిన వారిపై బాల్య వివాహాల నిషేధ చట్టం (2006) కింద అరెస్టు చేసి జైల్లకు తరలిస్తున్నారు. బాలికలను తాత్కాలిక వసతి గృహాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో గత కొన్నేళ్లలో లక్షకు పైగా బాల్య వివాహాలు జరిగాయని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. దాంతో చాలామంది చిన్న వయసులోనే తల్లులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చట్టవిరుద్ధమైన పెళ్లిళ్లకు పాల్పడే తల్లిదండ్రులు, మత పెద్దలు, ఖాజీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


31 శాతం బాల్య వివాహాలు..
17 శాతం టీనేజీ గర్భాలు

అస్సాంలో టీనేజీ ప్రెగ్నెన్సీ నిష్పత్తి ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతోంది. గతేడాది రాష్ట్రంలో గర్భం దాల్చిన 6,20,867 మందిలో 16.79 శాతం, అంటే 1,04,264 మంది 19 ఏళ్ల లోపువారే! జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం మాతా శిశు మరణాల్లో అస్సాం అగ్రస్థానంలో ఉంది. ఇందుకు బాల్య వివాహాలే ప్రధాన కారణమని తేల్చారు. నమోదవుతున్న వివాహాల్లో ఏకంగా 31 శాతం ఇవే! దక్షిణ, దిగువ జిల్లాల్లో ఈ ధోరణి మరీ ఎక్కువగా ఉంది. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మైనార్టీలు అక్కడ గణనీయంగా ఉన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమేనా?

బాల్య వివాహాలపై చర్యల వెనక ఉద్దేశం 2024 లోక్‌సభ, 2026లో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధేనని భావిస్తున్నారు. ప్రజారోగ్యం, సంక్షేమం కోసం ఈ చర్యలు 2026 అసెంబ్లీ ఎన్నికల దాకా కొనసాగుతాయన్న ప్రకటన దీన్నే ధ్రువీకరిస్తోందని అంటున్నారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందని, ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని, భద్రత కూడా కొరవడిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలపై చర్యల పేరిట మెజార్టీ వర్గాన్ని ఆకట్టుకోవడం, సమస్యల నుంచి జనం దృష్టిని మళ్లించడం బీజేపీ లక్ష్యాలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లవ్ జిహాద్, మత మార్పిడులనూ సహించేది లేదన్న సీఎం వ్యాఖ్యలనూ ఇదే కోణంలో చూడాలంటున్నారు.

వ్యతిరేకత.. ఆందోళనలు



ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పలు జిల్లాల్లో నిరసనలు, ఆందోళలు తీవ్ర రూపు దాలుస్తున్నాయి. పార్టీలూ వాటికి మద్దతిస్తున్నారు. 'మాకు ప్రభుత్వ పథకాలు అక్కర్లేదు. మా భర్త మాతో ఉంటే చాలు. వారిని అరెస్టు చేయొద్దు' అని బాల్య వివాహం చేసుకున్న అమ్మాయిలు డిమాండ్ చేస్తున్నారు! బాల్య వివాహాలు నిషిద్ధమని వీరిలో చాలామందికి తెలియదు. ముందు నుంచే చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చేది కాదని బాధితులు వాపోతున్నారు. ప్రజల్లో అవగాహన కోసం స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నిస్తున్నా పెద్దగా ఫలితాలివ్వడం లేదు. మరికొందరు అమ్మాయిలేమో తాము 18 ఏళ్ల దాటాక పెళ్లాడినా పోలీసులు ఆరోగ్య కార్యకర్తల వద్ద ఉన్న లోపభూయిష్ట సమాచారం ఆధారంగా తప్పుడు కేసులు పెట్టి తమ భర్తలను జైలుపాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023

రెగ్యులర్ చేయాలి



బెంగళూరు ఫ్రీడంపార్క్ వద్ద వైద్యారోగ్య, వైద్య విద్యా విభాగంలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా. తమను రెగ్యులర్ చేయాలని నినదించారు

న్యూస్‌రీల్

బెంగళూరులో నమ్మ క్లినిక్‌లు ప్రారంభం



బనశంకరి: బెంగళూరులో బీబీఎంపీ పరిధిలో 108 నమ్మ క్లినిక్‌లను సీఎం బసవరాజబొమ్మై మంగళవారం ప్రారంభించారు. తొలి క్లినిక్‌ను మహాలక్ష్మీ లేఔట్ నియోజకవర్గంలోని మహాలక్ష్మీపుర వార్డులో ఆరంభించారు. వైద్యసేవలు మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రమంతటా ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరులో 15 నుంచి 20 వేల జనాభాకు ఒక క్లినిక్ తెరుస్తున్నారు. నమ్మ క్లినిక్‌లో తలా ఒక డాక్టరు, నర్సు, ల్యాబొరేటరీ సిబ్బంది ఉంటారు. గర్భిణులకు, పిల్లలకుఆరోగ్య రక్షణ,టీకాలు సహా 12 ఆరోగ్య సేవలు లభిస్తాయి. ఆదివారం తప్ప, నిత్యం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు తెరిచి ఉంటాయి.

బ్రేక్ అనుకుని.. ఎక్స్‌లేటర్ తొక్కి..

యశవంతపుర: కారును నడుపుతున్న మహిళ బ్రేకు వేయటానికి బదులు ఎక్స్‌లేటర్‌పై కాలు వేయడంతో వాహనం మరింత వేగంగా వెళ్లి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైకిస్టు మృతి చెందాడు. బెంగళూరు హెసరఘట్ట రోడ్డు బాగలగుంట సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు వెళ్తున్న బైక్‌ను వేగంగా ఢీకొంది. బైకిస్టు తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పీణ్య పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రూ.కోటి స్వాహా చేసిన నగదు రవాణా ఉద్యోగి

బనశంకరి: ఏటీఎంలకు తరలించాల్సిన నగదుతో రవాణా కంపెనీ ఉద్యోగి ఉడాయించిన ఘటన మడివాళ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నగదు తరలించే ఉద్యోగి రాజేశ్ మేస్త్రా రూ. కోటి 3 లక్షలతో పరారైనట్లు కేసు నమోదైంది. ఏటీఎం యంత్రాలకు నగదు తరలించే ఒక సంస్థలో రాజేశ్ మేస్త్రా గత 11 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. జనవరి చివరిలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అదృశ్యమయ్యాడు. అనుమానంతో అతడు నింపిన ఏటీఎం కేంద్రాల్లో నగదును లెక్కించగా రూ.1 కోటి 3 లక్షలు వ్యత్యాసం వచ్చింది. దీంతో సంస్థ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా అతడి కోసం గాలిస్తున్నారు.

కారులో రూ.10 లక్షల చోరీ

మైసూరు: కారు అద్దాలు బద్దలు కొట్టి రూ. 10 లక్షల నగదు చోరీ చేసిన ఘటన మైసూరు నగరంలోని విజయనగర వాటర్ ట్యాంక్ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చోటు చేసుకుంది. విజయనగర 2వ స్టేజ్‌లో నివాసం ఉంటున్న కాంట్రాక్టర్ గోవిందగౌడ డబ్బులు పోగొట్టుకున్న బాధితుడు. ఇతను తెలిసిన వ్యక్తి నుంచి రూ. 10 లక్షలు నగదు తీసుకుని కారులో పెట్టి సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లాడు. ఈ సమయంలో దుండుగులు కారు అద్దాలు పగులగొట్టి నగదు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డబ్బులిస్తే కోరిన డ్యూటీ

ఈశాన్య ఆర్టీసీలో లంచాల గోల
- ఆరుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు





రాయచూరు రూరల్: సార్ నాకు వారంరోజులు సెలవు కావాలి, సార్ ఈరోజు నాకు దగ్గరి రూట్‌లో డ్యూటీ వేయండి, నాకు ఆఫీసు వర్క్ ఇవ్వండి సార్.. అని డ్రైవర్లు, కండక్టరు తదితర సిబ్బంది ఏ విన్నపం చేసినా డబ్బులు తీసుకుని సరే నంటున్న ఈశాన్య(కల్యాణ) కర్ణాటక ఆర్టీసీ అధికారుల బాగోతం బట్టబయలైంది. రాయచూరు ఆర్టీసీ డివిజన్‌లో ఫోన్ పేతో ఆర్టీసీ అధికారులు లంచం తీసుకున్న ఘటనల్లో ఆరుగురు అధికారులు సస్పెండ్‌కు గురయ్యారు. అధికారులు నేరుగా నగదు తీసుకోకుండా ఫోన్ పే ద్వారా గుట్టుగా డబ్బులు వేయించుకొని డ్రైవర్లు, కండక్టర్లకు వారు కోరిన విధులు కేటాయించేవారు. ఈ బాగోతం బట్టబయలు కావడంతో చర్యలు మొదలయ్యాయి. సస్పెండైన వారిలో లింగసూగూరు ఏటీఐ అధికారులు రాఘవేంద్ర, దేవదుర్గ చెన్నప్ప, రాయచూరు సంతోష్, అమరేష్, పరసప్ప, అకౌంట్స్ విభాగపు అధికారి మహేష్ రెడ్డి ఉన్నారు.

చేతులు మారిన లక్షలు

చాలా రోజుల నుంచి సాగుతున్న ఈ వ్యవహారంలో లక్షలు చేతులు మారినట్లు తెలిసింది. సిబ్బంది నుంచి అధికారులకు రూ.50 లక్షల మామూళ్లు ముట్టినట్లు విచారణలో తేలింది. ఈ దందా గురించి డివిజన్ అధికారులు మంగళవారం నుంచి విచారణ జరపడంతో అధికారుల్లో వణుకు పుట్టింది. మరోవైపు కల్యాణ కర్ణాటకలోని బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, విజయనగర, బళ్లారి జిల్లాల్లో ఆర్టీసీ ఉన్నత స్థాయి అధికారుల బృందం శాఖా పరంగా విచారణకు శ్రీకారం చుట్టింది. ఈ బాగోతంలో అనేకమందికి పాత్ర ఉందని తెలుస్తోంది. డబ్బులు ఇచ్చి సులభమైన డ్యూటీలు వేసుకునేవారి వల్ల నిజాయితీగా పనిచేసేవారు ఇబ్బందులకు గురైనట్లు ఆరోపణలున్నాయి.

కార్ణికోత్సవం.. భవిష్యవాణి



విజయనగర (హొసపేటె) జిల్లా హువిన హడగలిలో మంగళవారం సాయంత్రం ప్రసిద్ధ వేడుక కార్ణికోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఏటా మాఘమాసంలో సంబరం జరపడం ఆనవాయితీ. గొరవయ్య ఎత్తైన స్తంభాన్ని ఎక్కి భవిష్యవాణిని వినిపించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉంటారని, నిజాయతీగా కష్టపడే నేతలకు అధికారం దక్కుతుందని జోస్యం చెప్పారు

మెట్రో పట్టాల్లో పగుళ్లు

- గుట్టుగా మరమ్మతులు



శివాజీనగర: రాజధానిలో మెట్రో రైలు పట్టాల్లో పగుళ్లు రావడంతో పర్పుల్ (ఊదా) రంగు లైన్లో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చీలిక వచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెజిస్టిక్ నుంచి కెంగేరి వైపు సాగే ఊదా మార్గంలో మైసూరు రోడ్డులో పట్టణగెరె మెట్రో స్టేషన్‌కు దగ్గర పట్టాల్లో చీలికను గుర్తించారు. మెట్రో రైలు పైలట్, కిందిస్థాయి సిబ్బంది గమనించారు. రైలు అక్కడ వెళ్లే సమయంలో శబ్దం, వేగంలో మార్పు వస్తుండగా అనుమానంతో తనిఖీ చేసి కనిపెట్టారు. ఈ విషయం మీడియా, ప్రజల దృష్టికి రాకూడదని గుట్టుగా మెట్రో సంస్థ మరమ్మతులు చేయించింది. అదృష్టవశాత్తు ప్రమాదం ఏదీ జరగలేదు, లేదంటే పెద్ద నష్టమే సంభవించి ఉండేది. మూడేళ్ల కిందటే ఈ పట్టాలను వేయగా అంతలోనే పగుళ్లు రావడం గమనార్హం. ఇంత కొత్తగా నిర్మించిన ట్రాక్ కంబీల్లో చీలిక రావటానికి కారణమేమిటి? అనేది తెలియాల్సి ఉంది. హెణ్ణూరులో ఇటీవల మెట్రో పిల్లర్ కడ్డీలు కూలిపోయి తల్లీ కొడుకు దుర్మరణం చెందడం తెలిసిందే. ఇలా తరచూ మెట్రో ప్రమాదాలతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది.

వ్యాపారవేత్త, కొడుకు కిడ్నాప్

- కొన్ని గంటల తరువాత విడుదల
- భారీగా డబ్బు వసూలు?

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా ఆడకనహళ్లి హుండి పారిశ్రామిక ప్రాంతంలో వ్యాపారవేత్త, అతని కొడుకు కిడ్నాప్ ఉదంతం సంచలనం కలిగించింది. ఇదంతా మొత్తం సినిమా స్టైల్లో జరిగింది. వివరాలు.. మైసూరుకు చెందిన వ్యాపారవేత్త దీపక్, అతని కుమారుడు హర్ష... హర్ష ఇన్ఫోటెక్ అనే కంపెనీ నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల కంపెనీ వద్దకు కారు, స్కూటర్‌లో వచ్చిన దుండగులు దీపక్, కొడుకు హర్షన్‌ను బలవంతంగా కారులో ఎత్తుకెళ్లారు. వారి కుటుంబానికి ఫోన్ చేసి రూ. 40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసి పోలీసులు అంతటా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ప్రారంభించారు.

రాత్రి సుమారు 8.30 గంటలకు వ్యాపారవేత్త కారు చాముండి కొండ తప్పలిలో ఉన్న సుత్తూరు మఠం వద్ద కనిపించింది. అక్కడ గాలించినా ఎవరూ కనిపించలేదు. రాత్రి 10.30 గంటలకు నంజనగూడు గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తండ్రీ కొడుకులు తమను కొందరు కిడ్నాప్ చేశారని, కిడ్నాపర్లు ఐదుమంది కంటే ఎక్కువగా ఉన్నారని, మైసూరులోని బన్నూరులో తమను వదిలి వెళ్లారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. కాగా, వ్యాపారవేత్త నుంచి దుండగులు భారీ మొత్తంలోనే డబ్బు వసూలు చేసి ఉంటారని భావిస్తున్నారు.

తక్కువ తరుగు అంటే చితక్కొట్టారు



దాడి చేస్తున్న దృశ్యం

మైసూరు: మా షాపులో అతి తక్కువ తరుగుతో బంగారు నగలు విక్రయిస్తాం అని టీవీల్లో నిరంతరం ప్రకటనలు వస్తూ ఉంటాయి. ఇలాగే ప్రకటించిన ఒక బంగారు షాపు యజమానిపై గుర్తుతెలియని దుండగులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సంఘటన మైసూరు నగరంలోని ఇర్విన్ రోడ్డులో జరిగింది. వివరాలు.. తమ షాపులో తక్కువ తరుగుకే నగలు అమ్ముతామని దుకాణం యజమాని నూతన్ ప్రచారం ప్రారంభించాడు. సామాన్యంగా 5 శాతం వేస్టేజ్ కింద చార్జి చేస్తారు. నూతన్ 4 శాతం మాత్రమే చార్జి చేస్తానని ప్రకటించాడు. మంగళవారం షాపులో ఉండగా కొందరు వ్యక్తులు చొరబడి నూతన్‌తో పాటు సహాయకులు చేతన్, మనోజ్‌లను తీవ్రంగా కొట్టి పరారయ్యారు. ముగ్గురికీ గాయాలయ్యాయి. కాగా, బంగారు నగల తయారీదారులు, ఇతర వ్యాపారులే ఈ దాడికి పాల్పడి ఉంటారని అనుమానాలున్నాయి. అతని ఆఫర్ల వల్ల నష్టపోతున్నామని భావించి కొట్టి ఉంటారని సమాచారం. దాడి వీడియోలు వైరల్ అయ్యాయి.

చలానా కట్టి ఆస్పత్రికి వెళ్లండి

- రూ.5 వేల కోసం దంపతులపై ట్రాఫిక్ పోలీసుల ఒత్తిడి
- ఇంటి నుంచి నగదు తెచ్చి చెల్లింపు



బనశంకరి: జరిమానా వసూలు విషయంలో జయనగర ట్రాఫిక్ పోలీసులు మానవత్వాన్ని మరచి చలానా కట్టాల్సిందేనని దంపతులను వేధించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలు.. జేపీనగర నివాసులైన మంగళ, మల్లేశ్ దంపతులు మంగళవారం స్కూటర్‌లో ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యలో జయనగర ట్రాఫిక్‌పోలీసులు అడ్డుకున్నారు. వాహనం వివరాలను తనిఖీ చేసి బండిపై రూ.5 వేల చలానాలు ఉన్నాయని, ఇప్పుడే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్న భార్య (45)ను ఆస్పత్రికి తీసుకెళ్తున్నట్లు, తమ వద్ద రూ.2 వేలు మాత్రమే ఉందని భర్త తెలిపాడు. కానీ శివస్వామి అనే పోలీస్ రూ.5 వేలు కట్టి కదలాలని హెచ్చరిస్తూ అసభ్యపదజాలంతో దూషించారని దంపతులు ఆరోపించారు. గత్యంతరం లేని దంపతులు రెండు కిలోమీటర్ల దూరంలోని ఇంటికి నడుచుకుని వెళ్లి రూ.5 వేలు డబ్బు తీసుకుని వచ్చి జరిమానా చెల్లించారు.

సిగ్గుచేటు చర్య: తనయుడు

ఈ నేపథ్యంలో జబ్బుతో బాధపడుతున్న తమ తల్లి నీరసంతో పడిపోయిందని, సదరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని దంపతుల కుమారుడు డిమాండ్ చేశాడు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీస్ ట్విట్టర్ ఖాతాకు ట్యాగ్ చేశాడు. ముగ్గురు పోలీసులు తమ కుటుంబంపై తెల్లదొరల కాలంలోని పోలీసుల మాదిరిగా ప్రవర్తించడం సిగ్గుచేటని, వారిపై తక్షణం కఠినచర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.

హత్యలకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కారణం

- మాజీ సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: తమ అధికార అవధిలో హిందువులు మాత్రమే కాదని, ముస్లింల హత్యలు కూడా జరిగాయి. ఈ హత్యలకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీవారే కారణమని మాజీ సీఎం సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం కల్బుర్గిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పరేశ్ హత్య తరువాత పెద్ద గొడవ చేశారు. ఆ తరువాత ఏమైందనేది అందరికి తెలుసు. తాను ఏనాడు హిందూ మతాన్ని వ్యతిరేకించలేదు. సామరస్యాన్ని నాశనం చేయటమే బీజేపీ నాయకుల పని అని మండిపడ్డారు. కాంగ్రెస్ పాకిస్తాన్‌లో పోటీ చేస్తే 150 స్థానాలు గెలుపొందుతుందన్న సీ.టీ.రవి వ్యాఖ్యలపై ధ్వజమెత్తిన సిద్దరామయ్య, కర్ణాటక పాకిస్తాన్‌లో ఉందా? భారత్‌లో ఉందా? ఎన్నికల జరుగుతున్నది పాకిస్తాన్‌లోనా? కర్ణాటకలోనా? పెద్ద పెద్దగా మాట్లాడుతున్నారా అంటూ సీ.టీ.రవిపై విరుచుకుపడ్డారు.

వికటించిన ఘీ రైస్, చికెన్ కబాబ్

- మంగళూరులో 137 మంది నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత





ఆస్పత్రి వద్ద రద్దీ

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరులో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు ఘీ రైస్, చికెన్ కబాబ్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి సిటీ నర్సింగ్ హాస్టల్‌లో ఉంటున్న 137 మంది విద్యార్థినులు పై ఆహారం ఆరగించారు. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఆహారం వికటించి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వంటల్లో శుభ్రత పాటించకపోవడంతో కలుషితమైనట్లు తెలుస్తోంది. బాధితులను సిబ్బంది సిటీ ఆస్పత్రిలో చేర్చారు. మొత్తం 137 మంది విద్యార్థులను మంగళూరు నగరంలోని వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

తల్లిదండ్రుల ఆగ్రహం

సోమవారం రాత్రి పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. విషయం పోలీసులకు తెలియడంతో ఆస్పత్రికి వచ్చి విచారణ చేపట్టారు. కాలేజీ యాజమాన్యంపై కద్రి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. హాస్టల్‌లోని అస్తవ్యస్త పరిస్థితులపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చాలా మంది విద్యార్థులు కోలుకున్నారు. కొందరు డిశ్చార్జ్ కాగా 38 మంది విద్యార్థులు ఆస్పత్రిలో ఉన్నారు.

5 ఏళ్లలో రూ.10 వేల కోట్ల టోల్ ఫీజు



బనశంకరి: రాష్ట్రంలో టోల్ ఫీజు వసూళ్లు మామూలుగా లేవు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో గత ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల టోల్ ఫీజు వసూలైనట్లు జాతీయ రోడ్డు రవాణా విభాగం తెలిసింది. 2018 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబరు వరకు దేశంలో రూ. 1.5 లక్షల కోట్ల టోల్‌ను వాహనదారుల నుంచి వసూలు చేశారు. ఇందులో కర్ణాటక వాటా రూ.10 వేల కోట్లుగా తెలిపారు. ఫాస్టాగ్ వచ్చాక టోల్ సేకరణ గణనీయంగా పెరిగింది. టోల్ వసూళ్లలో రూ. 17 వేల కోట్లతో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, రూ. 16,500 కోట్లతో రాజస్థాన్, రూ.15,332 కోట్లతో గుజరాత్ రెండో, మూడో స్థానంలో ఉన్నాయి.

వసంత వల్లభ వైభవం



వసంత వల్లభ మూలవిరాట్టుకు విశేషాలంకారం



జన సాగరం మధ్య కొనసాగుతున్న తేరు

- అట్టహాసంగా బ్రహ్మ రథోత్సవం
- వసంతపుర కళకళ

బనశంకరి: గోవింద నామస్మరణతో బెంగళూరులోని వసంతపుర మారుమోగింది. పురాణ ప్రసిద్ధ వసంతపుర వసంతవల్లభరాయస్వామి బ్రహ్మ రథోత్సవం అశేష భక్త జనవాహిని మధ్య మంగళవారం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి మూలవిరాట్ కు ఆలయ ప్రధాన అర్చకులు రఘురామ భట్టర్, అర్చకులు అభిషేకం, అలంకరణ గావించి పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కలశాలను ఉరేగింపుగా తీసుకెళ్లి తేరులో ప్రతిష్ఠించారు. మఖా నక్షత్రంలో వసంతవల్లభుని ఉత్సవమూర్తిని మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి తేరులో ఆసీనులను చేశారు.

తరలివచ్చిన జనసాగరం

పూజలు చేసి ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, ఆలయ ధర్మకర్తలు, భక్తులు తేరును ముందుకు లాగారు. రథం కదలగానే భక్తులు గోవిందనామస్మరణతో అరటిపండ్లు, పూల వర్షం కురిపించారు. రథోత్సవాన్ని వీక్షించడానికి బెంగళూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు ప్రజలు తరలివచ్చారు. ఆలయ ఈవో రుక్మిణి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం నిర్వహించారు.



వల్లభుడు, దేవేరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు

క్లుప్తంగా

రోగుల భోజనం తనిఖీ

సాక్షి,బళ్లారి: విమ్స్ ఆస్పత్రిలో రోగులకు పెట్టే అన్నంలోను నిర్వాహకులు కక్కుర్తి పడుతూ కడుపు నిండా భోజనాలు పెట్టకపోగా నీళ్ల చారు, ఉడికీ ఉడకని, పురుగులు పట్టిన అన్నం పెడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం విమ్స్ ఆస్పత్రిని సందర్శించిన నగర మేయర్ రాజేశ్వరికి రోగులు ఫిర్యాదు చేశారు. స్వయంగా మేయర్ అన్నం, చారును పరిశీలించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విమ్స్‌లో రోగులకు భోజనాలు సక్రమంగా అందించకపోతే ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తామని మేయర్ హెచ్చరించారు.

28 వరకు బస్‌పాస్‌ల రెన్యువల్

కంప్లి: తాలూకాలోని కురుగోడు బస్ డిపో పరిధిలో దివ్యాంగుల బస్‌పాస్‌లను నవీకరిస్తామని ట్రాఫిక్ కంట్రోలర్ ఏ.తిమ్మప్ప తెలిపారు. బస్‌పాస్‌లను ఈ నెల 28 వరకు నిత్యం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్త బస్టాండ్ ట్రాఫిక్ కంట్రోలర్ కార్యాలయంలో నవీకరిస్తారని, పాస్‌పోర్ట్ ఫోటో అందించి రూ.660 చెల్లించాలని తెలిపారు. కొత్తగా దివ్యాంగుల బస్‌పాస్ పొందాలంటే బళ్లారి డివిజనల్ కార్యాలయంలో మూల ప్రమాణ పత్రాలు అందించి పొందాలని తెలిపారు.

14న టిప్పు నాటక ప్రదర్శన

బళ్లారి రూరల్: రాఘవ కళామందిరంలో బళ్లారి రంగతోరణ సహకారంతో ఈ నెల 14న టిప్పు నిజ కనసుగళు అనే నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు మైసూరు రంగాయణ డైరెక్టర్ అడ్డండ సి.కార్యప్ప తెలిపారు. మంగళవారం మర్చేడ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. మైసూరు సంస్థానాన్ని ఆక్రమించుకొన్న పర్షియన్‌కు చెందిన టిప్పుసుల్తాన్ గురించి నాటకం ద్వారా నేటితరాలకు తెలియని ఎన్నో నిజాలను, టిప్పు సత్య చరిత్రను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. బళ్లారి రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవ కప్పగల్లు, ప్రముఖులు అడవి స్వామి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకింగ్ నేరాలపై అవగాహన

బొమ్మనహళ్లి: బెంగళూరు ఎల్రక్టానిక్ సిటీలో ఉన్న ఐఐఐటి– బెంగళూరు క్యాంపస్‌లో మంగళవారం పోలీసులు, హోంశాఖ సిబ్బంది కోసం డిజిటల్ టెక్నికల్ హ్యాకథాన్ సదస్సు జరిగింది. కార్యక్రమాన్ని ఐఐఐటీ డైరెక్టర్ దేబబ్రతదాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సైబర్ నేరగాళ్లు పాల్పడే వివిధ రకాల హ్యాకింగ్ నేరాలను అడ్డుకోవడం, యువత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐడి చీఫ్ సోమేందు ముఖర్జీ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

కృష్ణరాజపురం: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న స్నాచర్‌ను బనశంకరి పోలీసులు అరెస్టు చేశారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ దొరికిన నిందితుడు పద్మనాభ. అతని వద్ద నుంచి 40 గ్రాముల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై నగరంలోని గిరినగర, సి.కె అచ్చుకట్టు, తిలక్ నగర, బసవనగుడి పీఎస్‌లలో పలు చోరీ కేసులు ఉన్నాయి. ఒంటరిగా వెళుతున్న మహిళలను బైక్‌పై వెంబడించి నగలను ఎత్తుకెళ్లేవాడు.

మహిళపై వ్యక్తి దాడి

గంగావతి: కనకగిరి తాలూకా రాంపురలో మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన శోభ అనే మహిళపై అమరేశ్ అనే వ్యక్తి దాడి చేసి చేయి చేసుకున్నాడు. ఘటనపై కనకగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

హుబ్లీ: ధార్వాడ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి హాస్టల్‌లోని తన గదిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. సోమవారం రాత్రి హాస్టల్ మెస్‌లో భోజనం చేసిన తర్వాత ఆ విద్యార్థి తన గదికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఫోన్ చేసినా స్పందించని నేపథ్యంలో సదరు గది కిటికీ నుంచి తొంగి చూడగా ఈ దారుణం వెలుగు చూసింది. వార్డెన్, వర్సిటీ అధికారులు పోలీసులకు, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో విజయనగర జిల్లా కొట్టూరు నుంచి విద్యార్థి తల్లిదండ్రులు హుటాహుటిన ధార్వాడకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టంకు తరలించారు. విద్యార్థి మొబైల్‌ను స్వాధీనం చేసుకొని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోటల్ రూంలు ఫుల్

బనశంకరి: జీ–20 సదస్సు , ఎయిర్‌షో నేపథ్యంలో దేశ విదేశాల నుంచి ప్రతినిధులు నగరానికి తరలిరావడంతో హోటళ్లకు గిరాకీ పెరిగింది. నగర హోటళ్లలో 50 వేల గదులను బుక్ చేసుకున్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన జీ–20 సదస్సు బుధవారం వరకు జరుగుతుంది. అలాగే 13 నుంచి 17 వరకు వైమానిక ప్రదర్శన నిర్వహిస్తారు. నగరంలోని పంచతారా హోటళ్లలో గదులన్నీ భర్తీ అయ్యాయి. త్రి స్టార్ హోటళ్ల గదులు అందుబాటులో ఉండగా వాటి ధరలను కూడా పెంచేశారు. 20వ తేదీ వరకు ఇదే రద్దీ కొనసాగనుందని హోటళ్ల సంఘం తెలిపింది.

జేఈఈలో శ్రీచైతన్య జోరు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

సాక్షి, బెంగళూరు: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థలు సత్తా చాటాయి. మంగళవారం జేఈఈ మెయిన్స్ ఫలితాలను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. ఇందులో శ్రీచైతన్యకు చెందిన ఆరుగురు విద్యార్థులు 99.9 శాతం ఉత్తీర్ణత కనపరిచినట్లు సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అద్భుత ఫలితాలను రాబట్టిన విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, తోడ్పాటునందించిన అధ్యాపక బృందానికి సంస్థ డైరెక్టర్ సుష్మ బోపణ్ణ అభినందనలు తెలిపారు.

గ్రామసింహాల స్వైర విహారం

- ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న శునకాలు
- తాజాగా కుక్కకాట్లతో నగరంలో కలకలం



నగరంలోని ఓ వీధిలో గుమికూడిన కుక్కలు



విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు



కుక్కకాటుకు గురైన బాధితులు

సాక్షి,బళ్లారి: మహానగర పాలికె అధికారులు, పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీనత వల్ల నగరంలో విచ్చలవిడిగా కుక్కలు పెరిగిపోయి ప్రజలపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. సోమవారం రాత్రి 10 గంటల తర్వాత నగరంలో పలు వీధుల్లో 30 మందిని కుక్కలు తీవ్రంగా కరిచి గాయపరచడం కలకలం సృష్టించింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా పాలకులు కుక్కలను నియంత్రించే పని చేయకుండా గాయపరిచిన తర్వాత కుక్కకాటు బాధితులను పరామర్శించి సాంత్వన పలకడం విమర్శలకు తావిస్తోంది. నగరంలో కుక్కల సంతతి పెరగడానికి ప్రధానంగా బాధ్యత వహించాల్సిన నగర మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు తమ బాధ్యతలను విస్మరించడంతో కుక్కల సంఖ్య పెరిగి అమాయక ప్రజలను కరుస్తున్నాయి. నగరంలో పెద్ద సంఖ్యలో పిచ్చి పట్టి తిరుగుతున్న కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకుతుందనే భయం ప్రజల్లో నెలకొంది. ఏటా కుక్కల బెడద నియంత్రణకు సంతానహరణ ఇంజెక్షన్లు వేస్తున్నామని ప్రభుత్వం నుంచి నిధులు కాజేస్తూ టీకాలు వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా పాలికె అధికారులు, పాలకులు నగరంలో కుక్కల బెడదను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

30 మంది కుక్కకాటు బాధితులు విమ్స్‌లో చేరిక

బళ్లారి రూరల్: ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా సుమారు 30 మంది కుక్కకాటుతో చికిత్స కోసం విమ్స్‌లో చేరిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు..కౌల్‌బజార్ వట్టప్పకేరిలో సోమవారం రాత్రి ఒక కుక్క ఏకంగా 20 మందికి పైగా కరిచింది. వీధుల్లో నిలబడి ఉండగా ఓ కుక్క పరుగెత్తుకుంటూ వచ్చి మనుషులపై దాడి చేసి కరిచింది. అనుకోని ఈ సంఘటనకు స్థానికులు విస్తుపోయారు. అదే విధంగా వాసవి పాఠశాల వెనుక ప్రాంతంలో కూడా ఇదే విధంగా మరో కుక్క దాదాపు 5 మందిపై దాడి చేసి కరిచింది. ఇలా మనుషులను కరుస్తున్న మూడు కుక్కలు పిచ్చికుక్కలు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. మొత్తం మూడు కుక్కలు ఉండవచ్చని బాధితులు చెబుతున్నారు. కాగా కుక్కకాటుకు గురైన వారిలో వట్టప్పవీధికి చెందిన అచ్చయ్య, బి.ఈరన్న, సందీప్, మసూద్, మక్బూల్‌బాషా, సన్ననరసప్ప, వెంకటేశు తదితరులు విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను కార్పొరేషన్ కమిషనర్, అధికారులు పరామర్శించారు.

వట్టప్ప కేరిలో వీధికుక్కల హల్‌చల్

బళ్లారి టౌన్: నగరంలోని కౌల్‌బజార్ వట్టప్పకేరిలో సోమవారం రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు వీధి కుక్కలు హల్‌చల్ చేశాయి. వార్డులో దాదాపు 30 మందిని కరిచాయి. ఒక్కసారిగా కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు రాకుండా తలుపులు వేసుకున్నారు. ఇటీవల నగరంలో వీధి కుక్కలు, పశువుల బెడద ఎక్కువైందని నగరవాసులు వాపోతున్నారు. 20 రోజుల క్రితం సరళాదేవి కళాశాల వద్ద ఉదయం వాకింగ్‌కు వెళ్లిన జెడ్పీ అధికారిని కుక్కల గుంపు వెంట పడడంతో కింద పడి పోయి స్పృహ కోల్పోయారు. స్కూటర్‌పై వెళ్తున్న మరో మహిళ కింద పడి స్వల్పంగా గాయపడింది.

మహిళలు సొంతంగా ఎదగాలి

- ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వివిధ చేతివృత్తుల ద్వారా స్వయంశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలో శ్రీశుభమస్తు మహిళా మండలి ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. నగరంలో జీన్స్ దుస్తుల తయారీపై మహిళలు మంచి పట్టు సాధించాలన్నారు. బళ్లారి జీన్స్ వస్త్రాల ఎగుమతిలో నారీమణుల కృషి కూడా ఉందన్నారు. ఉచిత శిక్షణా సంస్థల్లో టైలరింగ్‌తో పాటు ఎంబ్రాయిడరీ తదితరాలు నేర్చుకుంటే మేలన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడితే తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారన్నారు. కార్పొరేటర్లు మోత్కర్ శ్రీనివాస్, హనుమంతప్ప, మహిళా మండలి అధ్యక్షురాలు శ్వేత, కార్యదర్శి సుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని 22వ వార్డు ఆకుల చలమయ్య వీధిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు.

నారాయణ గురూజీ మండలిని ఏర్పాటు చేయాలి



సరస్వతిని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: ఈడిగ సమాజాభివృద్ధికి నారాయణ గురూజీ మండలిని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మాలికయ్య గుత్తేదార్ డిమాండ్ చేశారు. ఆయన హెచ్‌జీ కుటుంబం ఆధ్వర్యంలో కడెబాగిలు వద్ద ఏర్పాటు చేసిన కాటమయ్య, రేణుకా యల్లమ్మ దేవిల పూజ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా మాట్లాడారు. నారాయణ గురూజీ పేరుతో పలు పాఠశాలలను ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. తమ సమాజం వారికి ప్రధాన వృత్తి అయిన కల్లువ్యాపారానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు దివంగత డాక్టర్ రాజ్‌కుమార్ మనవరాలు సరస్వతిని ఈ వేదికపై ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లికార్జున నాగప్ప, ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, మాజీ ఎమ్మెల్యే హెచ్ఎస్ మురళీధర్, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్, టౌన్ ప్లానింగ్ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శెట్టి, ఈడిగ సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీకి పిలిచి అత్యాచారయత్నం

బనశంకరి: పార్టీకి యువతులను పిలిపించి అత్యాచారానికి యత్నించిన ఇద్దరు యువకులను మంగళవారం కోరమంగల పోలీసులు అరెస్టుచేశారు. ఈ నెల 5వ తేదీన పార్టీ పేరుతో ఇద్దరు యువకులు పరిచయస్తులైన ఇద్దరు యువతులను పార్టీకి పిలిచారు. అర్ధరాత్రి 2.30 వరకు నలుగురు కలిసి పార్టీ చేసుకున్నారు. మద్యం మత్తులో యువతులపై, యువకులు అత్యాచారానికి యత్నించడంతో యువతులు వారి బారి నుంచి తప్పించుకున్నారు. బాధి తులు జమ్ముకశ్మీర్‌కు చెందినవారుగా తెలిసింది. మరుసటిరోజు యువతులు కోరమంగల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులను అరెస్టుచేశారు.

ఘనంగా సవితా మహర్షి జయంతి



ఉత్తమ విద్యార్థులు, సాధకులకు సన్మానం దృశ్యం

బళ్లారిఅర్బన్: సమాజానికి మహనీయులు అందించిన సేవలు అపారమని సిటీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన సవితా మహర్షి జయంతిని ప్రారంభించి మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర మాట్లాడుతూ సవితా మహర్షి ఆదర్శాలను అలవరుచుకోవాలన్నారు. ఉపన్యాసకులు బసవరాజ్, కన్నడ సంస్కృతి శాఖ అధికారి సురేష్, సవితా సమాజ ప్రముఖులు యాళ్పి హెచ్.తిప్పణ్ణ, సణ్ణగౌండ్ల ఆర్ శేఖణ్ణ, డాక్టర్ రాజశేఖర్, సమాజ బాంధవులు పాల్గొన్నారు. అంతకు ముందు మున్సిపల్ మైదానంలో సవితా మహర్షి చిత్రపటానికి మేయర్ రాజేశ్వరి పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు.

కోలారు : సవితా మహర్షి చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్సీ గోవిందరాజులు తెలిపారు. మంగళవారం నగరంలోని సువర్ణ కన్నడ భవనంలో నిర్వహించిన సవితా మహర్షి జయంతిలో పాల్గొని మాట్లాడారు. ఉపవిభాగాధికారిణి వెంకటలక్ష్మి, కసాప మాజీ జిల్లా అధ్యక్షుడు నాగానంద కెంపరాజు, కన్నడ, సంస్కృతి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంబరంగా వీరభద్ర రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి: బుక్కసాగర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం వీరభద్రేశ్వరుని రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈసందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజల రాకతో గ్రామం కళకళలాడింది. రథోత్సవాన్ని తిలకించి భక్తులు కానుకలు సమర్పించుకోగా మరికొందరు కోర్కెలు నెరవేర్చాలని కోరుకున్నారు.

నిప్పంటుకుని మహిళ మృతి

బనశంకరి: వంటగదిలో వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించి మహిళ మరణించింది. మంగళవారం మల్లేశ్వరం సంపిగేరోడ్డు వెనుక భాగంలోని ఇంట్లో మేరీ (55) అనే మహిళ వంట చేస్తుండగా గ్యాస్ స్టౌలో మంటలు ఎక్కువై పక్కన ఉన్న బట్టకు నిప్పు అంటుకుంది. గ్యాస్ పైపు కూడా కాలిపోయి మంటలు వ్యాపించాయి. ఆమె మంటలను ఆర్పే ప్రయత్నంలో బయటికి రాలేకపోయింది. ఇరుగుపొరుగు చేరుకుని ఆమెను కాపాడేలోపు మేరీ మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

హంతకులపై చర్యలకు డిమాండ్

రాయచూరు రూరల్: లింగసూగూరులో పీయూసీ విద్యార్థినిపై అత్యాచారం జరిపి హత్య చేసిన కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలని మానవ హక్కుల అవినీతి వ్యతిరేక సంస్థ డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకుడు సాదిక్ మాట్లాడారు. లింగసూగూరులోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న ఐశ్వర్యను ప్రిన్సిపాల్ రమేష్ మానసికంగా, శారీరకంగా తనకు సహకరించాలని నిత్యం వేధించేవాడని ఆరోపించారు. ఆమెను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

భర్త చేతిలో భార్య హతం

యశవంతపుర: భార్యను భర్త హత్య చేసిన ఘటన గదగ జిల్లా గజేంద్రగడ తాలూకా బేవినకట్టి గ్రామంలో జరిగింది. బేవినకట్టి గ్రామానికి చెందిన విద్యా అడిన (24)ను భర్త హత్య చేసి పరారయ్యాడు. మంగళవారం ఉదయం భర్త మౌనేశ్ ఆమెను కొడవలితో నరికి హత్య చేశారు. ఘటనాస్థలాన్ని గజేంద్రగడ పోలీసులు పరిశీలించారు. నిందితుడు మౌనేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పుస్తకం ఆవిష్కరణ

తుమకూరు: గత ఐదేళ్లలో కొరటగెరె నియోజకవర్గంలో రూ.వేలాది కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే పరమేశ్వర్ అన్నారు. మంగళవారం ఇక్కడ మీడియా సమావేశంలో ఆయన హెజ్జెగురుతు అనే పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. తాను ఈ నియోజక వర్గానికి వచ్చిన అనంతరం అన్ని రకాల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ పుస్తకంలో ఆ వివరాలన్నీ ఉన్నాయని అన్నారు. ప్రతి ఇంటికి ఈ పుస్తకాన్ని అందజేస్తామన్నారు.

బాలుని అపహరణకు యత్నం

మండ్య: జిల్లాలోని మళవళ్లి తాలూకాలోని కిరుగావలు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఐదేళ్ల బాలున్ని కిడ్నాప్‌కు యత్నం జరిగింది. పౌడర్ విక్రయించే నెపంతో ముసుగు వేసుకొని వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక మహిళను పిలిచి పౌడర్ కావాలా అని అడిగారు. ఆమె వద్దని చెప్పింది. ఇంతలో అక్కడ ఉన్న బాలున్ని బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లేందుకు యత్నించారు. బాలుడు బాలుడు గట్టిగా అరవడంతో అక్కడ ఉన్న ప్రజలు పరుగున రావడంతో దుండగులు పరారయ్యారు. దుండగుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

కోలారు వార్తలు...

క్రీడాభివృద్ధికి సాయం అందిస్తా



విజేత జట్టుతో మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్

కోలారు : యువత క్రీడలు, విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందిస్తానని మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని క్యాలనూరులో రాయల్ క్లబ్ యువత నిర్వహించిన 20–20 క్రికెట్‌లో విజేత జట్టుకు రూ.50 వేల నగదు బహుమతిని అందించి మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు సహాయం అందించడానికి తాను సిద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా బెగ్లి ప్రకాష్, పార్టీ తాలూకా అధ్యక్షుడు సీడీ రామచంద్రేగౌడ, క్యాలనూరు జీపీ సభ్యుడు రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్ల పంపిణీ



కేజీఎఫ్ : కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా నగరానికి సమీపంలో 2 ఎకరాల్లో అన్ని హంగులతో నిర్మిస్తున్న కల్యాణ మంటపానికి ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లను విడుదల చేయించినట్లు ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. ఆమె మంగళవారం నగరంలోని కింగ్ జార్జి హాల్‌లో భవన నిర్మాణ కార్మికుల కల్యాణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాలోని రిజిస్టర్డ్ కట్టడ కార్మికుల పిల్లలకు ట్యాబ్‌లు, పాఠశాల కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. మరో 6 నెలల్లోగా కళ్యాణ మంటప నిర్మాణం పూర్తవుతుందన్నారు. నగరంలో ఇళ్ల స్థలాలు లేని వారి కోసం రాజేష్ క్యాంప్ వద్ద 25 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నసీర్ అహ్మద్, నగరసభ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన డబుల్ ఇంజిన్ సర్కార్

బళ్లారి టౌన్: కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పిందని మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుమకూరు వద్ద ఫుడ్ ఫ్యాక్టరీని నిర్మించి 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, దేశంలో ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రూ.80 వేల కోట్ల షేర్ల కుంభకోణంలో ఎల్ఐసీ, ఎస్‌బీఐ బ్యాంకులు నష్టపోయాయన్నారు. రాష్ట్రంలో వరదలు వచ్చినప్పుడు రాని మోదీ ప్రస్తుతం ఎన్నికలు దగ్గరకు వస్తున్నందునే రాష్ట్రానికి వస్తున్నారని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. నేతలు మహమ్మద్ గౌస్, లోకేశ్, విజయకుమార్, రవీంద్ర పాల్గొన్నారు.

యథేచ్ఛగా గోవధపై ఫిర్యాదు

హుబ్లీ: గోవధ నిషేధ చట్టం అమల్లో ఉన్నా హుబ్లీ, ధార్వాడలోని అక్రమ కబేళాలపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జంట నగరాల పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. యథేచ్ఛగా వందలాది గోవులను వధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భజరంగదళ కన్వీనర్ శివానంద సత్తిగేరి మాట్లాడుతూ పాత హుబ్లీ అల్తాఫ్ నగర్ వందలాది గోవధ దృశ్యాలను వీడియా చేసి కమిషనర్ రమణగుప్తాకు సమర్పించామన్నారు. కసబాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గోవధ జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచిన్న ఆవు దూడలను దారుణంగా హతమారుస్తున్నారని తెలిపారు.

23న సంత సేవాలాల్ జయంతి

చెళ్లకెరె రూరల్: బిసినీరు ముద్దప్ప ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 23న సంత సేవాలాల్ జయంతిని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రెహన్‌పాషా తెలిపారు. తాలూకా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సేవాలాల్ జయంతి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే టి.రఘుమూర్తి కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మార్చి 6, 7 తేదీల్లో కసాప సమ్మేళనం

గంగావతి రూరల్: మార్చి 6, 7 తేదీల్లో తాలూకా 8వ కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కసాప కొప్పళ జిల్లా అధ్యక్షులు శరణేగౌడ పోలీస్ పాటిల్ తెలిపారు. మంగళవారం సాహిత్య భవనంలో తాలూకా కసాప అధ్యక్షులు శ్రీనివాస్ అంగడి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండ్ సమీపంలోని జూనియర్ కాలేజీ మైదానంలో సమ్మేళన వేడుకలను ఘనంగా నిర్వహించాలని మనవి చేశారు. కసాప కార్యదర్శి ఆరాళ రుద్రేశ్, శివకాంత, కార్యవర్గ మండలి సభ్యులు మైలారప్ప, శ్రీనివాస్, మారుతి, విరుపాక్షప్ప, సుంకప్ప, కళాప్రియ, సురేశ్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నాలుగేళ్ల బీజేపీ సర్కార్ హయాంలో నీటిపారుదల శాఖలో జరిగిన అక్రమాలు, అవినీతిపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సంచాలకుడు రజాక్ ఉస్తాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలో పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. రూ.22,500 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాల్లో అక్రమాలు మేటలు వేశాయన్నారు. భద్ర, అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ పనుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నారాయణపుర కుడి, ఎడమ కాలువ, విజయనగర కాలువల్లో పనులు చేయకుండానే నిధులు కాజేసిన అంశంపై కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా పనులు చేపట్టడాన్ని ఖండించారు. 40 నుంచి 50 శాతం కమీషన్ పొంది పనులు పంచిపెట్టడాన్ని తప్పుబట్టారు.

జెడ్పీ మాజీ అధ్యక్షునికి మాతృవియోగం



తమ్మినీడి లక్ష్మి(ఫైల్)

గంగావతి రూరల్: కొప్పళ జెడ్పీ మాజీ అధ్యక్షుడు, హులిగి జెడ్పీ సభ్యుడు తమ్మినీడి జనార్ధన్ నాయుడుకు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి తమ్మినీడి లక్ష్మి(84) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె భౌతికకాయానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తమ్మినీడి జనార్ధన్ నాయుడు తెలిపారు. కాగా ఆమె మృతి వార్త తెలియగానే అనేక మంది ప్రముఖులు పెద్ద సంఖ్యలో జనార్ధన్ నాయుడు నివాసానికి తరలివచ్చి సంతాపం తెలిపారు.

వైభవంగా సల్లాపురమ్మ జాతర

శ్రీనివాసపురం : ముళబాగిలు తాలూకాలోని దేవరాయ సముద్ర జీపీలోని కీలు హొళలిలో మంగళవారం సల్లాపురమ్మ జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు సల్లాపురమ్మ విగ్రహాన్ని తలపై మోసుకుని వచ్చి గ్రామంలో ఊరేగించారు. జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాల సంఘం ప్రారంభం

శ్రీనివాసపురం : పాడి రైతులు సహకార సంఘాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కెఆర్ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని కొత్తపల్లి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులకు కోచిముల్ అందిస్తున్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోచిముల్ డైరెక్టర్ హనుమేష్, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడాలి

రాయచూరు రూరల్: నశించి పోతున్న జానపద కళలకు ప్రాణం పోయాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కన్నడ భవనంలో జరిగిన జానపద సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నడ సంస్కృతి శాఖ ఏడీ మంగళ నాయక్, రాజేంద్ర జాలదార్, హులిగప్ప, అయ్యప్ప, ఈరణ్ణ పాల్గొన్నారు.

నియామకాల్లో అక్రమాల్లేవు

హొసపేటె: బళ్లారి జిల్లా కేంద్ర సహకార(బీడీసీసీ) బ్యాంక్ ఉద్యోగ నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని బ్యాంక్ ఉపాధ్యక్షుడు కే.తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం బ్యాంక్ సభాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్యాంక్ చైర్మన్, మంత్రి ఆనంద్‌సింగ్‌పై కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్ హిట్నాల్ చేసిన ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో కూడినవని తెలిపారు. ఇటీవల జరిగిన బ్యాంక్ ఉద్యోగుల నియామకంలో మంత్రి ఆనంద్‌సింగ్ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, నియామకాలన్నీ పారదర్శకంగా జరిగాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ డైరెక్టర్లు చంద్రశేఖరయ్య, కే.ప్రకాష్, వృషబేంద్రయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

వంతెనల పనుల పరిశీలన

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం నాటికి వంతెనల పనులు పూర్తి చేయాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆదేశించారు. మంగళవారం తాలూకాలోని కుర్వకుల–ఆత్కూరు, రాంపూర్, కురవకుర్దల వద్ద నిర్మాణంలోని వంతెనల పనులను పరిశీలించి మాట్లాడారు. త్వరితగతిన నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, బసవరాజ, భాస్కర్ గౌడ, చెన్నబసప్పలున్నారు.

కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు



మాట్లాడుతున్న ఎంపీ ఎస్ మునిస్వామి

కోలారు : దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ దళితులు, మైనార్టీలను ఓటు బ్యాంకుగా మార్చుకుందని ఎంపీ ఎస్ మునిస్వామి ఆరోపించారు. మంగళవారం నగరంలోని సుల్తాన్ తిప్పసంద్రలో వివిధ పార్టీల నుంచి బీజేపీలోకి కార్యకర్తల చేరిక సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లిం మహిళల భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ త్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టాలు వంటి ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చారన్నారు. నేడు దేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు సోదరభావంతో జీవిస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తరువాత దేశంలో ఎక్కడా బాంబు పేలుళ్లు జరగలేదు. ఉగ్రవాద చర్యలకు ప్రధాని పూర్తిగా అడ్డుకట్ట వేశారన్నారు. బీజేపీ నాయకుడు బెగ్లి సిరాజ్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, జావేద్ అన్వర్, అబ్దుల్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో కంప్లి ఉత్సవాలు



లోగో విడుదల చేసిన ఎమ్మెల్యే గణేష్ తదితరులు

కంప్లి: పట్టణంలో ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగనున్న కంప్లి ఉత్సవాలతో ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుందని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సభాంగణంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి తాలూకా స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు రాజకీయాలకు అతీతంగా సంఘ సంస్థలు, ప్రభుత్వ అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని సహకారం అందించాలన్నారు. ఈ ఉత్సవం భావైక్యతను కలిగి ఉందని, అత్యవసరంగా మొదటిసారి నిర్వహిస్తున్నామన్నారు. మున్ముందు మరింత ఆడంబరంగా జరుపుతామన్నారు. ఈ నెల 11న షామియాచంద్ కళాశాల నుంచి ఉత్సవ ఊరేగింపు ప్రారంభించి చారిత్రక సోమప్ప చెరువులో తుంగభద్ర హారతి జరుగుతుందన్నారు. చెరువుతో పాటు పట్టణమంతా శుభ్రం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించాలని మున్సిపాల్టీకి సూచించామన్నారు. 12న టీపీ కార్యాలయం నుంచి సత్యనారాయణ పేట మార్గంలో మహిళలు, ప్రజలకు ముగ్గుల, కుస్తీ, కబడ్డీ పోటీలు, సాయంత్రం 4 గంటలకు స్థానిక ప్రతిభావంతుల సాంస్కృతిక కార్యక్రమాలు, నగెహబ్బ, విజయ ప్రకాష్ బృందంతో సంగీత రసమంజరి జరుగుతాయన్నారు. వివిధ సమితుల అధ్యక్షులు, సభ్యులు, కార్యదర్శులు ఉత్సవ బాధ్యతలు నిర్వహించి సమాచారం డీసీ, ఏసీలకు పంపాలని తహసీల్దార్ గౌసియాబేగం సూచించారు. సమావేశంలో మున్సిపల్ అధ్యక్షురాలు శాంతలా, టీపీ ఈఓ కేఎస్ మల్లనగౌడ, ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అవసరం

మాలూరు : విద్యార్థులు క్రమశిక్షణ, సంయమనం అలవర్చుకోవాలని, దురలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత విద్యావంతులు కావాలని చిక్కతిరుపతి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునియల్లప్ప తెలిపారు. మంగళవారం తాలూకాలోని చిక్కతిరుపతి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన తనకు అభినందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అహంభావం ఎన్నటికీ పెంచుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, సుజాతమ్మ, ముత్తప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆనేకల్‌లో కన్నడ సాహిత్య సమ్మేళనం



సమ్మేళనంలో అతిథులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ పట్టణంలో ఉన్న కాల్బెండ్ మైదానంలో మంగళవారం కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. తాలూకాలోని వివిధ సంఘాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మేళనంలో సరిహద్దు సమస్యలు, ఉద్యోగుల సమస్యలు తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో హుల్లహళ్లి శ్రీనివాస్, మాజీ ఐఏఎస్ అధికారి శివరామ్, ఘటాఘట్ నాగరాజు, జిగణి శంకర్, కజావే మంజునాథ్ దేవ, డాక్టర్. సి.కే.చిన్నప చిక్క హాగడె, జీఎంఆర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహళ్లిలో నమ్మ క్లినిక్ సేవలు



క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి బీబీఎంపీ కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్‌విప్, ఎం.సతీష్ రెడ్డి, బొమ్మనహళ్లి బీబీఎంపీ జాయింట్ కమిషనర్ ఆర్.కృష్ణమూర్తి పాల్గొని నమ్మ క్లినిక్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నమ్మ క్లినిక్‌లో బీబీఎంపీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఉచిత సేవలు పొందవచ్చన్నారు. క్లినిక్‌లో ఇద్దరు డాక్టర్లు, ఒక నర్సు అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో బొమ్మనహళ్లి మాజీ కార్పొరేటర్, బీఎస్. మంజునాథ్ రెడ్డి, నగరసభ మాజీ కౌన్సిలర్ టి. రామచంద్ర, స్థానిక బీబీఎంపీ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సీమంతం



హారతి పడుతున్న సహచర కానిస్టేబుళ్లు

కృష్ణరాజపురం: నగరంలోని మైకో లేఔట్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌కు సహచర సిబ్బంది సీమంతం నిర్వహించారు. గంగుబాయి అనే మహిళా కానిస్టేబుల్‌కు పూలు, పండ్లు ఇచ్చి సాంప్రదాయంగా సీమంతం వేడుక నిర్వహించారు.

బైక్ వీలింగ్.. వ్యక్తి అరెస్ట్



బొమ్మనహళ్లి: బైక్‌పై వీలింగ్ చేస్తున్న వ్యక్తిని హెచ్‌ఎస్ఆర్ లేఔట్ ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌ఎస్ఆర్ లేఔట్ 27వ రోడ్డులో బైక్‌పై వీలింగ్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నాడనే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

మారికాంబ జాతర వేడుకలు ప్రారంభం



పూజలు చేస్తున్న దృశ్యం

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా సాగర పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మారికాంబ అమ్మవారి జాతర వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచి వివిధ గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి మారికాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు విద్వాన్ పి.ఎల్. గజానన భట్ ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయ పూజలు చేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

శివాజీనగర: హొన్నావర తాలూకా కుందాపుర పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రామగౌడ (32) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టింగ్‌లకు బానిసైన రామగౌడ పలుచోట్ల అప్పులు చేశాడు. అదే సమయంలో విధులకు గైర్హాజరయ్యాడు. దీనిపై శాఖ దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సముద్ర తీరంలోని పార్కులో ఓ చెట్టుకు రామగౌడ ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడు. హొన్నావర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం

- సిగ్నల్ వద్ద బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కిన డ్రైవర్
- పలువురికి తీవ్ర గాయాలు
- కారులో ఎమ్మెల్యే పేరుతో స్టిక్కర్
- బెంగళూరులో దుర్ఘటన



ప్రమాద దృశ్యం, మృతులు మజీద్, అయ్యప్ప

సిగ్నల్ వద్ద బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కి..

శివాజీనగర: బెంగళూరు నృపతుంగ రోడ్డులో బీజేపీ ఎమ్మెల్యే హరతాళు హాలప్ప కుమార్తె ప్రయాణిస్తున్న కారు ఢీకొని ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు... యలహంక న్యూటౌన్‌కు చెందిన మోహన్ కారు నడుపుతున్నాడు. కారులో ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్ సుష్మిత ఉన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆమెను డ్రైవర్ మోహన్ డ్యూటీకి తీసుకెళుతున్నాడు. కోర్టు కాంప్లెక్స్ వద్దకు వచ్చి హడ్సన్ సర్కిల్ ఎడమ వైపునకు తిరిగేందుకు ప్రయత్నించగా సిగ్నల్ పడింది. దీంతో వేగంగా వచ్చిన మోహన్ రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలకు ఢీకొన్నాడు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరు మృతి చెందారు. మృతులను హెచ్‌బీఆర్ లేఔట్‌కు చెందిన మజీద్ ఖాన్ (36) కే.జీ.హళ్లికి చెందిన అయ్యప్ప (60)లుగా గుర్తించారు.

సిగ్నల్ వద్దకు రాగానే బ్రేక్ వేయకుండా ఎక్సలేటర్‌పై కాలుపెట్టడంతో ప్రమాదం జరిగిందని డ్రైవర్ మోహన్ పోలీసుల ముందు తప్పు ఒప్పుకొన్నాడు. పోలీసులు అతని వాంగ్మూలన్ని రికార్డు చేసుకున్నారు. వాహనం నడిపే సమయంలో మోహన్ ఫోన్‌లో ఏమైనా మాట్లాడుతున్నాడా అనే విషయంపై సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేఏ 50 ఎంఏ 6600 నంబర్ కలిగిన కారుపై ఎమ్మెల్యే హాలప్ప పేరున్న స్టిక్కర్ అంటించి ఉంది. ఈ కారు యలహంకకు చెందిన రాము సురేశ్ అనే వ్యక్తి పేరు మీద ఉంది. ఇతను ఎమ్మెల్యేకు చెందిన మనిషిగా భావిస్తున్నారు. డ్రైవర్ ర్యాష్‌గా వాహనాన్ని నడుపుకుంటూ రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే స్టిక్కర్లను ఉపయోగించటం నేరం:
ప్రమాదానికి కారణమైన ఇన్నోవాకు ఎమ్మెల్యే స్టిక్కర్ ఉంది. రాజకీయ నాయకులు ఉపయోగించని వాహనాలపై ఎమ్మెల్యే స్టిక్కర్‌లను ఉపయోగించటం చట్ట వ్యతిరేకం.

హలసూరు గేట్ స్టేషన్‌లో కేసు:
డ్రైవర్ మోహన్‌ను ఆల్కోమీటర్ పరీక్షించగా మద్యం సేవించలేదని తేలిందని డీసీపీ (ట్రాఫిక్) కళా కృష్ణస్వామి తెలిపారు. హలసూరు గేట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తుమకూరు జిల్లాలో జీ 20 ప్రతినిధులు



తుమకూరు: తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని తిరుమణి సోలార్ పార్కును మంగళవారం జీ–20 దేశాల ప్రతినిధులు సందర్శించారు. బృందంలో అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు మొదట తిరుమణి సమీపంలోని ఉన్న పరిపాలన కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. వారికి సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. అక్కడ దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అక్కడి నుంచి క్యాతగాన చెర్లు వద్ద సుమారు 400 కిలోవ్యాట్ సామర్థ్యం ఉన్న పవర్‌గ్రిడ్ స్టేషన్‌ను పరిశీలించారు. ప్రతినిధుల వెంట జిల్లా అధికారి వైఎస్ పాటిల్, క్రెడల్ ఎండీ రుద్రప్పయ్య, ఎస్‌పీడీసీఎల్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి కే.ఎస్. అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

ఎయిమ్స్ ఏర్పాటుకు వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ

రాయచూరు రూరల్: నగరంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థను(ఎయిమ్స్) ఏర్పాటుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ వినతి పత్రం సమర్పించారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ మైదానంలో 261 రోజులుగా ఆందోళన చేస్తున్న విషయాన్ని వివరించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై రాయచూరుకు ఎయిమ్స్‌ను మంజూరు చేసేలా కేంద్రానికి లేఖతో పాటు ప్రతిపాదనలు పంపాలన్నారు.

నాటు పిస్తోళ్ల విక్రేత అరెస్ట్

- 16 పిస్తోళ్లు, 28 బుల్లెట్లు స్వాధీనం



పిస్తోళ్లు, బుల్లెట్లను పరిశీలిస్తున్న సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎస్‌డీ.శరణప్ప తదితరులు

బనశంకరి: బెంగళూరు నగరంలో అక్రమంగా పిస్తోళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి పది నాటు పిస్తోళ్లు, 20 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఎస్‌డీ.శరణప్ప తెలిపారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

పక్కా సమాచారంతో నిఘా..
అక్రమ పిస్తోళ్ల సరఫరాపై సీసీబీ పోలీసులకు పక్కా సమాచారం లభించింది. దీంతో నిఘా ముమ్మరం చేశారు. మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన రోషన్ బన్సాల్ గైక్వాడ్ నగరానికి పిస్తోళ్లు, బుల్లెట్లు తీసుకువస్తున్నట్లు సమాచారం వచ్చింది. సీసీబీ పోలీసులు కాపుగాసి గైక్వాడ్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద 16 నాటు పిస్తోళ్లు, 28 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. గైక్వాడ్‌పై మహారాష్ట్ర వాడి పోలీస్ స్టేషన్‌లో ఒక హత్యాయత్నం, రెండు చోరీ కేసులు నమోదై ఉన్నాయి. గైక్వాడ్‌తో ప్రమేయం ఉన్న వ్యక్తి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. విలేకరుల సమావేశంలో సీసీబీ సీఐ మహదేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడికి పూల రథోత్సవం



తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా మాగోడులో వెలసిన శ్రీ మాగోడు రంగనాథ స్వామి వారి పూల రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయండి



స్థలం ఇవ్వాలని కోరుతున్న వాల్మీకి నాయకులు

గౌరిబిదనూరు: తాలూకా బాదిమరళూరు గ్రామంలోని సర్వే నం 107లో 24 కుంట్ల బంజరు భూమిని మంజూరు చేయాలని వాల్మీకి నాయక యువ ట్రస్ట్ అధ్యక్షుడు గంగయ్య అధికారుల విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... గ్రామంలో వందకు పైగా వాల్మీకి కుటుంబాలు ఉన్నాయని, వివాహాలు, సమావేశాలు తదితర వాటిని జరుపుకోవడానికి సముదాయ భవన అవసరాన్ని ఎమ్మెల్యేకు వివరించనున్నట్లు తెలిపారు. జిల్లాధ్యక్షుడు అశ్వత్థప్ప మాట్లాడుతూ... ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకి వర్గానికి స్థలం ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నవీన్‌కుమార్, నరేంద్ర, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్



వివరాలు వెల్లడిస్తున్న న్యాయమూర్తి

మైసూరు: ఈనెల 11 జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రధాన జిల్లా న్యాయమూర్తి జీఎస్ సంగ్రేశి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా కోర్టు భవనంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం పొందవచ్చని, నగర, తాలూకా కోర్టుల్లో దాదాపు లక్ష కేసులు విచారణలో ఉన్నాయని, వాటిలో 59,872 కేసులు సివిల్, 62,403 క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌తో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాల్మీకి వార్షికోత్సవాలకు వంద క్వింటాళ్ల బియ్యం

చింతామణి: దావణగెరె జిల్లా రాజనహళ్లి మహర్షి వాల్మీకి గురుపీఠంలో 8, 9 తేదీల్లో జరిగే వాల్మీకి వార్షికోత్సవాలకు చింతామణి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి వంద క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సముదాయం నేతలు పాల్గొన్నారు. బియ్యం బస్తాలను లారీలో తరలించారు.

పునీత్ రోడ్డుగా నామకరణం



పునీత్ చిత్రపటానికి సీఎం నివాళి

బనశంకరి: మైసూరురోడ్డు నాయండహళ్లి జంక్షన్ నుంచి బన్నేరుఘట్టరోడ్డు వెగా సిటీమాల్ జంక్షన్ వరకు సుమారు 12 కిలోమీటర్లు పొడవుగల రోడ్డుకు కర్ణాటక రత్న దివంగత పునీత్‌రాజ్‌కుమార్ రోడ్డుగా పేరు పెట్టారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం బొమ్మై, పునీత్ సతీమణి అశ్విని, రాఘవేంద్ర రాజ్‌కుమార్, విజయేంద్ర రాజ్‌కుమార్, మంత్రి ఆర్.అశోక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత చంద్రశేఖరకంబార, ఎమ్మెల్యేలు రవిసుబ్రమణ్య, సతీశ్‌రెడ్డి, ఎం.కృష్ణప్ప, ఉదయ్‌గరుడాచార్, ఎంపీ ఎంపీ.తేజస్విసూర్య పాల్గొన్నారు.

యశవంతపుర జేడీఎస్ అభ్యర్థిగా జవరాయి

యశవంతపుర: వచ్చే శాసనసభ ఎన్నికలలో యశవంతపుర నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా జవరాయిగౌడ పేరును మాజీ సీఎం కుమారస్వామి ప్రకటించారు. మంగళవారం కెంగేరి పార్టీ ఆఫీసులో ముఖ్య నాయకులతో చర్చించి పేరును ఖరారు చేశారు. కొన్ని సమస్యల కారణంగా అభ్యర్థిని ప్రకటించే విషయం ఆలస్యమైంది. నియోజకవర్గంలో నిజాయితీపరులైన కార్యకర్తలున్నారు. గతంలోను జవరాయిగౌడ పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీ బీ టీం అంటూ తప్పు దారి ప్రకటించారని ఆరోపించారు. యశవంతపుర జేడీఎస్ కంచుకోట అని కుమారస్వామి పేర్కొన్నారు. ఎన్నికలలో పోటీ చేసి మూడుసార్లు ఓడిన జవరాయిగౌడ కుమారస్వామి వద్ద కన్నీరు పెట్టుకున్నారు. ఈసారి జేడీఎస్‌ను గెలిపించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు

పేదల కోసమే నమ్మ క్లినిక్‌లు



క్లినిక్ ప్రారంభోత్సవంలో మంత్రి తదితరులు

కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలో నివాసం ఉంటున్న నిరుపేదలకు మంచి వైద్యం అందివ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నమ్మ క్లినిక్‌లు బీబీఎంపీ పరిధిలో ఏర్పాటు చేశామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి, కృష్ణరాజపురం ఎమ్మెల్యే బైరతి బసవరాజు అన్నారు. మంగళవారం నగరంలోని కేఆర్ పురం బసవపుర వార్డులో ఆయన నమ్మ క్లినిక్ ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ పేదలు, మధ్య తరగతి వారికి ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యేను దూషించడం తగదు



స్టేషన్ ఎదుట మహేష్ మద్దతుదారుల ఆగ్రహం

చింతామణి: జేడీఎస్ ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని దూషించడంపై ఆ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మాజీ టీపీ సభ్యుడు నారాయణస్వామి కుమారుడు మహేశ్ వారి మద్దతుదారులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని తీవ్ర పదజాలంతో తిట్టారని, దీనిపై తాను రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు బయ్యారెడ్డి తెలిపారు. కేసు విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మద్దతుదారులు పోలీస్ స్టేషన్ చేరుకుని కేసు ఎలా నమోదు చేస్తారని వాదించారు. దీంతో సుధాకర్ మద్దతుదారుల నుంచి కూడా పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ.... మహేశ్ ఏడాది క్రితం పార్టీ వీడి వెళ్లారని, ఇదే సమయంలో రాజకీయాలు చేయడం తగదని అన్నారు.

హోసూరు వార్తలు..

కేరళ మహిళల దీపోత్సవం



దీపోత్సవ పూజలు నిర్వహిస్తున్న కేరళ మహిళలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ కామరాజ్‌కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనంలో కేరళ రాష్ట్రానికి చెందిన మహిళలు దీపోత్సవ పూజలను ఘనంగా జరుపుకొన్నారు. హోసూరు పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు పట్టణంలో నివాసముంటున్నారు. అందులో భాగంగా భారతీయ హిందూ సేవా పరివార్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కేరళ వాసులతో పాటు హోసూరు ప్రాంతంలో నివాసముంటున్న కేరళ ప్రజలు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాలు, భక్తి కీర్తనలను ఆలపించారు. కేరళీయులు పెద్ద ఎత్తున కుటుంబాలతో ఈ వేడుకలో పాల్గొన్నారు.

ప్రత్యంగిరాదేవి ఆలయంలో మిరపకాయల యాగం



మిరపకాయల యాగంలో పాల్గొన్న భక్తులు

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లిలో వెలసిన ప్రసిద్ధి శ్రీ అధర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో తమిళ తైమాస పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం రాత్రి మిరపకాయల యాగం నిర్వహించారు. ఈ యాగంలో హోసూరు, బాగలూరు, సూళగిరి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని యాగంలో మిరపకాయలు వేసి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం మహిళా భక్తులు పిండిదీపాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మురికి కాల్వలో పడి కూలి మృతి

క్రిష్ణగిరి: మురికినీటి కాల్వలో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన బర్గూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా పూమాలైనగర్‌కు చెందిన కార్మికుడు కందన్ (35) సోమవారం సాయంత్రం రోడ్డుపై నడుస్తూ అకస్మాత్తుగా మురికి కాల్వలో పడ్డాడు. తీవ్రంగా గాయపడిన కందన్‌ను క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బర్గూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రోడ్డుపై రాళ్లు, ప్రజలకు అవస్థలు



మట్టిరోడ్డుపై పడేసిన రాళ్లు

- కెలమంగలంలో దుస్థితి

కెలమంగలం: యూనియన్ కేంద్రం కెలమంగలం పట్టణ పంచాయతీలోని పశువైద్య కేంద్రానికి వెళ్లే మట్టి రోడ్డుపై కొంత మంది బండరాళ్ల ముక్కలను పడేయడంతో రైతులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. కెలమంగలంలోని ప్రభుత్వ పశువైద్య కేంద్రానికి కెలమంగలం చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పోషిస్తున్న పశువులు, మేకలు, గొర్రెలను చికిత్సల కోసం తీసుకొస్తుంటారు. ఆస్పత్రికి వెళ్లేందుకు మట్టి రోడ్డు మాత్రమే ఉండేది. వర్షాకాలంలో ఈ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారిపోయి నడవలేని స్థితిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో గొంత మంది గ్రానైట్ రాళ్లను తీసుకెళ్లి రోడ్డుపై పడేయడంతో నడవడానికి, వాహనాలు వెళ్లేందుకు అడ్డుగా ఉంది. ఆ మార్గంలో వెళ్లే పశువులకు గాయాలేర్పడుతున్నాయని, సంబంధిత శాఖాధికార్లు చర్యలు చేపట్టి పశువైద్య కేంద్రం వరకు రోడ్డును ఏర్పాటు చేయాలని, లేనిచో రైతు సంఘం ద్వారా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రైతులు తెలిపారు.

గ్రామంలో చొరబడిన ఒంటి ఏనుగు



బోడిచిపల్లి ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు

కెలమంగలం: గత కొన్ని రోజులుగా అడవి ఏనుగుల బెడద పెచ్చుమీరుతోంది. కర్ణాటక రాష్ట్రం బన్నేరుఘట్ట ప్రాంతం నుంచి తమిళనాడుకు చేరుకొన్న వందకు పైగా ఏనుగులు జవళగిరి, డెంకణీకోట, ఉడేదుర్గం అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. కొద్ది రోజుల క్రితం డెంకణీకోట ప్రాంతం నుంచి శ్యానమావు అటవీ ప్రాంతానికి 58 ఏనుగులు చేరుకొన్నాయి. ఈ ఏనుగు మంద నుంచి ఆరు ఏనుగులు ఒంటరిగా విడిపోయి డి.కొత్తపల్లి, సినిగిరిపల్లి, శ్యానమావు, పేరండపల్లి, బెన్నేకల్ ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటపొలలాను తొక్కి ధ్వంసం చేయడంతో పాటు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి గ్రామానికి ఒంటి ఏనుగు చొరబడడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఏనుగులు దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

జల్లికట్టు నిబంధనలను పాటించాలి



సమీక్షా సమావేశంలో అధికారులు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో జల్లికట్టు నిర్వహణపై అధికారులు పాటించవలసిన నిబంధనలపై మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో భారత జంతుసంరక్షణ శాఖ ప్రతినిధి మిటల్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. జిల్లా కలెక్టర్ దీపక్ జేకప్, పోలీసు, రెవిన్యూ, పశుసంవర్ధక, అగ్నిమాపక తదిత శాఖల అధికార్లు పాల్గొన్నారు. మిటల్ మాట్లాడుతూ జల్లికట్టు నిర్వహించే వారు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొంది నిబంధనలు పాటించాలని, జల్లికట్టు నిర్వహించే ప్రాంతం సుమారు 150 మీటర్ల విస్తీర్ణం ఉండాలని తెలిపారు. వృషభాలను ఫోటోతో సహా పశువైద్య కేంద్రం డాక్టర్ల వద్ద సర్టిఫికెట్ తీసుకొని వెళ్లాలని, ఓ ఎద్దుకు యజమానితో పాటు ఇద్దరు మాత్రమే వెళ్లాలని, వారు కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు పొందాలని, రెండు డోస్‌ల కరోనా డోస్‌లు వేయించుకొన్నవారై ఉండాలని, ఇలా పలు నిబంధనలను వివరించారు.

సీఎం క్రీడా పోటీలు..
ముఖ్యమంత్రి ట్రోఫీ జిల్లా స్థాయి క్రీడా పోటీలను క్రిష్ణగిరి ఆటలమైదానంలో కలెక్టర్ దీపక్‌జేకప్ ప్రారంభించారు. మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు ఆటల పోటీలు జరుగుతాయని, 1400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

గవర్నర్‌కు లేఖ రాసిన డ్రైవర్ సస్పెండ్

శివాజీనగర: బీఎంటీసీ అక్రమాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు లేఖ రాసిన డ్రైవర్ త్యాగరాజ్‌ను సస్పెండ్ చేశారు. బీఎంటీసీలో అక్రమాలపై ఎండీ సత్యవతికి డ్రైవర్ త్యాగరాజ్, ఆధారాల సమేతంగా ఫిర్యాదు చేశారు. అయితే ఎలాంటి చర్యలు తీసుకోకుండా బీఎంటీసీ డ్రైవర్ త్యాగరాజ్‌కు నోటీస్ ఇచ్చారు. దీంతో తీవ్ర ఆవేదనతో త్యాగరాజ్ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, రవాణా శాఖ సెక్రటరీ ప్రసాద్, కార్మిక శాఖ కమిషనర్ అక్రం పాషాకు లేఖ రాసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో త్యాగరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఎండీ సత్యవతి ఆదేశాలు జారీ చేశారు.

ఇటీవలే పెళ్లి, అంతలోనే ఆత్మహత్య

హోసూరు: ఇటీవలే పెళ్లయింది, కానీ అనారోగ్యంతో బాధపడుతూ కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని కూస్తనపల్లి గ్రామానికి చెందిన అశోక్ (38). ఇతనికి గత ఏడు నెలల క్రితం పెళ్లి జరిగింది. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చిన అశోక్ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన బంధువులు అతన్ని చికిత్స కోసం హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మరణించాడు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.


తిరుపతి జిల్లా పెరియవట్టులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


విశాఖ జిల్లా హస్తినాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


గడప గడపకు మన ప్రభుత్వం


పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శీల గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 71,496 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,908 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.5.33 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని భక్తులకు ఎనిమిది గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీలో అవుట్ సోర్సింగ్ విధానంలో ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులకు పోలీస్ శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ల్యాబ్ అసిస్టెంట్ (ఫిజికల్) పోస్టులు మూడు, ల్యాబ్ అసిస్టెంట్ (కెమికల్) పోస్టులు రెండు, ల్యాబ్ అసిస్టెంట్ (బయలాజికల్) పోస్టులు ఐదు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తులను స్క్రూటినీ చేసిన అనంతరం అర్హులైన అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ఫామ్ కోసం వెబ్‌సైట్: http://citizen.appolice.gov.in సంప్రదించవచ్చు.

శ్రీశైలం భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

- రోజూ 1,075 దర్శనం టికెట్లు
- రేపటి నుంచి అమలులోకి..

సాక్షి, అమరావతి: శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ ప్రవేశపెట్టింది. రోజూ 1,075 దర్శనం టికెట్లు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ అందిస్తోంది. తాజాగా ఈ నెల 9 నుంచి శ్రీశైలం భక్తులకు కూడా ప్యాకేజీని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు దేవదాయ శాఖతో ఒప్పందం చేసుకుంది. వాటిలో స్పర్శ, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం టికెట్లు ఉన్నాయి. రూ.500 స్పర్శ దర్శనం టికెట్లు 275, రూ.300 అతి శీఘ్ర దర్శనం టికెట్లు 300, రూ.150 శీఘ్ర దర్శనం టికెట్లు 500 అందుబాటులోకి తీసుకువచ్చింది. భక్తులు ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా శ్రీశైలం వెళ్లేందుకు ప్రయాణ టికెట్లతో పాటు ఈ దర్శనం టికెట్లు కూడా బుక్ చేసుకోవచ్చును. వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి నిర్వహించే 95 ఆర్టీసీ బస్సుల్లోనూ ఈ టికెట్లను బుక్ చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకే దేవదాయ శాఖతో కలసి ఈ ప్యాకేజీని ప్రవేశపెట్టామని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

11, 12 తేదీల్లో అరసం 19వ రాష్ట్ర మహాసభలు

తెనాలి: అరసం అంటూ సంక్షిప్తంగా పిలుచుకునే అభ్యుదయ రచయితల సంఘం తెలుగునాట సాహిత్య వికాసానికి కృషి చేస్తోంది. 1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో తాపీ ధర్మారావు అధ్యక్షతన తెనాలిలో ఆవిర్భవించిన అరసానికి ఇప్పుడు ఎనిమిది పదులు. 80వ వార్షికోత్సవాలతోపాటు, 19వ రాష్ట్ర మహాసభల నిర్వహణకు నడుంకట్టింది. ప్రముఖ సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా అధ్యక్షుడిగా ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. ఈ నెల 11, 12 తేదీల్లో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మహాసభల నిర్వహణకు రంగం సిద్ధమైంది. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మహాసభల ఆహ్వాన పత్రికను మంగళవారం తెనాలిలో ఆవిష్కరించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 11వ తేదీన అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ పతాకావిష్కరణతో మహాసభలు ప్రారంభిస్తామని చెప్పారు. సుప్రసిద్ధ అభ్యుదయ కవి, సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు కీలకోపన్యాసం చేస్తారని, 80 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానంపై ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడతారని తెలిపారు. రెండు రోజుల మహాసభలో పలు అంశాలపై సదస్సులు, పుస్తకావిష్కరణలు, రచయితల పాదయాత్ర, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలుంటాయని చెప్పారు. నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యం – దశ దిశ, తెలుగునాట తెలుగు భాష గమనం–గమ్యం, ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక శక్తులపై దాడులు–కర్తవ్యాలు అంశాలపై సదస్సులు ఉంటాయని తెలిపారు. అరసం జిల్లా అధ్యక్షుడు సింగారావు, డాక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఫోన్.. ఆటబొమ్మ కాదండోయ్

విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న స్మార్ట్ ఫోన్లు

సాక్షి, అమరావతి: స్మార్ట్ ఫోన్ల వినియోగం పాఠశాలలు, కాలేజీ స్థాయి పిల్లల్లో విపరీతమైన మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతోందని ఇటీవల నిర్వహించిన సర్వేల్లో తేలింది. స్మార్ట్ ఫోన్ల వినియోగం విచ్చలవిడిగా మారడం, సరైన పర్యవేక్షణ లేమితో విద్యార్థులలో అత్యధిక శాతం మంది పక్కదారి పట్టే ప్రమాదం ఏర్పడుతోందని సర్వేలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలపై అతి ప్రేమ లేదా ఇవ్వకుంటే ఏమి చేసుకుంటారోనన్న భయంతో స్కూల్ స్థాయి నుంచే పిల్లలకు స్మార్ట్ ఫోన్లు కొనిస్తున్నారు. ఆటపాటలతో ఇంట్లో సందడి చేయాల్సిన పసి పిల్లలకు సైతం స్మార్ట్ ఫోన్లను అలవాటు చేయడం ఇలాంటి దుష్పరిణామాలు మరింతగా పెరగడానికి కారణమవుతోంది. పిల్లలు మారాం చేస్తున్నారనో.. అల్లరి చేయకుండా ఉంటారనో వారికి ఆట బొమ్మలకు బదులుగా స్మార్ట్ ఫోన్లు ఇవ్వటం ఇటీవల పెరిగిపోయింది. చిన్నతనం నుంచే ఇలా చేయడం వల్ల పిల్లల్లో మేధోపరమైన ఎదుగుదల దెబ్బతింటోందని శాస్త్రీయ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మరోపక్క పాఠశాల పిల్లల్లో ఎక్కువ మంది స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్లు, డేటా ప్యాక్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత వీటి వినియోగం కాస్తా వ్యసనంగా మారిందని 'లోకల్ సర్కిల్స్' అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరుగుతుండటంతో విద్యార్థులు, యువత మానసిక, ఆరోగ్యపరమైన సమస్యలకు లోనవుతున్నారని తేల్చిచెప్పింది. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసుల పేరుతో స్మార్ట్ ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగం పెరిగిన సంగతి తెలిసిందే. ఆ తరువాత నుంచి ఇది తీవ్రరూపం దాల్చింది. అవసరం లేకున్నా పిల్లల చేతుల్లోకి స్మార్ట్ ఫోన్లు ఇతర డిజిటల్ పరికరాలు చేరుతుండటం, పెద్దల పర్యవేక్షణ కరవవటంతో విపరిణామాలకు దారితీస్తోందని సర్వే సందర్భంగా నిపుణులు స్పష్టం చేశారు.

టీనేజ్ పిల్లల్లో 71 శాతం ఫోన్లలోనే..

- 9 నుంచి 13 ఏళ్లలోపు పిల్లలు పాఠశాల సమయం తరువాత ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లలో గడుపుతున్నారని సర్వేలో తేలింది.
- 13 నుంచి 17 మధ్య వయసు పిల్లల్లో 71 శాతం మంది పాఠశాలలతోపాటు బయట కూడా ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లలో చాటింగ్ చేస్తున్నారని వెల్లడైంది.
- 9 నుంచి 13 ఏళ్ల పిల్లలు సోషల్ మీడియాలో వీడియోలను, ఆన్‌లైన్ గేమ్‌లతో గంటలకొద్దీ గడిపేస్తున్నారు. తల్లిదండ్రుల మాట అసలు వినడం లేదు.
- గట్టిగా చెబితే తమపై తిరగబడే పరిస్థితులు ఎదురవుతున్నాయని 47 శాతం మంది తల్లిదండ్రులు వెల్లడించారు.
- 13 ఏళ్లలోపు వారు కూడా సోషల్ మీడియా ఖాతాలు తెరిచి చాటింగ్, ఇతర వ్యవహారాల్లో మునిగిపోతున్నారు.
- కేంద్ర ప్రభుత్వం 2017లో మెంటల్ హెల్త్ కేర్ చట్టాన్ని తెచ్చినా.. ఇంటర్నెట్ వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు నిర్దిష్ట రక్షణ చర్యలు పొందుపర్చకపోవడంతో పరిస్థితి చేయి దాటుతోందని సర్వేలో వివరించారు.



స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడిన పిల్లల్లో మేధోపరమైన ఎదుగుదల దెబ్బతింటోంది. ఫలితంగా విద్యార్థులు చదువుల్లోనూ వెనుకబడిపోతున్నారు. ఈ అలవాటు పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సైతం దెబ్బతీస్తోందని శాస్త్రీయ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. తాజాగా వెలుగు చూస్తున్న సర్వేలలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి.

- ఐటీ చట్టంలోనూ అనేక సవరణలు చేయాల్సిన అవసరముందని వారు పేర్కొంటున్నారు.
- పబ్జి వంటి గేమ్స్ వల్ల పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తి కొన్నిసార్లు హింసా ప్రవృత్తికి కారణమవుతోందని పేర్కొంటున్నారు. అవాంఛనీయ సైట్లు కూడా అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని తెలిసో తెలియకో చూసి అనుసరించే పిల్లలు వాటిలో నిమగ్నమవుతూ మానసిక, శారీరక సమస్యలకు లోనవుతున్నారని వివరించారు.
- స్మార్ట్ ఫోన్లు, డిజిటల్ పరికరాలు వినియోగిస్తూ గేమ్స్ వంటి వాటిలో విద్యార్థులు నిమగ్నం అవుతున్నందున పాఠ్యాంశాలపై దృష్టి పెట్టలేకపోతున్నారని సర్వే పేర్కొంది. దీనివల్ల చదువుల్లో వెనుకబడిపోతున్నారని వివరించింది.
- స్మార్ట్ ఫోన్ల వల్ల సామాజిక సంబంధాలకు దూరంగా ఉండిపోతున్నారని, ఇది మెదడులో జన్యుపరమైన సమస్యలకు దారితీస్తోందని వైద్య నిపుణులు పేర్కొన్నారని సర్వే తెలిపింది. ఇది పిల్లల్లో 'నో మొబైల్ ఫోబియా అనే కొత్త రుగ్మతను తెచ్చిపెట్టిందన్నారు.
- ఫలితంగా పిల్లలు ఆందోళన, నిరాశ, చిరాకు, ఒంటరితనం ఎక్కువై మానసిక వైకల్యంలో పడుతున్నట్టు స్పష్టం చేశారు.
- స్మార్ట్ ఫోన్ల వినియోగం వల్ల 8–18 ఏళ్లలోపు పిల్లలు నిద్ర లేమికి గురవుతున్నారని.. ఫలితంగా వారిలో ఆందోళన, ఒత్తిడి పెరిగిపోతోందని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సంస్థ తన నివేదికలో పేర్కొంది.

అఖిల భారత ఫిజీషియన్స్ సదస్సులో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

జాతీయస్థాయిలో రెండు విభాగాల్లో మొదటి బహుమతి

సాక్షి ప్రతినిధి, కడప: జాతీయస్థాయిలో కడప రిమ్స్ (రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పీజీ విద్యార్థులు విజయభేరి మోగించారు. అఖిల భారత ఫిజీషియన్స్ సదస్సులో రెండు విభాగాల్లో మొదటి బహుమతులు సాధించారు. గత నెల 26, 29 తేదీల మధ్య గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో మెడికల్ నేషనల్ కాన్ఫరెన్స్–2023 నిర్వహించారు. భారతదేశంలోని అన్ని మెడికల్ కాలేజీల నుంచి దాదాపు 1000 మంది పాల్గొన్న ఈ సదస్సులో పీజీ విద్యార్థులు పరిశోధన పత్రాలు, పోస్టర్లను సమర్పించారు. అందులో రిమ్స్ పీజీ విద్యార్థులు డాక్టర్ అనిల ప్రియదర్శిని సమర్పించిన 'కాలేయ వ్యాధులలో మెదడు సంబంధిత ఇబ్బందులకు జింక్ లోపం' ఎలా తీవ్రం చేస్తుందో తెలియజెప్పిన పత్రానికి ప్రథమ బహుమతి లభించింది. అలాగే అత్యంత అరుదైన పాలి ఎండోక్రైన్ సిండ్రోమ్‌లు ఇప్పటికి మూడు రకాలు మాత్రమే మనకు తెలుసు. డాక్టర్ మనుషా పరిశోధించిన 'ఆటో ఇమ్యూన్ పాలీ ఎండోక్రైన్ సిండ్రోమ్' నాలుగో రకం అయి ఉండవచ్చా? అన్న పరిశోధనా పోస్టర్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ విజయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా పలువురు వైద్యులు చెబుతున్నారు. మెడిసిన్ విభాగాధిపతి, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ 'డాక్టర్ సందెపోగు లక్ష్మీబాయి' మార్గదర్శకత్వంలో ఈ గెలుపు కడప మెడికల్ కాలేజీకి లభించడం తమ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సురేఖ హర్షం ప్రకటించారు. మెడిసిన్ పీజీ విద్యార్థులు డాక్టర్ ఎం.అనిల ప్రియదర్శిని, డాక్టర్ వై.మనుషాలను మెడికల్ కాలేజీ ఆచార్యులు, అధ్యాపకులు అభినందించారు. పీజీ వైద్య విద్యార్థులకు అసోసియేట్ ప్రొఫెసర్ (జనరల్ మెడిసిన్) డాక్టర్ బత్తల బాలసుబ్రహ్మణ్యం అకడమిక్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

టెలిమెడిసిన్ సేవల్లో ఏపీ ఫస్ట్

- ఇతర రాష్ట్రాలు ఆంధ్రాను ఆదర్శంగా తీసుకోవాలి
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్

సాక్షి, అమరావతి: టెలిమెడిసిన్ సేవల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలు ఏపీని ఆదర్శంగా తీసుకుని టెలిమెడిసిన్ సేవలను మరింత మెరుగైన రీతిలో అందించాలని సూచించారు. దేశంలో టెలిమెడిసిన్ విధానాన్ని బలోపేతం చేసే అంశంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయ ఆసియా రీజియన్ ఆధ్వర్యాన ఢిల్లీలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ చౌహాన్ మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల ద్వారా టెలిమెడిసిన్ సేవలను అమలు చేస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ సేవలకు కరోనా కష్టకాలంలో అత్యంత ఆదరణ లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ఏపీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు టెలిమెడిసిన్ సేవలను విస్తరించిందని తెలిపారు. రాష్ట్రంలో 27 టెలిమెడిసిన్ హబ్‌లను ఏర్పాటు చేశామని, రోజుకు 60వేల టెలి కన్సల్టేషన్లు నమోదవుతున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 9.7 కోట్ల టెలి కన్సల్టేషన్లు నమోదు కాగా, ఇందులో 3.1కోట్లు (32 శాతం) ఏపీలోనే నమోదయ్యాయని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసి రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థను మరింత సమర్థంగా నడపాలని సీఎం వైఎస్ జగన్ సూచించారన్నారు. కరోనా వ్యాప్తి సమయంలో టెలిమెడిసిన్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టి అందులో 6,145 మంది డాక్టర్లను రిజిస్టర్ చేయడం ద్వారా అప్పట్లో ప్రజలకు విశేష సేవలు అందించామన్నారు. ఈ డాక్టర్లు 13,74,698 కాల్స్ స్వీకరించి సేవలు అందజేశారన్నారు.

3 ప్రముఖ ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం

- అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గమ్మ ఆలయాలకు వేర్వేరుగా ఉత్తర్వుల జారీ
- బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రెండేళ్ల కాలపరిమితి


ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలకవర్గం

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని మూడు ప్రముఖ ఆలయాలకు ప్రభుత్వం మంగళవారం ట్రస్టు బోర్డులను నియమించింది. కాకినాడ జిల్లా అన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి ఆ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఐ.వి.రోహిత్‌ను ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, మరో 13 మంది ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమిస్తూ దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఆ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్వీ సుధాకరరావును ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, మరో 14 మంది ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమించారు. అదే విధంగా విజయవాడ శ్రీదుర్గమల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి 15 మంది ట్రస్టు బోర్డు సభ్యులను నియమించారు. ఈ మూడింటికి వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ దుర్గగుడి ట్రస్టు బోర్డు చైర్మన్‌ను సభ్యులు ప్రమాణ స్వీకారం అనంతరం సమావేశమై ఎన్నుకుంటారు. అదనంగా ఆయా ఆలయాలలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న వారు ఆయా ట్రస్టు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యులుగా కొనసాగుతారని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా ఆలయాల ట్రస్టు బోర్డులలోని సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రెండేళ్ల పాటు ఆ పదవుల్లో కొనసాగుతారని తెలిపింది.

దుర్గమ్మ ఆలయ చైర్మన్‌గా కర్నాటి రాంబాబు

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం జరిగింది. చైర్మన్‌గా కర్నాటి రాంబాబు, సభ్యులుగా కేసరి నాగమణి, కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, నిడమనూరి కళ్యాణి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వరరావు, అల్లూరి కృష్ణవేణి, తొత్తడి వేదకుమారి చేత ఈవో భ్రమరాంబ ప్రమాణ స్వీకారం చేయించారు. కొలుకులూరి రామసీత ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది.

అప్పర్‌భద్రతో రాయలసీమకు నీటి గండం

- ఏపీ పట్ల కేంద్ర వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి
- తుంగ భద్రనదిపై అప్పర్ భద్ర ప్రాజెక్టును తక్షణం ఆపాలి
- రాయలసీమ మేధావుల ఫోరం డిమాండ్


మాట్లాడుతున్న రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి

సాక్షి,అమరావతి/తిరుచానూరు(తిరుపతి జిల్లా): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీ పట్ల చూపుతున్న వివక్షతతో రాయలసీమకు తీవ్ర నీటిగండం ఎదురయ్యే ప్రమాదం ఉందని రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్వీ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో మంగళవారం ఫోరం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ప్రయాగతో కలిసి పురుషోత్తంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటన చేస్తూ నిధులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చట్టబద్ధత లేని ఎగువ భద్రను నిలువరించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా జాతీయ హోదాను ప్రకటించడం ద్వారా ఫెడరల్ స్ఫూర్తిని తుంగలో తొక్కిందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై సమష్టి పోరాటం సాగించాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ఏపీకి చెందిన సభ్యులు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కాగా, ఎగువన ఉన్న కర్ణాటక తుంగభద్రపై అదనంగా మరో ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే దిగువనున్న రాయలసీమలోని తుంగభద్రపై నికర జలాలు కలిగి ఉన్న ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీ, కేసీ కెనాల్, గుండ్రేవుల ప్రమాదంలో పడతాయి. కృష్ణా నదిలో ప్రవాహం తగ్గి తుంగభద్ర నీరే ప్రధానం అవుతున్న నేపథ్యంలో కర్ణాటక నిర్మించే ఎగువ భద్రతో గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, ఎస్‌ఆర్‌బీసీలకు సైతం ప్రమాదం ఏర్పడుతుంది.

ధిక్కార కేసులో సంస్కృత వర్సిటీ వీసీ, మాజీ రిజిస్ట్రార్‌కు శిక్ష

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ ప్రస్తుత వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, మాజీ రిజిస్ట్రార్ సీహెచ్‌సీ సత్యనారాయణకు హైకోర్టు 2 రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ తీర్పుపై అప్పీల్ దాఖలుకు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును నెల రోజుల పాటు నిలుపుదల చేశారు. 2017–18 విద్యా సంవత్సరానికి తనను గెస్ట్/పార్ట్ టైం టీచర్‌గా కొనసాగించేలా తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యా పీఠం రిజిస్ట్రార్‌ను ఆదేశించాలంటూ వెంకట శ్రీనివాసరావు అనే వ్యక్తి 2017లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు పిటిషనర్‌ను గెస్ట్ లేదా పార్ట్ టైం టీచర్‌గా కొనసాగనివ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ శ్రీనివాసరావు జాతీయ సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ సత్యనారాయణ, ప్రస్తుత వీసీ కృష్ణమూర్తిలపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ తిల్హరీ విచారించారు. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను అమలు చేయలేదని న్యాయమూర్తి తేల్చారు. వారికి కోర్టు ధిక్కారమేనని స్పష్టం చేస్తూ పై విధంగా తీర్పు చెప్పారు.

10వ తేదీలోగా పీఎంజీ పోర్టల్లో వివరాలు అప్‌లోడ్ చేయండి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు వివరాలపై అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రగతి వివరాలను ఈ నెల 10వ తేదీలోగా పీఎంజీ (ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూపు) పోర్టల్‌లో అప్ డేటెడ్ వివరాలన్నీ అప్లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి వివిధ పెండింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ముఖ్యంగా రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్, న్యూ రెన్యువల్ ఎనర్జీ, వైద్య ఆరోగ్యం, ఉన్నత విద్య సంబంధిత వివిధ జాతీయ ప్రాజెక్టుల ప్రగతి వివరాలను పీఎంజీ పోర్టల్‌లో అప్ డేట్ చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వివిధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల ప్రగతి వివరాలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎంజీ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. ప్రతినెల ఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రగతిని సంబంధిత కార్యదర్శులతో సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జీపీఎం అండ్ ఏఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, అదనపు సీసీఎల్‌ఏ ఇంతియాజ్ పాల్గొన్నారు. అలాగే వీడియో లింక్ ద్వారా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వి.శ్యామలరావు, ఏపీ జెన్‌కో ఎండీ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల కొనుగోళ్లకు ఈ-టెండర్

సాక్షి, అమరావతి: క్రీడా పరికరాల కొనుగోలులో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు శాప్ ఎండీ ఎన్.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం శాప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-టెండర్ ప్రక్రియ ద్వారా కోచ్‌లతో కూడిన ప్రత్యేక టెక్నికల్ కమిటీ క్రీడా వస్తువుల నాణ్యతను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హాకీ స్టిక్స్ కొనుగోలు చేయాలనుకోగా..వాటి నాణ్యత సరిగ్గా లేకపోవడంతో టెక్నికల్ కమిటీ తిరస్కరించిందని చెప్పారు. ఈ విషయం తెలుసుకోకుండా కొంత మంది శాప్ సభ్యులు అర్థరహిత ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. 'శాప్‌లో ప్రతి నిర్ణయం బోర్డు ఆమోదంతోనే అమలవుతోంది. ప్రభుత్వ నియమాలు, నిబంధనల ప్రకారమే శాప్ పని చేస్తోంది. కోవిడ్ కారణంగా సీఎం కప్ వాయిదా పడింది. జనవరిలో నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించినా, కొన్ని ప్రత్యేక టోర్నీల వల్ల నిర్వహించలేకపోయాం. సీఎం కప్ నిర్వహణకు ప్రభుత్వం మళ్లీ తేదీలను నిర్ణయిస్తుంది. బోర్డు సభ్యులకు నచ్చిన సమయంలో నిర్వహించాలంటే కుదరదు. వ్యక్తిగత అజెండా కోసం నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటు' అని మండిపడ్డారు.

జాతీయ క్రీడా పోటీలే లక్ష్యంగా శిక్షణ: బైరెడ్డి

గోవా వేదికగా జరిగే జాతీయ క్రీడా పోటీల్లో పతకాలే లక్ష్యంగా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్టు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చెప్పారు. మంగళవారం శాప్ కార్యాలయంలో నిర్వహించిన 82వ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. టార్గెట్ గోవాలో భాగంగా రూ.2కోట్ల నుంచి రూ.2.50 కోట్లకు పైగా ఖర్చు చేసి క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందిస్తామన్నారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు మెగా గ్రీవెన్స్ నిర్వహించి డీఎస్‌ఏలు, క్రీడాకారుల నుంచి విన్నపాలు స్వీకరిస్తామని చెప్పారు. కాగా, బోర్డు సమావేశానికి ముందు నలుగురు సభ్యులు మీడియా వేదికగా ఎండీ ప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు చేశారు. హాకీస్టిక్స్ కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తమను పట్టించుకోవట్లేదని, పనులు కావట్లేదని.. చైర్మన్‌కు చెప్పినా ఫలితం లేదంటూ నిట్టూర్చారు. దీనిపై శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. బోర్డు సభ్యులు హుందాగా వ్యవహరించాలని.. ఎవరో చెప్పినదాన్ని పట్టుకుని రోడ్డెక్కడం సరికాదని మండిపడ్డారు.

శాప్‌లో సీనియర్ హాకీ కోచ్ తొలగింపు

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సీనియర్ హాకీ కోచ్ జూన్ గాలియోట్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

బాబు అడ్డగోలు రాజకీయాలకు చరమగీతం

రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: కులవాద రాజధాని కోసం చంద్రబాబు అండ్‌కో, ఓ సామాజిక వర్గం చేస్తున్న అడ్డగోలు రాజకీయాలకు చరమగీతం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 863వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. జగనన్న సుపరిపాలన చూసి ఓర్వలేని బాబు ఓ పక్క తన కుమారుడు లోకేశ్, మరో పక్క దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌ను యాత్రల పేరుతో ప్రజల్లోకి పంపుతున్నాడని మండిపడ్డారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శామ్యూల్, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.


కొలగట్ల అలన మీనాక్షి

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం.
ప్రధానితో ముచ్చటగా మాటామంతీ.
ఇలాంటి ఓ రోజును కలలోనైనా కలగనలేదు.
బాలపురస్కార్ గ్రహీత అంతరంగం ఇది.

● బాల పురస్కారం

తెలుగు చతురంగ బలం


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి అవార్డు అందుకుంటున్న మీనాక్షి


ప్రధాని మోదీతో మీనాక్షి

నాలుగేళ్ళ చిరుప్రాయంలో చదరంగ పావులు కదపడం నేర్చిన ఆ చిన్నారి... పదకొండవ ఏటనే ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. రాష్ట్రపతి చేతుల మీదుగా గణతంత్రదినోత్సవ వేడుకల్లో భాగంగా బాలపురస్కార్ అవార్డును అందుకుంది. ఆ చిన్నారే ఆంధ్రప్రదేశ్ విశాఖకు చెందిన కొలగట్ల అలన మీనాక్షి. అమ్మ ఆడుకునేందుకు సరదాగా ఇచ్చిన చతురంగ బోర్డే అనతికాలంలో ఎత్తులకు పైఎత్తులు వేసి ఫిడే మాస్టర్ టైటిల్ సాధించే స్థాయికి ఎదిగిన క్రమాన్ని ఆమె 'సాక్షి'తో పంచుకుంది.

ప్రశ్న: చదరంగం ఆడటం ఎలా ప్రారంభమైంది?

జవాబు: నాలుగేళ్లప్పుడు అమ్మ (అపర్ణ) సరదాగా ఆడుకోవడానికి బోర్డ్‌గేమ్స్‌తో పాటు చదరంగం బోర్డ్ ఇచ్చింది. అది మాగ్నటిక్ బోర్డ్. చాలా సరదాగా వుండేది. ఆ తర్వాత గడుల్లో పావులు పెట్టి ఆనందపడేదాన్ని. అది గమనించిన అమ్మ శిక్షణకు తీసుకువెళ్ళింది. అలా వేసవి శిబిరంలో శిక్షణపొంది తొలిసారి స్థానిక టోర్నీలో పాల్గొంటే యంగెస్ట్ ప్లేయర్‌గా నిలిచాను. అప్పటినుంచి మరో ఏడాది ఆటపై దృష్టిపెట్టి ఐదున్నరేళ్లకే జిల్లా చాంపియన్‌గా నిలిచాను.


ఆటలో...

● ఫిడే మాస్టర్‌గా ఎలా ఎదిగారు?

బాలికల అండర్ 7 లో ఐదున్నరేళ్ళకే టోర్నీల్లో పాల్గొనడంతో ఫిడే రేటింగ్ మొదలైంది. క్రమంగా 2021లో ఎలో రేటింగ్ 1829కి చేరడంతో ఉమెన్ కాండిడేట్ మాస్టర్ టైటిల్ సాధించాను. ఇక అక్కడి నుంచి సీరియస్‌గానే టోర్నీల్లో పాల్గొనడం, రేటింగ్ పెంచుకోవడంతో గత డిసెంబర్‌లో ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాను. స్పెయిన్‌లో ప్రపంచ చదరంగం క్యాంప్‌లో ఉండగా ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్‌కు అర్హమైన ఎలోరేటింగ్ 2100 పాయింట్లు సాధించాను.

● బాల పురస్కార్ అవార్డు వస్తుందని ఊహించారా?

జనవరి 20వ తేదీ సాయంకాలం నాన్న(మధు)కి ఓ కాల్ వచ్చింది. ఆ కాల్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మినిస్ట్రీ నుంచి. అర్జంట్‌గా వివరాలను పంపాలని అన్నారు. బాల పురస్కార్ అవార్డుకి ఎంపికయ్యానన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఐదారు నిమిషాలు పట్టింది. అంతే! గంటలో టికెట్స్ రావడం... మరుసటి రోజే ఢిల్లీకి పయనమవడం అంతా జరిగిపోయింది. అయితే రాష్ట్ర సంప్రదాయ దుస్తుల్లో రావాలన్నారు.

● రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎలా ఉంది?

అంత పెద్ద అవార్డు అందుకోవడం.. అదీ దేశ ప్రథమపౌరురాలి చేతుల మీదుగా చిరుప్రాయంలోనే తీసుకోవడం చాలా గర్వకారణం. రాష్ట్రానికి ప్రతినిధి కావడం ఒక మధురానుభూతి.

● ప్రధానమంత్రితో మాట్లాడారా?

మోదీ గారు బాల పురస్కార గ్రహీతలందర్నీ కూర్చోబెట్టుకుని ముచ్చటించారు. నాతో ఆయన తెలుగులో మాట్లాడారు. 'నేను చెప్పడం కాదు మీరు చెప్పండి' అన్నారు. మాస్టర్ టైటిల్స్ సాధించడం వరకు నా అనుభవాన్ని చెప్పాను. నాకు కొందరికి శిక్షణ ఇవ్వాలని ఉంది అంటే... 'నీకు ఇంకా చాలా కెరీర్ ఉంది. మరిన్ని విజయాలను సొంతం చేసుకుని దేశానికి ఖ్యాతి తేవాలి' అన్నారు.

● రాష్ట్ర ముఖ్యమంత్రి ఏమన్నారు?

'ఇంత చిన్నవయస్సులోనే ఇన్ని టైటిల్స్ సొంతం చేసుకున్నావా' అని ఆశ్చర్యపోయారు. 'రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచా'వని జగన్ సర్ అభినందించారు.

● మీ తదుపరి లక్ష్యం ఏమిటి?

ప్రస్తుతం నేను ఆరోతరగతి చదువుతున్నాను. మార్చిలో పరీక్షలున్నాయి. పాఠశాలలోనూ చక్కటి ప్రోత్సాహం లభిస్తోంది. పరీక్షలనంతరం జూన్‌లో యూరప్ వెళదామని అనుకుంటున్నాను. రేటింగ్‌ను మెరుగుపరుచుకుని ఐఎం నార్మ్ సాధించడానికి ఎక్కువ టోర్నీలు ఆడవలసి ఉంటుంది. కొంతకాలం అక్కడుంటేనే అది సాధ్యం. నా తదుపరి లక్ష్యం ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యు ఐఎం)... అంటూ నవ్వుతూ ఇంటర్వ్యూ ముగించింది అలన మీనాక్షి. ఈ చిన్నారికి ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా.

– డాక్టర్ సూర్యప్రకాష్ మాడిమి, సాక్షి, విశాఖపట్నం

ఎత్తులకు పై ఎత్తులు

- 2021 డిసెంబర్ 1న ఫిడే అండర్ 10 బాలికల చదరంగంలో ఉమెన్ కాండిడేట్ మాస్టర్ (డబ్ల్యుసిఎం)గా ప్రకటించారు.
- అండర్10 బాలికల కేటగిరీలో 1829 ఎలో రేటింగ్‌తో ప్రపంచం రెండో రాంక్‌కు చేరింది. అదే ఏడాది సెర్బియాలో జరిగిన ఉమెన్ లీగ్ చెస్ చాంపియన్‌షిప్‌లోనూ జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో చక్కటి ప్రతిభ.
- 2021లో నేషనల్ అండర్ 10 బాలికల చదరంగం చాంపియన్‌షిప్.
- ఏషియన్ స్కూల్స్ అండర్ 7 క్లాసిక్‌లో స్వర్ణాన్ని సాధించగా... ర్యాపిడ్‌లో స్వర్ణాన్ని టైగా నిలిచింది.
- కామన్‌వెల్త్ అండర్ 8 బాలికల్లో ఆరోస్థానం.
- ప్రపంచ పాఠశాలల అండర్7 బాలికల క్లాసిక్ పోటీల్లో 13వ స్థానం.
- ఏషియన్ యూత్ – 8 బాలికల రాపిడ్ చెస్‌లో స్వర్ణాన్ని సాధించింది. వెస్టన్ ఆసియన్ -8 బాలకల రాపిడ్, బ్లిజ్‌లలో స్వర్ణాలు.

చెప్పుల్లేకుండా రోజూ 7 కిలోమీటర్లు ఆకలి కడుపుతో స్కూల్‌కు పరిగెత్తిన అమ్మాయి గత వారం రోజుల్లో రెండు బంగారు పతకాలు సాధించింది.
నిన్న మొన్నటి దాకా ఆమె ఇంటికి కరెంట్ లేదు.
తల్లికి వచ్చే వెయ్యి రూపాయల వితంతు పెన్షన్ బతకడానికి ఆధారం.
అయినా సరే ఆటల్లో నిలిచి గెలిచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ కోసం ఆశలు పెట్టుకోదగ్గ అమ్మాయిగా నిలిచింది.
16 ఏళ్ల నిరుపేద బాలిక ఆశా కిరణ్ బార్లా స్ఫూర్తి గాథ ఇది.
గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భోపాల్‌లో జరుగుతున్న జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో న్యూస్ మేకర్ ఆశా కిరణ్ బార్లా.

మట్టిలో బంగారం

న్యూస్‌మేకర్



ఆశా కిరణ్ బార్లా

వారికి పేదరికం శాపం. కాని వారి పోరాటానికి అడ్డు లేదు.

వారికి పోషకాహారలోపం. కాని వారి బలానికి తిరుగులేదు.

దేశంలో ఎందరో పేద క్రీడాకారులు. కాని వారి సంకల్పానికి ఓటమి లేదు.

17 ఏళ్ల లోపు ఉండే దేశగ్రామీణ క్రీడాకారులను ఉత్సాహపరచడానికి 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తూ వస్తున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'లో భాగంగా జనవరి 30 మొదలయ్యాయి. ఫిబ్రవరి 11 వరకూ జరుగుతున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2022' పోటీల్లో ఎందరో ఇలాంటి మట్టిలో మాణిక్యాలు. ఎందరినో ఆశ్చర్యపరుస్తున్న కొత్త ముఖాలు. ఆశా కిరణ్ బార్లా కూడా అలాంటి మాణిక్యమే. ఎవరీ బార్లా అని అందరూ ఆమె పట్ల ఆరా తీస్తున్నారు. నిజానికి ఇప్పటికే ఆశా సాధించిన విజయాలతో ఎంతో ప్రచారం పొందాల్సింది. కాని జార్ఖండ్‌కు చెందిన ఈ నిరుపేద ఆదివాసీ క్రీడాకారిణిని ఎవరు పట్టించుకుంటారు?


● తల్లితో కిరణ్

■ పరుగుల రాణి

'పీటీ ఉష నాకు ఆదర్శం' అని చెప్పే 16 ఏళ్ల బార్ల చిరుతతో సమానంగా పరిగెత్తగలదు. 2022లో కువైట్‌లో జరిగిన ఆసియా యూత్ ఫెస్టివల్‌లో 800 మీటర్ల పరుగుల పోటీలో మన దేశం నుంచి రికార్డు నమోదు చేసింది. ఇంతకు ముందు ఉన్న రికార్డును చెరిపేసింది. ఈ ఘనవిజయానికి ఆమెకు రావలసినంత పేరు భారతీయ మీడియాలో రాలేదు. విషాదం ఏమంటే కువైట్‌లో సాధించిన ఈ ఘనతను వారి ఇంట్లో రెండు రోజుల తర్వాత తెలుసుకున్నారు. ఎందుకంటే వారి ఇంటికి కరెంట్ లేదు. ఇంట్లో టీవీ లేదు. వారికి ఫోన్ కూడా లేదు. ఆశా కిరణ్ బార్లా ఈ ఘనత సాధించాక అధికారులు వచ్చి హడావిడిగా కరెంట్ ఇచ్చారు. జిల్లా స్పోర్ట్స్ యంత్రాంగం ఒక టీవీ కొని ఇచ్చింది. 'కాని మాకు తిండి ఎట్లా?' అంటుంది బార్లా.

■ ఆకలితో పరిగెత్తి

ఆశా కిరణ్ బార్లాది జార్ఖండ్‌లో రాంచీకి 100 కిలోమీటర్ల దూరంలో అడవిలో కొండల మధ్య ఉన్న అతి చిన్న గిరిజన తండా. 22 ఇళ్లు ఉంటాయి. చుట్టుపక్కల నక్సల్స్ బెడద ఉండటంతో కరెంటు, ఫోన్ సిగ్నల్స్ దాదాపుగా ఆ తండాకి లేవు. అలాంటి ఊర్లో పని చేసిన ఏకైక టీచర్ విలియమ్స్ కుమార్తె ఆశా కిరణ్. కాని 9 ఏళ్ల క్రితం ఆ విలియమ్స్ మరణించడంతో ఆ కుటుంబం దిక్కు లేనిదైంది. నలుగురు పిల్లల్ని వితంతు పెన్షన్‌తోటి తల్లి రోసానియా సాకాల్సి వచ్చింది.

ఆశా కిరణ్ అక్క ఫ్లోరెన్స్ బాగా పరిగెత్తుతుంది. అది చూసి ఆశా కూడా పరిగెత్తడం నేర్చింది. చిన్నప్పటి నుంచి కొండలు గుట్టలు ఎక్కిన కాళ్లు కనుక వారి కాళ్లల్లో విపరీతమైన వేగం. కాని తండ్రి మరణం తర్వాత జరుగుబాటు కోసం ఐదో తరగతి పూర్తి చేసిన ఆశాను వాళ్లమ్మ రాంచిలో ఏదో ఇంటిలో పనికి పెట్టింది. ఒక సంవత్సరం ఇంట్లో పని మనిషిగా, వెట్టి కార్మికురాలిగా పని చేసింది ఆశా.

■ టీచర్ తెచ్చిన మార్పు

ఆశా అక్క ఫ్లోరెన్స్ వాళ్ల తండాకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహుగావ్‌కు వెళ్లి చదువుకునేది. ఫ్లోరెన్స్ పరుగు చూసి వాళ్ల స్కూల్ టీచర్ సిస్టర్ దివ్య 'నువ్వు బాగా పరిగెత్తుతున్నావ్' అనంటే 'మా చెల్లెలు ఇంకా బాగా పరిగెత్తుతుంది' అని ఫ్లోరెన్స్ చెప్పింది. దాంతో ఆ టీచర్ రాంచీలో పనిమనిషిగా ఉన్న ఆశా కిరణ్‌ను తెచ్చి తన స్కూల్లో చేర్పించింది. అక్కచెల్లెళ్లు ఇద్దరూ టిఫిన్ చేయకుండా స్కూల్‌కి పరిగెత్తుకుంటూ వచ్చేవారు. స్కూల్ అయ్యాక ఆకలికి తాళలేక మళ్లీ పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్లేవారు. టీచర్ ఇది గమనించి తానే స్వయంగా వారికి రేషన్ ఇచ్చి చదువులో క్రీడల్లో ప్రోత్సహించడమే కాదు ఇలాంటి గిరిజన బాలికలను సొంత ఖర్చులతో ట్రయిన్ చేసే కోచ్ ఆశు భాటియా దృష్టికి తీసుకెళ్లింది. బొకారో థర్మల్ టౌన్‌లో ఉన్న తన అథ్లెట్స్ అకాడెమీలో ఆశా కిరణ్‌ను చేర్చుకున్న ఆశు భాటియా తగిన శిక్షణ ఇవ్వడంతో ఇప్పుడు ఆమె పతకాల పంట పండిస్తోంది.

■ రెండు స్వర్ణాలు

ఇప్పటికి 11 నేషనల్, 2 ఇంటర్నేషనల్ పతకాలు సాధించిన ఆశా తాజాగా భోపాల్‌లో జరుగుతున్న ఖేల్ రత్న యూత్ గేమ్స్‌లో 800 మీటర్ల పరుగులో, 1500 మీటర్ల పరుగులో స్వర్ణ పతకాలు సాధించింది. దాంతో పరిశీలకులు 2024లో పారిస్ ఒలింపిక్స్‌లో ఆశాను ఒక ప్రాపబుల్‌గా ఎంపిక చేశారు. 'కాని ఏం లాభం? ఆమెను ఒలింపిక్స్ స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి నా దగ్గర వనరులు లేవు' అని దిగులు పడుతున్నాడు కోచ్ ఆశు భాటియా. 'మా జీవితాలు మెరుగు పరిస్తే మా అమ్మాయి ఇంకా రాణిస్తుంది' అంటుంది తల్లి.

ఈ ప్రతికూలతలు ఎలా ఉన్నా గెలిచి తీరాలనే సంకల్పం ఆశాలో.

ఇలాంటి క్రీడాకారిణుల గురించి ఎంత ప్రచారం చేస్తే అంత సాయం దక్కుతుంది. ప్రోత్సాహం లభిస్తుంది. ఇప్పుడు అందరూ చేయవలసిన పని అదే.

బ్యూటిప్స్

ముఖ సౌందర్యానికి నేచురల్ ప్యాక్స్

ముఖ సౌందర్యం కోసం రకరకాల క్రీములు రాసుకుంటూ ఉంటారు. వాటిలో కొన్ని బాగానే పనిచేయవచ్చు. పడక పోతే ముఖం మీద లేనిపోని గుల్లలు వచ్చి, మచ్చలు పడి అందవికారంగా తయారవుతుంది. అలా కాకుండా కొన్ని సహజ సిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లు...



ముందుగా పచ్చిపాలలో దూదిని ముంచి ముఖాన్ని శుభ్రంగా క్లీన్ చేసుకోండి. ఆ తర్వాత...

టీ స్పూన్ నారింజ రసం, టీస్పూన్ నిమ్మ రసం, టేబుల్ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ పసుపు ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని



ముఖానికి రాసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే ముఖచర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.



స్పూన్ మినప్పప్పు, నాలుగైదు బాదం పప్పులు కలిపి నీటిలో నానబెట్టి మెత్తగా పేస్టులా చేసుకుని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. బాగా ఆరిన తర్వాత నలుగు పెట్టుకోవాలి లేదా శుభ్రంగా కడిగేసుకోవాలి.



యూత్ పల్స్

**తినాలి కాబట్టి తినడం వేరు. తినడాన్ని ఉత్సవం చేసుకోవడం వేరు.
'చేయక తప్పుతుందా!' అని వంట కోసం గరిట పట్టుకోవడం వేరు.
వంట చేయడాన్ని పండగ చేసుకోవడం వేరు.
అయితే యువతరంలో చాలామంది కొత్త కొత్త వంటకాలు నేర్చుకుంటూ వంట చేయడాన్ని పండగ చేసుకుంటున్నారు. ఇందుకు కారణం ఏమిటంటే...**

నివాస భోజనంబు నిఖార్సయిన వంటకంబు!



రాజస్థాన్‌లోని ఆల్వార్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ స్టూడెంట్ అక్షితకు వంటకాల రుచులతో పరిచయం తప్ప వంటగది ముఖం ఎప్పుడూ చూసింది లేదు. ఎంబీఏ చేస్తున్న చెన్నైకి చెందిన లాస్యకు క్లాసు పుస్తకాలలో తలమునకలవ్వడం తప్ప వంటల గురించి బొత్తిగా అవగాహన లేదు. అయితే ఇదంతా పాండమిక్‌కు ముందు. ఇప్పుడు అక్షిత, లహరిలకు ఎన్నో వంటకాలలో ప్రవేశం ఉంది. వారికి వంటగదితో అనుబంధం పెరిగింది. ఈ ఇద్దరు మాత్రమే కాదు... మిలీనియల్స్, జెన్-జెడ్‌లో ఎంతో మంది గరిట పట్టి కొత్త కొత్త వంటకాలు చేసి ఆస్వాదిస్తున్నారు.

పాండమిక్ నేర్పిన పాఠాల్లో ఆరోగ్యస్పృహ ఒకటి.

ఆరోగ్యస్పృహ ఉన్నచోట ఆహార అలవాట్లకు సంబంధించిన స్పృహ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో స్వయంగా వంట చేసుకొని తాజా ఆహార పదార్థాలను ఆస్వాదించడంలోని మజాను రుచి చూస్తోంది యువతరం. ఒక విధంగా చెప్పాలంటే స్మార్ట్‌ఫోన్ వీరిని వంటగదికి దగ్గర చేసింది. ఏం వండాలి? ఎలా వండాలి? అనేదానికి దారి చూపించింది.

పాండమిక్ తరువాత ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫుడ్ రిలేటెడ్ కంటెంట్‌కు ప్రాధాన్యత పెరిగింది. ఫుడ్-బ్లాగర్స్, చెఫ్స్, హోమ్ కుక్స్ ప్రభావంతో 'ఒక సారి వంట చేసి చూద్దాం' అనే ప్రాజెక్ట్‌లోకి దిగుతుంది యువతరం.

ఫుడ్-బేస్డ్ టీవీ షోలు, వోటీటీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కూడా యువతరం వంటగదికి దగ్గర అవుతుంది. ముఖ్యంగా డాక్యు-సిరీస్'ట్విస్ట్ ఆఫ్ టేస్ట్, 'మాస్టర్ చెఫ్ ఇండియా'కు మిలీనియల్స్‌లో ఎంతో మంది ఫాలోవర్స్ ఉన్నారు.

రకరకాల సంస్కృతులను రకరకాల వంటకాల ద్వారా ఎక్స్‌ప్లోర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.

'ఒకప్పుడు ఆకలేస్తే ఆన్‌లైన్ ఆర్డర్లకు ప్రాధాన్యత ఇచ్చేదాన్ని. ఇప్పుడు మాత్రం సొంతంగా వంట చేసుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాను. ఎంతైనా ఇంటి తిండి రుచే వేరు' అంటుంది మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన జాన్వీ.

నిజానికి ఇరవైనాలుగు సంవత్సరాల జాన్వీకి వంట చేయడంలో ఓనమాలు కూడా తెలియవు. అయితే లాక్‌డౌన్ సమయంలో వంట నేర్చుకోవాల్సిన, స్వయంగా వంట చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఎదురైంది.

'ఇది నా మంచికే జరిగింది' అనుకున్న అనేకానేక మందిలో జాన్వీ ఒకరు మాత్రమే.

'వంట చేయడం అనేది ఫన్-యాక్టివిటీకి మాత్రమే పరిమితమై పోలేదు. ఇప్పుడు అది లైఫ్-స్కిల్స్‌లో ఒకటిగా మారింది.' అంటున్నాడు దిల్లీకి చెందిన ఫుడ్-బ్లాగర్ అర్పిత్ అగర్వాల్.

మిల్లెట్స్ మరియు మిలీనియల్స్

మిల్లెట్స్ అనే మాట ఇప్పుడు బాగా సుపరిచితం. మిల్లెట్స్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్న వారిలో మిలీనియల్స్ ముందుండటం అనేది శుభపరిణామంగా చెప్పుకోవాలి. చిరుధాన్యాల ఉపయోగాలు వారికి కంఠోపాఠం.

'చైనీస్, ఇటాలియన్ రుచులకు అలవాటు పడిన మిలీనియల్స్‌ను మిల్లెట్స్ దగ్గరికి తీసుకుపోగలమా?' అనేది ఒకప్పుడు పరిశోధకులు, ప్రచారకుల మదిలోకి వచ్చిన ప్రశ్న.

సోషల్ మీడియా పుణ్యమా అని మిలీనియల్స్ మిల్లెట్స్ గురించి అవగాహన పెంచుకోవడమే కాదు వాటి ఉపయోగాన్ని ఆచరణలోకి తీసుకువస్తున్నారు.

వంటకం పేరు, హెల్తీ ఇన్‌గ్రేడియెంట్స్, మెథడ్ ఆఫ్ ప్రిపరేషన్, హైజీన్... ఆధారంగా జరిగే 'కుకింగ్ ఛాలెంజ్'లో మిలీనియల్స్ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పిజ్జాల రుచుల దగ్గరే ఆగిపోయిన యువతరం ఇప్పుడు మిల్లెట్ బేస్డ్ దోశ, వడ, ఉప్మా.. మొదలైన వాటి రుచిని ఆవురావురుమంటూ ఆస్వాదిస్తుంది. ఆరోగ్యస్పృహతో మిల్లెట్స్‌పై ఆసక్తి పెంచుకోవడం అనేది ఒక కోణం అయితే, రోజురోజుకు మిల్లెట్స్‌కు ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా సృజనాత్మకమైన ఆలోచనలతో మిల్లెట్ ఆధారిత అంకురాల(స్టార్టప్)పై దృష్టి పెట్టడం మరో కోణం.

'మిల్లెట్స్, మిలీనియల్స్‌లో 5 ఆల్ఫాబెట్స్ ఒక్కటే. అందుకే మిల్లెట్స్‌కే నా ఓటు' అని చమత్కరిస్తున్నాడు ముంబైకి చెందిన శ్రీచందన్.

ఇంటిప్స్

చెక్క ఫర్నీచర్ పాలిష్ వెలిసిపోయి డల్‌గా కనిపిస్తుంటే దానిలో సులువుగా తిరిగి మెరుపు తెప్పించవచ్చు.

ముందుగా ఫర్నీచర్‌ను పొడిబట్టతో దులిపి శుభ్రం చేయాలి. తర్వాత టీ డికాక్షన్‌లో ఒక బట్టను ముంచి, దానిని పిండేసి ఫర్నీచర్‌ను తుడవాలి. ఆరిన తర్వాత మరో సారి శుభ్రమైన పొడి వస్త్రంతో తుడవాలి.

చెక్క ఫర్నీచర్‌పై మసి మరకలు పడితే... మరక పడిన చోట తెల్లటి టూత్ పేస్ట్ రాసి ఆరిన తర్వాత తడిబట్టతో తుడవాలి. తర్వాత తడిలేకుండా పొడిబట్టతో తుడిచెయ్యాలి.





కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో స్నేహ్ రాణా

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ స్నేహ్ రాణా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు టోర్నీ ఫైనల్లో రెండు వికెట్లు పడగొట్టిన స్నేహ్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచింది. భారత్‌కే చెందిన దీప్తి శర్మ, రేణుక సింగ్ ఒక్కో స్థానం పడిపోయి వరుసగా మూడు, ఎనిమిది ర్యాంకుల్లో నిలిచారు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన మూడో స్థానంలో, షఫాలీ వర్మ ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నారు.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో...

గత నెలలో విశేషంగా రాణించిన భారత క్రికెటర్లు సిరాజ్, శుబ్‌మన్ గిల్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన సిరాజ్ గత నెలలో ఐదు వన్డేలు ఆడి 14 వికెట్లు పడగొట్టడంతోపాటు టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. గత నెలలో గిల్ ఐదు టి20లు, ఆరు వన్డేలు ఆడి మొత్తం 643 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక డబుల్ సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి.




డబ్ల్యూపీఎల్ వేలం బరిలో 409 మంది



ముంబై: వచ్చే నెలలో తొలిసారి నిర్వహించనున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నీ వేలం బరిలో నిలిచిన ప్లేయర్ల జాబితాను మంగళవారం విడుదల చేశారు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరిగే ఈ టోర్నీలో ఐదు జట్లు బరిలో ఉన్నాయి. గరిష్టంగా 90 బెర్త్‌ల కోసం మొత్తం 409 మంది క్రికెటర్లు పోటీపడనున్నారు. ఈనెల 13న ముంబైలో మధ్యాహ్నం 2:30 నుంచి వేలం కార్యక్రమం జరుగుతుంది. మొత్తం 1525 మంది ప్లేయర్లు వేలంలో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోగా... చివరకు 409 మందిని ఎంపిక చేశారు. ఇందులో 246 మంది భారత క్రికెటర్లు... 163 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. మొత్తం 24 మంది క్రికెటర్లు గరిష్ట కనీస ధర రూ. 50 లక్షల విభాగంలో ఉన్నారు. ఐదు ఫ్రాంచైజీలు రూ. 12 కోట్లు చొప్పున వేలంలో వెచ్చించడానికి వీలు ఉంది. ఒక్కో జట్టు 15 నుంచి 18 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకోవచ్చు. గరిష్టంగా ఆరుగురు విదేశీ క్రికెటర్లను తీసుకోవచ్చు. వేలం బరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, షబ్నమ్, శరణ్య, నల్లపురెడ్డి శ్రీచరణి, స్నేహ దీప్తి, కట్టా మహంతి శ్రీ, వై.హేమ, బారెడ్డి అనూష, చల్లా ఝాన్సీలక్ష్మి, విన్నీ సుజన్... హైదరాబాద్ నుంచి అరుంధతి రెడ్డి, గొంగడి త్రిష, యషశ్రీ, మమత, ప్రణవి, కోడూరి ఇషిత ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు రెండు పతకాలు


నాగడి గాయత్రి


వేముల అచ్యుత్

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు రెండు పతకాలు లభించాయి. మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో బాలికల కయాకింగ్–1 స్లాలోమ్ ఈవెంట్‌లో నాగడి గాయత్రి రజత పతకం సాధించింది. బాలుర కనోయింగ్–1 స్లాలోమ్ విభాగంలో వేముల అచ్యుత్ కుమార్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలతో 16వ స్థానంలో ఉంది.

బ్రిస్బేన్ టు నాగ్‌పూర్...

రేపటి నుంచి బోర్డర్–గావస్కర్ ట్రోఫీ


ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, కోహ్లి

జనవరి 19, 2021... బ్రిస్బేన్‌లోని 'గాబా' మైదానం... భారత టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఘట్టాల్లో ఒకటిగా నిలిచిపోయే దృశ్యం ఆవిష్కృతమైంది... 33 ఏళ్లుగా ఆస్ట్రేలియా ఓటమి ఎరుగని వేదికపై టీమిండియా జయకేతనం ఎగురవేసింది. ఒకదశలో పూర్తి ఫిట్‌గా ఉన్న 11 మందిని ఎంచుకోవడమే అసాధ్యం మారిన స్థితిలో ఈ మ్యాచ్ బరిలోకి దిగిన మన జట్టు సంచలన ప్రదర్శనతో విజయంతో పాటు సిరీస్‌నూ సొంతం చేసుకుంది. రెండేళ్ల తర్వాత నాటి అవమానభారాన్ని మోస్తూ ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో అడుగు పెట్టింది. అయితే మనకు అనుకూలమైన పిచ్‌లు, వాతావరణం, స్పిన్ బలగం... ఇలా అన్నీ టీమిండియా పక్షానే ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ఆసీస్ బృందం తమ దేశంలో గత సిరీస్‌లో భారత్ ప్రదర్శించిన స్ఫూర్తిదాయక ప్రదర్శనను చూపించగలదా? లేక ఎప్పటిలాగే తల వంచి నిష్క్రమిస్తుందా? స్వదేశంలో అత్యద్భుత రికార్డు ఉన్న భారత్ ప్రత్యర్థిపై ఏ స్థాయిలో ఆధిపత్యం ప్రదర్శించ గలదో వేచి చూడాలి.

– సాక్షి క్రీడా విభాగం

గత రెండు దశాబ్దాల్లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఎన్నో అద్భుతమైన, చిరస్మరణీయ టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. 2001 కోల్‌కతా నుంచి 2021 బ్రిస్బేన్ వరకు విజయం ఎవరిదైనా ఆసక్తికర మలుపు, ఉత్కంఠ నిండిన క్షణాలతో ఇరు దేశాల అభిమానులను అలరించాయి. ఎన్నో హోరాహోరీ సమరాలు, రికార్డులు, ఘనతలు బోర్డర్–గావస్కర్ ట్రోఫీని ప్రపంచ క్రికెట్‌లో అన్నింటికంటే అత్యుత్తమ టెస్టు పోరుగా మార్చేశాయి. 'భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవడం యాషెస్‌కంటే ఎక్కువ' అని స్టీవ్ స్మిత్ నేరుగా చెప్పడం ఈ సిరీస్ ప్రాధాన్యతను చూపిస్తోంది. ఇరు జట్ల బలాబలాలు, జట్టులో ప్రస్తుతం ఆడుతున్న సభ్యులను బట్టి చూస్తే గత మూడు సిరీస్‌లు భారత్ ఆధిపత్యంపై స్పష్టత నిస్తాయి. 2016–17లో స్వదేశంలో జరిగిన సిరీస్‌ను 2–1తో గెలుచుకున్న భారత్... ఆ తర్వాత ఆస్ట్రేలియాలో వరుసగా 2018–19లో 2–1తోనే, ఆపై 2020–21లో 2–1తో సిరీస్‌లను సొంతం చేసుకుంది. రేపటి నుంచి నాగ్‌పూర్‌లో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌తో నాలుగు టెస్టుల కీలక సమరానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సిరీస్‌లో సాగబోయే ఆసక్తికర ముఖాముఖీలను చూస్తే...

- భారత గడ్డపై ఆస్ట్రేలియా ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్‌కు మంచి రికార్డే ఉంది. అతను 7 టెస్టుల్లో 30.58 సగటుతో 34 వికెట్లు తీశాడు. తొలి పర్యటనకంటే రెండోసారి అతని ప్రదర్శన మెరుగైంది. మరోవైపు ఆస్ట్రేలియాలో కోహ్లి, పుజారాలపై పేలవ ప్రదర్శన కనబర్చిన లయన్, భారత్‌లో మాత్రం కోహ్లిని 4 సార్లు, పుజారాను 5 సార్లు అవుట్ చేశాడు.
- ఆస్ట్రేలియాలో ఏకంగా 54 సగటుతో 1352 పరుగులు చేసి చెలరేగిపోయిన కోహ్లి... భారత్‌లో మాత్రం అదే ఆసీస్‌పై 33 సగటుతో 330 పరుగులే చేశాడు.
- స్వదేశంలో ఆసీస్‌తో ఆడిన 8 టెస్టుల్లో అశ్విన్ 50 వికెట్లు తీశాడు. ఇప్పుడూ అతనే జట్టుకు కీలకం. వార్నర్‌నే అశ్విన్ 10 సార్లు అవుట్ చేశాడు. జడేజా బౌలింగ్‌లో నూ తీవ్రంగా ఇబ్బంది పడిన వార్నర్ 4 సార్లు అవుటయ్యాడు.
- ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఆట ఈ సిరీస్‌లో నిర్ణాయకంగా మారనుంది. భారత గడ్డపై అశ్విన్ బౌలింగ్‌లో ఏకంగా 57 సగటుతో స్మిత్ పరుగులు సాధించాడు. జడేజా బౌలింగ్‌లోనూ 38 సగటుతో పరుగులు చేసిన స్మిత్ వీరిద్దరిని సమర్థంగా ఎదుర్కొంటే కంగారూ బృందం పైచేయి సాధించవచ్చు.

గత సిరీస్‌లో ఏం జరిగిందంటే...

తొలి టెస్టు (పుణే): తాము విసిరిన స్పిన్ ఉచ్చులో చిక్కుకున్న భారత్ 333 పరుగులతో ఓడింది. ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌లలో 260, 285 పరుగులు చేయగా... లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒకీఫ్ (12/70) ధాటికి భారత్ 105, 107 పరుగులకే ఆలౌటైంది.

రెండో టెస్టు (బెంగళూరు): భారత్ 75 పరుగులతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 87 పరుగుల ఆధిక్యం లభించినా... రెండో ఇన్నింగ్స్‌లో 188 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక జట్టు 112 పరుగులకే కుప్పకూలింది.

మూడో టెస్టు (రాంచీ): భారీ స్కోర్లు నమోదైన ఈ టెస్టు (భారత్ 603/9 : ఆస్ట్రేలియా 451, 204/6) 'డ్రా'గా ముగిసింది. భారత్‌కు చివర్లో గెలుపు అవకాశం వచ్చినా ఆసీస్ బతికిపోయింది.

నాలుగో టెస్టు (ధర్మశాల): 8 వికెట్లతో భారత్ విజయం. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 32 పరుగుల స్వల్ప ఆధిక్యమే లభించినా... రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను 137 పరుగులకే కుప్పకూల్చి జట్టు సునాయాస విజయాన్నందుకుంది.

అంతర్జాతీయ క్రికెట్‌కు ఫించ్ గుడ్‌బై



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టి20 జట్టు కెప్టెన్ ఆరోన్ ఫించ్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. అయితే స్వదేశంలో జరిగే బిగ్‌బాష్, ఇతర దేశాల్లో జరిగే టి20 లీగ్‌లలోనూ ఆడతానని 36 ఏళ్ల ఫించ్ తెలిపాడు. 2015 వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడైన ఫించ్... 2021తో తన కెప్టెన్సీలో ఆస్ట్రేలియాకు తొలిసారి టి20 ప్రపంచకప్‌ను అందించాడు. 2011లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఫించ్ ఆస్ట్రేలియా తరఫున ఐదు టెస్టుల్లో (278 పరుగులు), 146 వన్డేల్లో (5406 పరుగులు), 103 టి20ల్లో (3120 పరుగులు) ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ప్లేయర్‌గా (172; జింబాబ్వేపై 2018లో)... అత్యధిక మ్యాచ్‌ల్లో (76) కెప్టెన్‌గా వ్యవహరించిన ప్లేయర్‌గా ఫించ్ పేరిట రికార్డులు ఉన్నాయి.

గ్యారీ బ్యాలన్స్ సెంచరీ




బులవాయో: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో జింబాబ్వే జట్టు దీటైన సమాధానం ఇచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 114/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 9 వికెట్లకు 379 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. గ్యారీ బ్యాలన్స్ (137 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో కెప్లెర్ వెసెల్స్ (ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా) తర్వాత రెండు దేశాల తరఫున టెస్టుల్లో సెంచరీలు చేసిన రెండో క్రికెటర్‌గా బ్యాలన్స్ గుర్తింపు పొందాడు. గతంలో ఇంగ్లండ్ తరఫున ఆడిన బ్యాలన్స్ ఈ ఏడాది నుంచి తను పుట్టిన జింబాబ్వే దేశం తరఫున ఆడుతున్నాడు. 68 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన వెస్టిండీస్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది.


చెన్నై బ్లిట్జ్ గెలుపు

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్ జట్టు 15–9, 11–15, 15–10, 8–15, 15–9తో కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టుపై గెలిచింది. చెన్నై తరఫున జేకబ్ నవీన్ రాజా తొమ్మిది పాయింట్లు, అఖిన్ ఎనిమిది, రెనాటో ఎనిమిది పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తలపడుతుంది.

సినిమా

కొన్ని రోజులుగా కొందరు స్టార్స్ జైలు చుట్టూ తిరుగుతున్నారు. అయితే సినిమా జైలు అన్నమాట. ఈ జైలు సెట్‌లో కొందరు స్టార్స్ జైలర్లుగా, కొందరు ఖైదీలుగా నటిస్తున్నారు జైలు బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథలతో వసూళ్ల పరంగా బాక్సాఫీస్ కోర్టు ఇచ్చే తుది తీర్పు కోసం శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఇక ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.






తీర్పు కోసం... జైలు చుట్టూ స్టార్స్







ఖైదీలు పారిపోకుండా 'జైలర్'గా కాపు కాస్తున్నారు హీరో రజనీకాంత్. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'జైలర్'. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, సునీల్, జాకీష్రాఫ్, రమ్యకృష్ణ, తమన్నా కీ రోల్స్ చేస్తున్నారు. శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ ఖైదీల్లా కనిపిస్తారట. ఈ చిత్రం కోసం చెన్నైలోని ఓ స్టూడియోలో జైలు సెట్‌ను వేసి, ఓ భారీ షెడ్యూల్‌ను చిత్రీకరించారు. ఇక కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా ఫిల్మ్ 'ఘోస్ట్'. ఈ సినిమా కథ మేజర్‌గా జైలులోనే సాగుతుంది. జైలు సీన్స్ కోసం దాదాపు 6 కోట్ల రూపాయలతో సెట్ వేశారు. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ ఖైదీ పాత్రలో కనిపిస్తారని టాక్. శ్రీని దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. అలాగే నాగచైతన్య హీరోగా వెంకట్‌ప్రభు దర్శకత్వంలో 'కస్టడీ' సినిమా సెట్స్‌పై ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో కృతీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నాగచైతన్య పోలీసాఫీసర్‌గా నటిస్తుండగా, నేరం మోపబడిన ఖైదీ పాత్రలో కనిపిస్తారట కృతి. ఇక బాలీవుడ్‌లోనూ జైలు కథలు ఉన్నాయి. 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్ (2004), 'లగే రహో మున్నా భాయ్' (2006) వంటి హిట్ చిత్రాలతో మెప్పించిన సంజయ్ దత్, అర్షద్ వార్సి తాజాగా మరో సినిమా చేస్తున్నారు. జైలు బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని దర్శకుడు సిద్ధాంత్ సచ్‌దేవ్ తెరకెక్కిస్తున్నారని ఫస్ట్ లుక్ చెబుతోంది. ఇక తమిళ హిట్ మూవీ 'ఖైదీ' (2019) కొంత భాగం జైలు బ్యాక్‌డ్రాప్‌లోనే ఉంటుంది. ఈ సినిమాని హిందీలో అజయ్ దేవగన్ 'భోలా'గా రీమేక్ చేశారు. సో.. ఈ చిత్రం కూడా జైలు, ఖైదీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని ఊహించ వచ్చు. ఈ సినిమాలో నటించడంతో పాటు, దర్శకత్వం కూడా వహించారు అజయ్ దేవగన్. టబు పోలీసాఫీసర్ రోల్ చేసిన ఈ సినిమా మార్చి 30న రిలీజ్ కానుంది. ఇక 'హే సినామిక' చిత్రం తర్వాత కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ డైరెక్ట్ చేసిన మరో ఫిల్మ్ 'థగ్స్'. జైలు బ్యాక్‌డ్రాప్‌లో ఖైదీలు, వారి ఆలోచనల నేపథ్యంలో ఈ సినిమా తీశారు. హ్రిదు, సింహా, ఆర్‌కే సురేష్, మునిష్కాంత్ నటించిన ఈ చిత్రం తెలుగులో 'కోనసీమ థగ్స్'గా రిలీజ్ కానుంది. ఇప్పటివరకూ చెప్పిన చిత్రాలు జైలు చుట్టూ తిరుగుతాయి. కాగా మేజర్ బ్యాక్‌డ్రాప్ అని చెప్పలేం కానీ కమల్‌హాసన్ 'ఇండియన్ 2', అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్', రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు', 'రావణాసుర' చిత్రాల్లో కొన్ని జైలు సీన్స్ ఉన్నట్లు తెలిసింది. ఇవే కాదు.. చెరసాల చుట్టూ తిరిగే చిత్రాలు ఇంకొన్ని రానున్నాయి.

మళ్లీ వాయిదా


సమంత

'శాకుంతలం' సినిమా ప్రేక్షకుల ముందుకు ఆలస్యంగా రానుంది. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత, దేవ్ మోహన్ లీడ్ రోల్స్‌లో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని ముందు గత ఏడాది నవంబరు 4న విడుదల చేయాలనుకున్నారు. అయితే 3డీ విజువల్ ఎక్స్‌పీరియన్స్, వీఎఫ్‌ఎక్స్ (గ్రాఫిక్స్) పనులు పూర్తి కాని కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరి 17కి వాయిదా వేశారు. కానీ 17న కూడా 'శాకుంతలం' థియేటర్స్‌కి కావడం లేదు. విడుదల వాయిదా వేస్తున్నామని, కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ముక్కోణపు ప్రేమకథ

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయిధరమ్ తేజ్ 'వినరో భాగ్యము విష్ణు కథ' ట్రైలర్‌ను లాంచ్ చేసి, సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ''దర్శన (కశ్మీర) అనే అమ్మాయి నుండి వచ్చిన ఫోన్ కాల్ ద్వారా విష్ణు (కిరణ్) విధి ఎలా మారింది? చివరికి ఆమె అతన్ని ఎలా చేరుకుంది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. ఈ ముక్కోణపు ప్రేమకథలో చక్కని ప్రేమ, వినోదం వంటి వాణిజ్య అంశాలున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ వేడుకలో అల్లు అరవింద్, బన్నీ వాసు, దర్శకులు హరీష్ శంకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.


కిరణ్ అబ్బవరం, సాయి ధరమ్‌తేజ్

ఏడడుగులు వేశారు


కియారా, సిద్ధార్థ్



ప్రేమికులు సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ మిస్టర్ అండ్ మిసెస్‌గా మారారు. ఫిబ్రవరి ఏడున ఈ జంట ఏడడుగులు వేశారు. మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఇరు కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమకు చెందిన కొందరు ప్రముఖుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గల సూర్యగఢ్ ప్యాలెస్ వేదికగా వివాహ వేడుక జరిగింది. హీరో షాహిద్ కపూర్, దర్శక–నిర్మాత కరణ్ జోహార్, డిజైనర్ మనీష్ మల్హోత్రా తదితరులు హాజరైనట్లు సమాచారం. పెళ్లికి ముందు రోజు హల్దీ, సంగీత్ తదితర వేడుకలు జరిపారు. కాగా సిద్దార్థ కియారా స్వయంగా సోషల్ మీడియా ద్వారా తమ పెళ్లి ఫోటోలను షేర్ చేశారు.

మహిళలందరూ చూడాల్సిన సినిమా – సుమ


సుహాస్
సుమ

'రైటర్ పద్మభూషణ్' చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 39 థియేటర్స్‌లో బుధవారం ఉచితంగా చూసే అవకాశాన్ని మహిళలకు కల్పిస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'ది స్వీట్ సర్‌ప్రైజ్ రివీల్' ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన యాంకర్ సుమ మాట్లాడుతూ– ''మహిళల కోసమే 'రైటర్ పద్మభూషణ్' తీశారు. ఈ సినిమాని తప్పకుండా చూడండి. కచ్చితంగా కనెక్ట్ అవుతారు. ఇందులో వినోదం, సందేశం ఉన్నాయి'' అన్నారు. ''నేడు నాలుగు షోలని మహిళలకు ఉచితంగా చూపిస్తున్నాం. 'రైటర్ పద్మభూషణ్' పెద్ద బ్లాక్ బస్టర్ అయ్యింది'' అన్నారు శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి. ''మహిళలందరూ వచ్చి సినిమాని చూసి మమ్మల్ని ఆశీర్వదించాలి'' అన్నారు సుహాస్. ''ప్రేక్షకులు మాపై చూపిస్తున్న ప్రేమకి ఇది చిరు కానుక'' అన్నారు షణ్ముఖ ప్రశాంత్.

యాక్షన్ థ్రిల్లర్


సుదీప్


సుదీప్, అమలాపాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హెబ్బులి'. కన్నడలో సూపర్ హిట్టయిన ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఎమ్. మోహన శివకుమార్ సమర్పణలో సి. సుబ్రహ్మణ్యం ఈ నెల 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ట్రైలర్‌ను నిర్మాత సి. కల్యాణ్ రిలీజ్ చేయగా, మొదటి పాటను నిర్మాత ప్రసన్న కుమార్, రెండవ పాటని ప్రొడ్యూసర్ తుమ్మలపల్లి సత్యనారాయణ విడుదల చేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హెబ్బులి'. కన్నడలో మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రాన్ని ఫ్యాన్సీ రేటు ఇచ్చి తెలుగులో డబ్ చేసి, రిలీజ్ చేస్తున్నాను'' అన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, నిర్మాత సురేష్ కొండేటి మాట్లాడారు.

కొత్త సినిమా షురూ


సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించనున్న కొత్త సినిమా షురూ అయింది. మంగళవారం (ఫిబ్రవరి 7) సిద్ధు జొన్నలగడ్డ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. సిద్ధు కెరీర్‌లో 8వ సినిమాగా తెరకెక్కనున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు. ఈ సినిమాతో వైష్ణవి దర్శకురాలిగా పరిచయం కానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

మాట ఇస్తున్నా! – శివ రాజ్‌కుమార్


శివ రాజ్‌కుమార్, గీత

''నాన్నగారు (కన్నడ స్టార్ రాజ్‌కుమార్), ఎన్టీఆర్, నాగేశ్వర రావు, శివాజీ గణేశన్, ఎంజీఆర్‌సార్లు బ్రదర్స్‌లా ఉండేవాళ్లు. ఆ వారసత్వాన్ని తర్వాతి తరంలో మేం ముందుకు తీసుకెళుతున్నాం. తారకరత్నగారిని వెళ్లి చూశాను. త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను'' అన్నారు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్. ఆయన నటించిన 125వ కన్నడ చిత్రం 'వేద'. ఎ. హర్ష దర్శకత్వంలో శివ రాజ్‌కుమార్ భార్య గీత నిర్మించిన ఈ సినిమాని 'శివ వేద' పేరుతో వీఆర్ కృష్ణ మండపాటి ఈ నెల 9న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ–''ఈ సినిమాలో యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్, మంచి సందేశం ఉన్నాయి. నా తర్వాతి చిత్రాలను కన్నడతో పాటు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ ఒకేసారి విడుదల చేస్తానని మాట ఇస్తున్నా'' అన్నారు.

దేశం కోసం సిద్ధం


రవీంద్ర గోపాల్

'అన్నల రాజ్యం, నాగమ నాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలు నిర్మించిన రవీంద్ర గోపాల్ లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'దేశం కోసం'. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అతిథిగా పాల్గొన్న నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''దేశం మీద ప్రేమ ఉన్నవారు ఈ చిత్రం తప్పకుండా చూడాలి'' అన్నారు. ''ఈ సినిమాలో 14 మంది స్వాతంత్ర్య సమర యోధుల పాత్రలు చేశాను'' అన్నారు రవీంద్ర గోపాల్.

సాక్షి బిజినెస్
బుధవారం
8-2-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
221	43
60,286	17,722

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్‌	12,052	▲	165
డోజోన్స్‌	34,011	▲	172
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,865	▲	28
డాక్స్‌	15,321	▽	25
షాంఘై	3,248	▲	9
నికాయ్‌	27,685	▽	8

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్‌)	58,882	▽	90
బంగారం (22 క్యారట్‌)	58,646	▽	90
వెండి (కేజీ)	71,576	▽	472

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	81.90	83.57
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	87.29	90.40
€	యూరో	ఒకటి	98.02	101.35
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	61.53	63.54
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	56.30	58.68
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	61.39	63.40
SAR	సౌదీ రియాల్‌	పదింటికి	21.06	22.73
UAE D	యూఏఈ దిర్హామ్‌	పదింటికి	21.62	23.41
¥	చైనా యువాన్‌	పదింటికి	11.06	13.14

కెనరా బ్యాంక్‌ ఎండీ, సీఈఓగా సత్యనారాయణ రాజు



బెంగళూరు: కెనరా బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్, సీఈఓగా (ఎండీ, సీఈఓ) కే సత్యనారాయణ రాజు నియమితులయ్యారు. తక్షణం అమల్లోకి వచ్చేలా ఈ నియామకం జరిగినట్లు బ్యాంక్‌ ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది డిసెంబర్‌ 31న బాధ్యతలు విరమించిన ఎల్‌వీ ప్రభాకర్‌ స్థానంలో ఈ నియామకం జరిగింది. ఆయన 2021 మార్చి నుంచి కెనరా బ్యాంక్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా పనిచేశారు. ఫిజిక్స్‌ గ్రాడ్యుయేట్, బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌ (బ్యాంకింగ్, ఫైనాన్స్‌) పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ అయిన రాజు, ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ బ్యాంకర్స్‌ సర్టిఫైడ్‌ అసోసియేట్‌ (సీఏఐఐబీ) కూడా కావడం గమనార్హం.

మరింత వ్యాపార వృద్ధిపై పతంజలి ఫుడ్స్‌ దృష్టి

హైదరాబాద్‌: పతంజలి ఫుడ్స్‌ మరింత వ్యాపారాభివృద్ధిపై దృష్టి పెట్టింది. డిసెంబర్‌ క్వార్టర్‌లో సాధించిన వ్యాపార, ఆర్థిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపింది. సాంకేతికత, బహుళ అంచెల పంపిణీ వ్యవస్థలో విరివిగా పెట్టుబడులు పెట్టి సేల్స్‌ టీమ్‌ సామర్థ్యాన్ని, పంపిణీదారుల ద్వారా అమ్మకాలను మరింత పెంచుకుంటామని పేర్కొంది. ప్రీమియం, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ ద్వారా కొత్త కస్టమర్లకు చేరువ కావాలని భావిస్తోంది. విక్రయాల వృద్ధి లక్ష్య సాధనకు పంపిణీ ఛానెల్‌ను బలోపేతం చేయడంతో పాటు అన్ని రకాల ధరల్లో ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. తద్వారా మూడో క్వార్టర్‌ అక్టోబర్‌లో ఒక నెలలో అత్యధికంగా 1.5 లక్షల మెట్రిక్‌ టన్నుల వంటనూనె, వనస్పతి అమ్మకాలు జరిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

8-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	445–00
విజయవాడ	445–00
రిటైల్‌ ధర (డజను)	72.00
7-2-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	415–00
వరంగల్‌	417–00
రిటైల్‌ ధర	4.75

అదానీ పోర్ట్స్‌ లాభం డౌన్‌

క్యూ3లో రూ. 1,337 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్‌ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్‌ అండ్‌ సెజ్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతం క్షీణించి రూ. 1,337 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,535 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,713 కోట్ల నుంచి రూ. 5,051 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 2,924 కోట్ల నుంచి రూ. 3,507 కోట్లకు పెరిగాయి. కాగా.. పూర్తి ఏడాదికి రూ. 14,500–15,000 కోట్ల నిర్వహణ లాభం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ సీఈవో కరణ్‌ అదానీ పేర్కొన్నారు. రూ. 4,000–4,500 కోట్ల పెట్టుబడి వ్యయ అంచనాల మధ్య రూ. 5,000 కోట్ల రుణ చెల్లింపులను చేపట్టే వీలున్నట్లు వెల్లడించారు. తద్వారా 2024 మార్చికల్లా ఇబిటా నికర రుణ నిష్పత్తి 2.5కు చేరే అవకాశమున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 556 వద్ద ముగిసింది.

అదానీ గ్రీన్‌ లాభం హైజంప్‌

క్యూ3లో రూ. 103 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో అదానీ గ్రీన్‌ ఎనర్జీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ.103 కోట్లను తాకింది. గతేడాది ఇదే కాలంలో రూ.49 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఆదాయం సైతం రూ. 1,471 కోట్ల నుంచి రూ. 2,258 కోట్లకు జంప్‌ చేసింది. ఈ ఏడాది మార్చికల్లా 8,300 మెగావాట్ల నిర్వహణా సామర్థ్యాన్ని అందుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కొత్తగా ప్రారంభమైన 1,440 మెగావాట్ల సోలార్, విండ్‌ హైబ్రిడ్‌ ప్లాంట్లు బైఫేషియల్‌ పీవీ మాడ్యూల్‌ తదితర ఆధునిక సాంకేతికతలతో ఏర్పాటైనట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ గ్రీన్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 5 శాతం పతనమై రూ. 845 వద్ద ముగిసింది.

అంబుజా సిమెంట్స్‌ లాభం అప్‌

క్యూ3లో రూ. 488 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్‌ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 488 కోట్లకు చేరింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 431 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 4 శాతం బలపడి రూ. 7,907 కోట్లను తాకింది. గతేడాది క్యూ3లో రూ. 7,625 కోట్ల టర్నోవర్‌ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు 6 శాతం పెరిగి రూ. 7,279 కోట్లకు పెరిగాయి. 51 శాతం వాటా గల అనుబంధ సంస్థ ఏసీసీ పనితీరు సైతం ఫలితాలలో కలసి ఉన్నట్లు అంబుజా పేర్కొంది. కాగా.. ప్రస్తుత క్యూ3లో అంబుజా స్టాండెలోన్‌ నికర లాభం 46 శాతం జంప్‌చేసి రూ. 369 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 10 శాతంపైగా ఎగసి రూ. 4,129 కోట్లకు చేరింది. అమ్మకాల పరిమాణం 12 శాతం వృద్ధితో 7.7 మిలియన్‌ టన్నులుగా నమోదైంది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన 3.5 శాతం తక్కువగా 13.7 ఎంటీ అమ్మకాలు సాధించింది.

ఫలితాల నేపథ్యంలో అంబుజా సిమెంట్స్‌ షేరు బీఎస్‌ఈలో 1.2% బలపడి 384 వద్ద ముగిసింది.

మార్కెట్లో పాలసీ అప్రమత్తత

- ఐటీ, ఆటో, మెటల్‌ షేర్ల డీలా
- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్‌ 221 పాయింట్ల పతనం



ముంబై: ఐటీ, ఆటో, మెటల్‌ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్‌ సూచీలు రెండోరోజూ నష్టాలను చవిచూశాయి. ఎకనామిక్‌ క్లబ్‌ ఆఫ్‌ వాషింగ్టన్‌లో ఫెడ్‌ చైర్మన్‌ జెరోమ్‌ పావెల్‌ ప్రసంగం(మంగళవారం రాత్రి), ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ నిర్ణయాలు వెల్లడి(బుధవారం) పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించారు. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. సెన్సెక్స్‌ నాలుగు పాయింట్ల స్వల్ప లాభంతో 60,511 వద్ద, నిఫ్టీ 25 పాయింట్లు పెరిగి 17,790 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి సెషన్‌లో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ ఎఫ్‌ఎంజీసీ, ఆటో, ఐటీ, మెటల్‌ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్‌ 444 పాయింట్లు నష్టపోయి 60,063 వద్ద, నిఫ్టీ 113 పాయింట్లు క్షీణించి 17,652 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే మిడ్‌ సెషన్‌ తర్వాత ఫైనాన్స్, బ్యాంకింగ్‌ షేర్లకు డిమాండ్‌ లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. మార్కెట్‌ ముగిసే సరికి సెన్సెక్స్‌ 221 పాయింట్లు నష్టపోయి 60,286 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పతనంతో 17,722 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2560 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.640 కోట్ల షేర్లను కొన్నారు. యూఎస్‌ జాబ్‌ డేటా అంచనాలకు మించి నమోదవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి

మార్కెట్లో మరిన్ని సంగతులు

- హిండెన్‌బర్గ్‌ నివేదికతో గత పది సెషన్ల నుంచి పతనాన్ని చూస్తున్న అదానీ గ్రూప్‌ కంపెనీ షేర్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ షేరు 15% ర్యాలీ చేసింది. అదానీ విల్మార్‌ 5%, అదానీ పోర్ట్స్, అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్, ఎన్‌డీటీవీ షేర్లు ఒకశాతం వరకు లాభపడింది.
- క్యూ3లో నికర నష్టాలు తగ్గడంతో పేటీఎం షేరుకు రెండోరోజూ డిమాండ్‌ లభించింది. ట్రేడింగ్‌లో 20% ఎగిసి రూ.670 వద్ద అప్పర్‌ సర్క్యూట్‌ను తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 6% పెరిగి రూ.589 వద్ద ముగిసింది.
- టాటా స్టీల్‌ షేరు ఐదు శాతం నష్టపోయి రూ.111 వద్ద స్థిరపడింది.

ఎయిర్‌టెల్‌ లాభం 92% జూమ్‌

- క్యూ3లో రూ. 1,588 కోట్లు
- రూ. 193కు ఏఆర్‌పీయూ



న్యూఢిల్లీ: మొబైల్‌ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 92 శాతం జంప్‌చేసి రూ. 1,588 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 830 కోట్లు ఆర్జించింది. అనుకోని వ్యయాలకు ముందు నికర లాభం 147 శాతం అధికంగా రూ. 1,994 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 20 శాతం పుంజుకుని రూ. 35,804 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 29,867 కోట్ల టర్నోవర్‌ నమోదైంది. మొత్తం పెట్టుబడి వ్యయాలు 52 శాతం పెరిగి రూ. 9,314 కోట్లకు చేరాయి. దేశీయంగా 5జీ నెట్‌వర్క్‌ ప్రారంభానికి ప్రధానంగా నిధులు వెచ్చించింది. దీంతో ఫ్రీ క్యాష్‌ఫ్లోలు 12% తగ్గి రూ. 5,071 కోట్లకు పరిమితమయ్యాయి. ఆదాయంలో దేశీ విభాగం వాటా 19% వృద్ధితో రూ. 24,962 కోట్లను తాకగా.. పెట్టుబడి వ్యయాలు 74% ఎగసి రూ. 8,095 కోట్లకు చేరాయి.

కొత్త కస్టమర్లు అప్‌

అన్ని విభాగాల్లోనూ మరోసారి నిలకడైన పటిష్ట పనితీరు చూపినట్లు ఎయిర్‌టెల్‌ ఎండీ గోపాల్‌ విఠల్‌ తెలియజేశారు. ఇబిటా మార్జిన్లు 52 శాతానికి మెరుగుపడినట్లు పేర్కొన్నారు. నాణ్యమైన కస్టమర్లను పొందే వ్యూహాల కారణంగా 4జీ విభాగంలో 6.4 మిలియన్ల మంది కొత్తగా జత కలసినట్లు వెల్లడించారు. మొబైల్‌ సేవల ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ. 193కు బలపడినట్లు తెలియజేశారు. గత క్యూ3లో రూ. 163 మాత్రమేనని ప్రస్తావించారు. 5జీ సేవల విస్తరణ కొనసాగుతున్నదని, 2024 మార్చికల్లా అన్ని కీలక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోనూ సేవలందిస్తామని తెలియజేశారు.

ఇతర విశేషాలు

- గ్లోబల్‌ కస్టమర్ల సంఖ్య 5.8 శాతం వృద్ధితో 51 కోట్లకు చేరింది. దీనిలో దేశీ కస్టమర్ల సంఖ్య 36.92 కోట్లు.
- దేశీ మొబైల్‌ యూజర్ల సంఖ్య 33.22 కోట్లు కాగా.. 1.8 కోట్లమంది పోస్ట్‌పెయిడ్‌ కస్టమర్లు.
- 4జీ డేటా కస్టమర్ల సంఖ్య 11% పెరిగి 21.67 కోట్లకు చేరింది. నెలవారీ సగటు డేటా వినియోగం 20.29 జీబీ.
- క్యూ3కల్లా నికర రుణ భారం 32 శాతం పెరిగి రూ. 2.09 లక్షల కోట్లుగా నమోదైంది.

కల్యాణ్‌ జ్యువెలర్స్‌ లాభం ప్లస్‌

క్యూ3లో రూ. 148 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో కల్యాణ్‌ జ్యువెలర్స్‌ పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 10 శాతంపైగా ఎగసి రూ. 148 కోట్లను అధిగమించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో దాదాపు రూ. 135 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం బలపడి రూ. 3,884 కోట్లను తాకింది. గతేడాది క్యూ3లో రూ. 3,435 కోట్ల టర్నోవర్‌ నమోదైంది. దేశీ కార్యకలాపాల నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 253 కోట్ల నుంచి రూ. 276 కోట్లకు వృద్ధి చూపింది.

రామ్‌కో సిమెంట్స్‌ లాభం క్షీణత

క్యూ3లో రూ. 51 కోట్లు



న్యూఢిల్లీ: రామ్‌కో సిమెంట్స్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 32% క్షీణించి రూ. 51 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 75 కోట్లు ఆర్జించింది. పెరిగిన ఇంధన ధరలు ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం మాత్రం 30% ఎగసి రూ.2,020 కోట్లను అధిగమించింది. గతేడాది క్యూ3లో రూ.1,559 కోట్ల టర్నోవర్‌ నమోదైంది.

జాబ్‌ పాయింట్‌

చిత్తూరు జిల్లాలో బ్యాక్‌లాగ్‌ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్‌ కమిటీ(డీఎస్సీ) 2022–23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్‌ చేసిన బ్యాక్‌లాగ్‌ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- **పోస్టుల వివరాలు:** మల్టీపర్పస్‌ హెల్త్‌ అసిస్టెంట్‌(మేల్‌)–01, టర్న్‌ కాక్‌–01, ఫౌండేషన్‌ క్లీనర్‌–01, బోర్‌ వెల్‌ క్లీనర్‌–01, వాచ్‌మెన్‌–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్, ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సు, ఇంటర్‌ ఒకేషనల్‌ (ఎంపీహెచ్‌డబ్ల్యూఎం), డిప్లొమా(సివిల్‌ ఇంజనీరింగ్‌) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** వయసు, వైకల్యం తీవ్రత, ఎంప్లాయ్‌మెంట్‌ సీనియారిటీ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్‌ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

చిత్తూరు జిల్లాలో టైపిస్ట్‌ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్‌ కమిటీ(డీఎస్సీ).. 2022–23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్‌ చేసిన బ్యాక్‌లాగ్‌ పోస్టుల భర్తీకి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** ఏదైనా డిగ్రీతోపాటు తెలుగులో టైప్‌రైటింగ్‌ హయ్యర్‌ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 53 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్‌ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

హెచ్‌ఎంటీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్‌ స్టాఫ్‌ పోస్టులు

హైదరాబాద్‌లోని హెచ్‌ఎంటీ మెషిన్‌ టూల్‌ లిమిటెడ్(హెచ్‌ఎంటీ).. ప్రాజెక్ట్‌ స్టాఫ్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్‌ డిప్యూటీ ఇంజనీర్(మెకానికల్‌)–03, ప్రాజెక్ట్‌ డిప్యూటీ ఇంజనీర్(ఎలక్ట్రికల్‌)–03, ప్రాజెక్ట్‌ ఆఫీసర్(హెచ్‌ఆర్‌)–01, ప్రాజెక్ట్‌ ఆఫీసర్ (ఫైనాన్స్‌)–01, ప్రాజెక్ట్‌ ఆఫీసర్(లీగల్‌)–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్‌ గ్రాడ్యుయేషన్‌/ఎల్‌ఎల్‌బీ/సీఏ/సీఎంఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/ఎంహెచ్‌ఆర్‌ఎం/పీజీడీఎం ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 2ఏళ్లు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** పర్సనల్‌ ఇంటర్వ్యూలో మెరిట్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్‌ మేనేజర్(హెచ్‌)హెచ్‌ఎంటీ మెషిన్‌టూల్స్‌ లిమిటెడ్, హెచ్‌ఎంటీ టౌన్‌షిప్‌ పీఓ, నర్సాపూర్‌ రోడ్, హైదరాబాద్‌వ–500054, తెలంగాణ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.02.2023
- **వెబ్‌సైట్:** www.hmtmachinetools.com

డీఎంహెచ్‌వో, విజయనగరం జిల్లాలో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, పార్వతీపురంలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
- **పోస్టుల వివరాలు:** ఆడియాలజిస్ట్‌ అండ్‌ స్పీచ్‌ థెరపిస్ట్‌–01, డెంటల్‌ టెక్నీషియన్‌–02.
- **అర్హత:** బ్యాచిలర్‌ డిగ్రీ(స్పీచ్‌ అండ్‌ లాంగ్వేజ్‌ పాథాలజీ), డెంటల్‌ టెక్నీషియన్‌ కోర్సు సర్టిఫికేట్‌ ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ఆడియాలజిస్ట్‌ రూ.30,000, డెంటల్‌ టెక్నీషియన్‌కి రూ.18,000 ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, విజయనగరం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023.
- **వెబ్‌సైట్:** www.vizianagaram.nic.in

గ్రూప్‌-3కి.. సిద్ధమవ్వండిలా!

» 1,363 గ్రూప్‌-3 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం
» ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలు
» ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్‌తో సక్సెస్‌ అంటున్న నిపుణులు

తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ).. మొత్తం 1,363 గ్రూప్‌ 3 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. బ్యాచిలర్‌ డిగ్రీతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. పోటీ తీవ్రంగా ఉండే గ్రూప్‌ 3 వంటి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే.. ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్‌ తప్పనిసరి. ఈ నేపథ్యంలో.. గ్రూప్‌-3 పోస్టుల వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్‌ గైడెన్స్‌..

ప్రభుత్వ ఉద్యోగాలంటే.. పోటీ తీవ్రం. గ్రూప్‌–3 అందుకు మినహాయింపు ఏమీ కాదు. అంతేకాకుండా 1363 పోస్టులకు గ్రూప్‌–1, గ్రూప్‌2, సివిల్స్‌ అభ్యర్థులు సైతం పోటీ పడే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఈ పరీక్షలో విజయానికి పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్‌ సాగించాలి అంటున్నారు నిపుణులు.

అర్హతలు

ఒకట్రెండ్‌ పోస్టులకు తప్ప మిగతా అన్ని పోస్టులకు బ్యాచిలర్‌ డిగ్రీ అర్హతగా పోటీ పడే అవకాశముంది. **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్‌ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా

అన్ని పోస్టులకు రాత పరీక్షలో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా.. నియామకాలు ఖరారు చేస్తారు. రాత పరీక్షను ఓఎంఆర్‌ షీట్‌ విధానంలోనే నిర్వహించే అవకాశం ఉంది.

రాత పరీక్ష మూడు పేపర్లుగా

• గ్రూప్‌–3 సర్వీసులకు నిర్వహించే రాత పరీక్ష మూడు పేపర్లుగా మొత్తం 450 మార్కులకు ఉంటుంది. • పేపర్‌ 1 జనరల్‌ స్టడీస్‌ అండ్‌ జనరల్‌ ఎబిలిటీస్‌–150 ప్రశ్నలు–150 మార్కులకు నిర్వహిస్తారు. • పేపర్‌ 2 హిస్టరీ, పాలిటీ అండ్‌ సొసైటీ అంశాలపై 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష ఉంటుంది. •పేపర్‌ 3 ఎకానమీ అండ్‌ డెవలప్‌మెంట్‌పై 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.•పేపర్‌–2,3లలో ప్రతి పేపర్‌లోనూ మూడు అంశాలు ఉంటాయి. ఒక్కో అంశం నుంచి 50 ప్రశ్నలు చొప్పున 150 ప్రశ్నలతో పేపర్‌ ఉంటుంది.

విజయం సాధించాలంటే

గ్రూప్‌–3 పరీక్షలో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పేపర్‌ వారీగా నిర్దిష్ట వ్యూహంతో ముందుకు సాగాలి.

పేపర్‌-1: జనరల్‌ స్టడీస్, జనరల్‌ ఎబిలిటీస్‌

ఈ పేపర్‌కు సంబంధించి.. కరెంట్‌ అఫైర్స్, ఇంటర్నేషనల్‌ రిలేషన్స్‌ అండ్‌ ఈవెంట్స్‌ కు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి భారతదేశ ప్రమేయం, అదే విధంగా భారత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో ఆయా సంఘటనలు, అవి చోటు చేసుకున్న సంవత్సరాలపై పట్టు సాధించాలి. అదే విధంగా చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలకు దారితీసిన యుద్ధాలు, పరిస్థితులపై ప్రత్యేక అవగాహన పెంచుకోవాలి. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని ముఖ్యమైన ఉద్యమాల గురించి తెలుసుకోవాలి. పాలిటీకి సంబంధించి.. రాజ్యాంగం, రాజ్యాంగ పీఠిక, ముఖ్యమైన ఆర్టికల్స్, సవరణలను అధ్యయనం చేయాలి. ఎకానమీ కోసం బేసిక్‌ అంశాలతోపాటు ఇటీవల కాలంలో ఆర్థిక విధానాలు, అభివృద్ధి కారక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారులు, పథకాల లక్ష్యం వంటి అంశాలను అధ్యయనం చేయాలి. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీకి సంబంధించి బేసిక్‌ సైన్స్‌ అంశాలతోపాటు నిజ జీవితంలో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ పాత్ర, ఇటీవల కాలంలో ఈ రంగంలో తాజా పరిణామాలు, వాటి వల్ల ప్రయోజనాలు వంటి వాటిపై పట్టు సాధించాలి. జాగ్రఫీలో భౌగోళికంగా ప్రాధాన్యం సంతరించుకున్న ప్రాంతాలు, ఖనిజ వనరులు, సహజ వనరులు, నదీ తీర ప్రాంతాలు, అడవులు–రకాలు, పంటలు–అవి ఎక్కువగా పండే ప్రాంతాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. జనరల్‌ ఎబిలిటీలో రాణించేందుకు దత్తాంశాల విశ్లేషణ, టేబుల్స్, గ్రాఫ్స్‌ను పరిశీలించి.. వాటిలోని ముఖ్యాంశాలను గుర్తించే విధంగా అధ్యయనం చేయాలి.

పేపర్‌-2 కోసం ఇలా

- హిస్టరీ, పాలిటీ, అండ్‌ సొసైటీ అంశాలున్న పేపర్‌–2 కోసం ప్రత్యేకంగా చదవాలి. ముఖ్యంగా తెలంగాణ హిస్టరీ కోసం తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కవులు, కళలు; ముఖ్యంగా మధ్యయుగ చరిత్ర, శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌ షాహీలు, అసఫ్‌జాహీలు, సాయుధ రైతాంగ పోరాటం తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి.
- పాలిటీ విభాగానికి సంబంధించి.. భారత రాజ్యాంగం, ప్రధాన చట్టాలపై పట్టు సాధించాలి. అధికరణలు, సవరణల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సమాఖ్య వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలి. వీటితో పాటు రాజ్యాంగ పరమైన సంస్థలు(ఉదా: యూపీఎస్సీ, ఎలక్షన్‌ కమిషన్, కాగ్, ఆర్థిక సంఘం తదితర), వాటి విధుల గురించి తెలుసుకోవాలి. గ్రూప్‌–3 అభ్యర్థులు వీలైనంత ఎక్కువగా రాజ్యాంగంపై పట్టు సాధించాలి.
- సమాజ నిర్మాణం, సమస్యలు, ప్రజా విధానాలకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో సమస్యలు, ప్రభుత్వ విధానాల గురించి తెలుసుకోవాలి. ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రూపొందిస్తున్న నూతన పాలసీలపై పట్టు సాధించాలి.



టీఎస్‌పీఎస్సీ జాబ్స్‌

పేపర్‌-3 కోసం

ఎకానమీ అండ్‌ డెవలప్‌మెంట్‌ అంశాలుండే పేపర్‌–3 కోసం దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణ పాలసీలపై పట్టు పెంచుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించి తెచ్చిన పథకాల గురించి తెలుసుకోవాలి. జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కోర్‌ ఎకానమీ అంశాలు మొదలు.. తాజా ఆర్థిక విధానాల వరకూ.. అన్నింటినీ క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.బడ్జెట్‌ గణాంకాలు, ఆర్థిక సర్వే గణాంకాలపై పట్టు సాధించాలి.

అనుసంధానం

గ్రూప్‌–3 అభ్యర్థులు గ్రూప్‌–1, 2, 4లతో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్‌ సాగించొచ్చు. ముఖ్యంగా గ్రూప్‌–3 అభ్యర్థుల్లో ఎక్కువ మంది గ్రూప్‌–2కు కూడా పోటీ పడుతున్నారు. వీరికి కలిసొచ్చే అంశం రెండు పరీక్షలకు సంబంధించి సిలబస్‌ ఒకే విధంగా ఉండడం. గ్రూప్‌–2లోని నాలుగో పేపర్‌ను మినహాయిస్తే.. మిగతా అన్ని పేపర్లు రెండు సర్వీసుల్లోనూ ఒకే రకంగా ఉన్నాయి. దీంతో ఆయా అంశాలను సమ్మిళితం చేసుకుంటూ..ఒకే సమయంలో గ్రూప్‌–3తోపాటు గ్రూప్‌–2కు కూడా పోటీ పడే అవకాశం ఉంది.

మెటీరియల్‌ ముఖ్యం

గ్రూప్‌–3 అభ్యర్థులు పుస్తకాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రామాణిక పుస్తకాలను చదివే ప్రయత్నం చేయాలి. సిలబస్‌పై స్పష్టత తెచ్చుకున్నాక.. అన్ని అంశాలున్న పుస్తకాలను అన్వేషించి.. వాటి ద్వారా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో ప్రిపరేషన్‌ సాగించాలి. అకాడమీ పుస్తకాలు, బ్యాచిలర్‌ డిగ్రీ స్థాయి చరిత్ర పుస్తకాలను చదవాలి.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్‌–3 పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్‌ విధానంలో ఉంటుంది. కాని ప్రిపరేషన్‌లో మాత్రం అభ్యర్థులు విశ్లేషణాత్మక అధ్యయనం సాగించాలి. ఆయా అంశాలను డిస్క్రిప్టివ్‌ విధానంలో చదువుతూ.. సిలబస్‌ అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌ చదివేలా సమయ పాలన పాటించాలి.

కోర్‌ టు కాంటెంపరరీ


ఆయా సిలబస్‌ అంశాలను చదివేటప్పుడు.. వాటికి సంబంధించి కోర్‌ అంశాలతోపాటు కాంటెంపరరీ పరిణామాలను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాల వరకూ..సమగ్ర అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా పరీక్షలో విజయం కోసం నిర్ణయాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం పెంచుకోవాలి. దీనివల్ల ఆబ్జెక్టివ్‌తోపాటు డిస్క్రిప్టివ్‌ విధానంపైగా అవగాహన పొందే అవకాశం లభిస్తుంది. అదే విధంగా నిర్దిష్టంగా ఒక టాపిక్‌ను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధంగా చదవాలి.

సొంత నోట్స్‌

అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్‌ తయారు చేసుకోవాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ విధానం ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tspsc.gov.in



మిరుమిట్ల మాటున ముప్పు

రాత్రిళ్లు మితిమీరిన విద్యుత్‌ వెలుగులతో జీవజాలానికి ప్రమాదం

- ఈ విద్యుత్‌ కాంతుల నుంచి వెలువడే రేడియేషన్‌.. స్కై గ్లో
- ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 శాతం పెరుగుతున్న స్కై గ్లో
- దీంతో పూల వికాసంపై ప్రతికూల ప్రభావం
- తేనెటీగల ఉనికికి ముప్పు
- మృత్యువాత పడుతున్న వలస పక్షులు
- చిన్న నక్షత్రాలను గుర్తించడం కష్టంగా మారుతున్న వైనం
- డార్క్‌ స్కై లైటింగ్‌ విధానాన్ని పాటించాలని సూచిస్తున్న నిపుణులు

సాక్షి, అమరావతి: ఏదైనా నగరంలో రాత్రివేళ ఎత్తయిన భవనంపై నుంచి చూస్తే ఎలా కనిపిస్తుంది?!... మిరుమిట్లు గొలిపే విద్యుత్‌ కాంతి వెలుగులతో ఆ నగరం అంతా మెరిసిపోతూ ఉంటుంది. నిశిరాత్రే పట్టపగలు మాదిరిగా గోచరిస్తుంది. అయితే ఇదంతా ఒక పార్శ్వం మాత్రమే. ఆ మిరుమిట్ల వెలుగుల చాటున పర్యావరణానికి, జీవజాలానికి పెనుముప్పు పొంచి ఉందనే విషయం చాలామందికి తెలియదు. కాంతి కాలుష్యం వర్తమాన ప్రపంచానికి పెను సవాల్‌గా మారుతోందని ప్రముఖ సైన్స్‌ జర్నల్‌ 'సైన్స్‌ మ్యాగజైన్‌' అధ్యయనం ఇప్పుడు కలకలం రేపుతోంది.

దేశంలో ఏటా 20 శాతం పెరుగుతున్న స్కై గ్లో

అభివృద్ధి పేరుతో నగరాల్లో రాత్రుళ్లు మితిమీరిన విద్యుత్‌ వెలుగులు సహజసిద్ధంగా ఉండాల్సిన చీకటిని పారదోలుతున్నాయి. ఈ విద్యుత్‌ కాంతుల నుంచి వెలువడే రేడియేషన్‌ను 'స్కై గ్లో' అని అంటారు. ప్రపంచవ్యాప్తంగా ఈ 'స్కై గ్లో' ఏటా 10 శాతం చొప్పున పెరుగుతుండటం గమనార్హం. న్యూయార్క్‌, వాషింగ్టన్‌, లండన్‌ వంటి నగరాలతోపాటు ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ వంటి మహానగరాల్లోనూ 'స్కై గ్లో' ఏటా 20 శాతం చొప్పున పెరుగుతోంది. ఈ 'స్కై గ్లో' ఆకాశంలోని చిన్న చిన్న నక్షత్రాలను సైతం మసకబారుస్తుండటంతో వాటిని గుర్తించడం కష్టతరంగా మారుతోందని అంటున్నారు. 2011- 2022 మధ్య 10 శాతం చిన్న నక్షత్రాలు మసకబారిపోయినట్టు అధ్యయనంలో వెల్లడైంది.

అంతరిస్తున్న కార్పెంటర్‌ తేనెటీగలు..

కాంతి పరావర్తనాన్ని బట్టి మొక్కల పెరుగుదల ఉంటుందన్న సంగతి తెలిసిందే. 'స్కై గ్లో' పూల వికాసంపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. పూలు సహజసిద్ధంగా వికసించడం లేదని.. నిర్ణీత సమయానికి కంటే ముందుగానే వికసిస్తున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. దీంతో పూలపై ఆధారపడి పరాగ సంపర్కం చేసే తేనెటీగలు సందిగ్ధతకు గురవుతున్నాయి. దీంతో వాటి సంఖ్య క్రమంగా క్షీణిస్తోంది. భారత్‌లోనే ప్రత్యేకంగా ఉండే 'కార్పెంటర్‌ తేనెటీగ' ఉనికి ప్రమాదంలో పడుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. చీకట్లో పరాగ సంపర్కం జరపడం 'కార్పెంటర్‌ తేనెటీగ' ప్రత్యేకత. కృత్రిమ వెలుగులతో చీకటి తగ్గిపోతుండటంతో ఈ తేనెటీగలు క్రమంగా అంతరించిపోతున్నాయి. ముంబైకి 100 కి.మీ. దూరంలో ఉన్న భీమశంకర్‌ అభయారణ్యంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించారు. ముంబై నగరం చిమ్మే వెలుగులతో ఆ అభయారణ్యంలో కార్పెంటర్‌ తేనెటీగలు క్రమంగా అంతరిస్తున్నాయని గుర్తించారు.

ఏటా లక్షల పక్షులు బలి..

నక్షత్రాల వెలుగునే ఆధారంగా చేసుకుని వివిధ ఖండాల నుంచి పెద్ద సంఖ్యలో వలస వచ్చేపక్షులకు స్కై గ్లో నుంచి ముప్పు ఏర్పడుతోంది. విద్యుత్‌ వెలుగులతో జిగేల్‌మంటున్న భారీ భవంతులతో వలస పక్షులు సందిగ్ధతకు లోనవుతున్నాయి. పక్షులు కాంతి పరావర్తనాన్ని గుర్తించలేవు. దీంతో కృత్రిమ కాంతిని చూసి అదే తమ గమ్యస్థానమని భావిస్తున్నాయి. నేరుగా వచ్చి ఎత్తైన భవనాల అద్దాలను ఢీకొట్టి లక్షల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. కాగా వలస పక్షుల విసర్జకాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతున్నాయి. వలస వచ్చే సముద్ర పక్షులు ప్రపంచవ్యాప్తంగా ఏటా బిలియన్‌ అమెరికన్‌ డాలర్ల (రూ.8,500 కోట్లు) విలువైన సేంద్రియ ఎరువును అందిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. రాష్ట్రంలో నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రానికి వచ్చే పెలికాన్‌ పక్షులు సేంద్రియ ఎరువును అందిస్తున్నాయని రాష్ట్ర అటవీ శాఖ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇంతటి ప్రయోజనాన్ని అందిస్తున్న వలస పక్షులు స్కై గ్లో బారిన పడుతుండటం ఆందోళనకరమని నిపుణులు చెబుతున్నారు.

డార్క్‌ స్కై లైటింగ్‌ విధానాలే పరిష్కారం

ప్రమాదకరమైన 'స్కై గ్లో'ను తగ్గించే దిశగా నిపుణులు పరిశోధనలు ముమ్మరం చేశారు. ఇప్పటికే కొన్ని దేశాలు డార్క్‌ స్కై లైటింగ్‌ను ప్రవేశపెట్టాయి. అమెరికాలోని పిట్స్‌బర్గ్‌ నగరంలో 'డార్క్‌ స్కై లైటింగ్‌' అమల్లో ఉంది. అంటే మిరుమిట్లు గొలిపే కాంతిని కాకుండా తక్కువ కాంతిని వెదజల్లే లైట్లను అమరుస్తున్నారు. ఇక ఆస్ట్రేలియా అవకాశం ఉన్నంతవరకు రాత్రి వేళల్లో సహజసిద్ధమైన చీకటి ఉండేలా చూస్తోంది. ఎత్తైన భవనాలకు ముదురు రంగులు వేస్తోంది. దాంతో కాంతి పరావర్తనం చెందదు కాబట్టి వలస పక్షులకు ఇబ్బంది ఉండదు.

సెస్సులు, సర్‌చార్జీల్లో రాష్ట్రాలకు వాటా లేదు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర ఆర్థికమంత్రి జవాబు

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

రాజ్యసభ

సాక్షి, న్యూఢిల్లీ: నిర్దిష్ట ప్రయోజనాల కోసం కేంద్రం వసూలు చేసే సెస్సులు, పన్నులపై విధించే సర్‌చార్జీలు ఇతర సుంకాల్లో రాష్ట్రాలకు వాటా ఉండబోదని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ స్పష్టం చేశారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. సెస్సులు, సర్‌చార్జీలు ఇతర సుంకాల పేరిట వసూలు చేసే మొత్తాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే వినియోగిస్తుందని తెలిపారు. 2014-15లో సెస్సుల కింద కేంద్రం వసూలు చేసిన మొత్తం రూ.82,914 కోట్లుకాగా.. 2021-22లో సెస్సుల రూపంలో వసూలైన మొత్తం రూ.3.52 లక్షల కోట్లని చెప్పారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. కేంద్రం వసూలు చేసే పన్నుల్లో 41 శాతం రాష్ట్రాలకు పంపిణీ చేయాలని 15వ ఆర్థికసంఘం సిఫార్సు చేసిందని తెలిపారు. రాష్ట్ర జనాభా సంఖ్యకు 15 శాతం, భౌగోళిక విస్తీర్ణానికి 15 శాతం, అటవీ, పర్యావరణానికి 10 శాతం, ఆదాయ వనరులకు 45 శాతం చొప్పున వెయిటేజి ఇచ్చిందని, ఈ ప్రాతిపదికపైనే కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను నిర్ణయించాలని ఆర్థికసంఘం సిఫార్సు చేసిందని వివరించారు. ఈ ప్రాతిపదిక ప్రకారం పన్నుల పంపిణీలో బిహార్‌ 10 శాతం, ఉత్తరప్రదేశ్‌ 17 శాతం, మధ్యప్రదేశ్‌ 7 శాతం చొప్పున పొందగా ఆంధ్రప్రదేశ్‌ 4 శాతానికి మాత్రమే పరిమితమైందని తెలిపారు. 15వ ఆర్థికసంఘం సిఫార్సులను అనుసరించి కేంద్రపన్నుల పంపిణీలో ఆంధ్రప్రదేశ్‌కు 2020-21లో రూ.24,460 కోట్లు, 2021-22లో రూ.35,385 కోట్లు 2022-23లో సవరించిన అంచనాల మేరకు రూ.38.176 కోట్లు లభించాయని చెప్పారు. 2023-24 బడ్జెట్‌ అంచనాల మేరకు కేంద్ర పన్నుల్లో ఆంధ్రప్రదేశ్‌ వాటా కింద రూ.41,338 కోట్లు పంపిణీ చేయబోతున్నట్లు తెలిపారు.

ఏపీలో 16,400 కోట్లతో 5 సోలార్‌ పార్కులు

సోలార్‌ పార్కుల అభివృద్ధి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 4,100 మెగావాట్ల సామర్థ్యంతో 5 సోలార్‌ పార్కులు మంజూరు చేసినట్లు కేంద్ర పునరుత్పాదక శక్తి, విద్యుత్‌శాఖల మంత్రి ఆర్‌.కె.సింగ్‌ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. అనంతపురంలో రెండు, కర్నూలు, వైఎస్సార్‌ జిల్లాల్లో ఒక్కో సోలార్‌ పార్కు, రామగిరిలో సోలార్‌ విండ్‌ హైబ్రిడ్‌ పార్కుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం కింద రూ.590.80 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతపురంలో 1400 మెగావాట్ల సోలార్‌ పార్కు-1, కర్నూలులో వెయ్యి మెగావాట్ల సోలార్‌ పార్కు స్థాపిత సామర్థ్యం మేరకు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, వైఎస్సార్‌లో వెయ్యి మెగావాట్ల సామర్థ్యానికిగాను 250 మెగావాట్లు, అనంతపురంలోని గగరెండో సోలార్‌పార్కు 500 మెగావాట్ల సామర్థ్యానికిగాను 400 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తున్నట్లు వివరించారు. రామగిరిలో 200 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్‌ విండ్‌ హైబ్రిడ్‌ పార్కును ప్రారంభించాల్సి ఉందన్నారు. సోలార్‌ పార్కులో ఒక మెగావాట్‌ విద్యుత్‌ సామర్థ్యానికి సరాసరి రూ.4 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. మొత్తం 4100 మెగావాట్ల సామర్థ్యంగల 5 పార్కులకు సుమారు రూ.16,400 కోట్లు వ్యయం అవుతుందని చెప్పారు.

276 పీఎంకేఎస్‌కేలు

ఆంధ్రప్రదేశ్‌లో 276 ప్రధానమంత్రి కిసాన్‌ సమృద్ధి కేంద్రాలు (పీఎంకేఎస్‌కేలు) ఉన్నాయని కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయమంత్రి భగవంత్‌ కుబా.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

4,350 హెక్టార్లలో ఔషధ మొక్కల

ఆంధ్రప్రదేశ్‌లో 4,350 హెక్టార్లలో ఔషధ మొక్కల పెంపునకు నేషనల్‌ ఆయుష్‌ మిషన్‌ ద్వారా మద్దతు ఇస్తున్నట్లు ఆయుష్‌శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో నూతన ఫెర్టిలైజర్‌ ప్లాంటు ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఫెర్టిలైజర్‌ ప్లాంటు పెట్టే ప్రతిపాదన లేదని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి భగవంత్‌ కుబా.. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

కేంద్రం నిర్ధారించిన మేరకే ఏపీకి అప్పులున్నాయి

టీడీపీ ఎంపీ కనకమేడల ప్రశ్నకు జవాబిచ్చిన మంత్రి

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన మేరకే ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రానికి అప్పులున్నాయని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌ చౌదరి స్పష్టం చేశారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్‌ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే నెట్‌ బారోయింగ్‌ సీలింగ్‌ లిమిట్‌ ఫిక్స్‌ చేస్తారని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఏపీ ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం అమలులో ఉందని చెప్పారు. ఎఫ్‌ఆర్‌బీఎంను రాష్ట్ర అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పార్లమెంట్‌ సాక్షిగా.. ఆంధ్రప్రదేశ్‌ అప్పులు పరిమితి మేరకే ఉన్నాయని వివిధ సందర్భాల్లో స్పష్టం చేస్తూ వస్తోంది. అయినా టీడీపీ ఎంపీలు మళ్లీమళ్లీ అదే ప్రశ్న వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వాస్తవ సమాచారాన్ని వారిముందు ఉంచుతోంది. టీడీపీ ఎంపీలు ఆశించిన సమాధానం రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇలా అధికారికంగా అప్పుల సమాచారం ఇస్తున్నా.. ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం భారీగా అప్పులు చేసిందని టీడీపీ, ఎల్లో మీడియా విషప్రచారం చేస్తున్నాయి. అదే విషప్రచారాన్ని మళ్లీమళ్లీ చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వం మీద బురదజల్లడానికి టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు విశ్వసించరని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఏపీ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలు

సంవత్సరం	అప్పు (రూ.కోట్లలో)
2019	2,64,451
2020	3,07,671
2021	3,53,021
2022 (సవరించిన)	3,93,718
2023 (బడ్జెట్‌ అంచనాలు)	4,42,442

లోక్‌సభ

ప్రత్యేకహోదా పదేళ్లు ఇవ్వాలి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ తలారి రంగయ్య డిమాండ్‌

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా పదేళ్లు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ తలారి రంగయ్య డిమాండ్‌ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో అంశాలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే చట్టంలో ద్వంద్వ ప్రమాణాలు ఎందుకని ప్రశ్నించారు. ఆయన మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రసంగించారు. గిరిజన మహిళ రాష్ట్రపతి కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల ప్రత్యేకహోదా ఇస్తే రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడతాయని చెప్పారు. వందల ఏళ్ల నుంచి అన్యాయానికి గురవుతున్న వాల్మీకి బోయల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. మాదాసి కురవ, వడ్డెర్లు, రజకుల్ని కూడా ఎస్టీల్లో చేర్చాలని కోరారు. 1857 నుంచి పలు చట్టాల ద్వారా వాల్మీకి బోయలకు అన్యాయం జరిగిందన్నారు. క్రిమినల్‌ ట్రైబ్స్‌లో ఉన్న పలు జాతుల్ని ఎస్టీల్లో చేర్చినా వాల్మీకి బోయల్ని మాత్రం విస్మరించారన్నారు. ప్రస్తుత గిరిజనులకు నష్టం జరగకుండా వాల్మీకి బోయలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కొంతకాలం ఎస్టీలుగా గుర్తించి మళ్లీ తీసేశారని, ఆ వివరాలపై ఎక్కడా రికార్డులు కూడా లేవని తెలిపారు. తొలి లోక్‌సభ నుంచి ప్రస్తుత లోక్‌సభ వరకు ప్రతిసారీ ఈ జాతి గురించి పార్లమెంటులో ప్రస్తావిస్తున్నారంటే దాని ప్రాధాన్యం గుర్తించాలని కోరారు.

జల్లికట్టులో అపశ్రుతి

ఒకరి మృతి..నలుగురికి తీవ్రగాయాలు

వి.కోట: చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో జరిగిన జల్లికట్టులో అపశ్రుతి జరిగి ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని ఎర్రినాగేపల్లిలో మంగళవారం జల్లికట్టు నిర్వహించారు. ఎద్దును నిలువరించే క్రమంలో మోర్నపల్లికి చెందిన శీనప్ప (54) తీవ్రంగా గాయపడ్డాడు. అతనితోపాటు మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి శీనప్ప మృతి చెందినట్లు చెప్పారు. మిగిలిన వారికి చికిత్స అందిస్తున్నారు. శీనప్పకు ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పలమనేరుకు తరలించారు.

అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యం

టీటీడీ చైర్మన్‌, పార్టీ రీజినల్‌ కో-ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీటీడీ చైర్మన్‌, పార్టీ రీజనల్‌ కో-ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మంగళవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఏ రాష్ట్ర చరిత్రలో లేనివిధంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అవినీతికి తావులేకుండా అమలు చేశామన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. విజయనగరం జిల్లా వంగర మండలం సంగాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ టీడీపీ సర్పంచ్‌ బోద్రోతు శ్రీనివాసరావు కుమార్తె శైలజకు జగనన్న విదేశీ విద్యాదీవెన కింద తొలి విడతలో రూ.13,99,154 ప్రభుత్వం జమ చేసిందని, మొత్తం ప్రభుత్వం రూ.84 లక్షలు ఆ విద్యార్థినికి విదేశీ విద్యాదీవెన కింద అందించనుందని తెలిపారు. ప్రతి జిల్లాలో విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుందన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌, నియోజకవర్గ పరిశీలకులు ఎస్‌ఏ రెహమాన్‌ పాల్గొన్నారు.

గుడ్డుపై 'కమింగ్‌' పిడుగు

- కోళ్ల రైతుల ఆశలు ఆవిరి
- పతనమవుతున్న ధర
- పౌల్ట్రీని సంక్షోభంలోకి నెట్టేస్తున్న కమింగ్‌ రేటు
- రెండు వారాల్లో రైతు ధర రూ.1.25 పతనం



మండపేట: సీజన్‌లో పాత నష్టాలు గట్టెక్కిస్తుందనుకున్న గుడ్డు రైతు ధర అంతలోనే ఆవిరైంది. రెండు వారాల వ్యవధిలో రూ.1.25 పతనమై కోళ్ల రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. మరోపక్క మేత ధరలు పెరిగిపోతుండగా రానున్న వేసవితో పరిశ్రమకు గడ్డుకాలం తప్పదని పౌల్ట్రీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమింగ్‌ పేరిట దళారుల దోపిడీ రైతుధర పతనానికి కారణమని వారంటున్నారు.

ఊహించని విధంగా తగ్గిన ధర

శీతల ప్రభావం, విదేశాలకు గుడ్ల ఎగుమతులు నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పశ్చిమబెంగాల్‌, ఒడిశా, బిహార్‌ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు పెరిగి గత నెలలో రైతు ధర పుంజుకుంటూ వచ్చింది. జనవరి 19న రూ.5.67కు చేరి పౌల్ట్రీ చరిత్రలో అత్యధిక రైతు ధరను నమోదు చేసుకుంది. ఎగుమతులకు డిమాండ్‌ ఉండటంతో మరికొంతకాలం పాటు రైతు ధర తగ్గకుండా నిలకడగా ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు భావించాయి. మేత ధరలు, తెగుళ్ల బెడద, నిర్వహణ వ్యయంతో గుడ్డు ధర గిట్టుబాటవ్వక గత కొన్నేళ్లుగా పరిశ్రమను వెంటాడుతున్న పాత నష్టాలు ప్రస్తుత ధరతో కొంత మేర భర్తీ అవుతాయని ఆశించారు. ఊహించని విధంగా ధర తగ్గుముఖం పట్టి రెండు వారాల వ్యవధిలోనే రూ.1.25 పతనమై ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు చేరుకుంది.

కమింగ్‌ రేటు పేరిట దళారుల దోపిడీ

రైతు ధర ఆశాజనకంగా ఉన్న తరుణంలో తణుకు, కోల్‌కతా, హైదరాబాద్‌ తదితర ప్రాంతాల్లోని కొందరు దళారులు కుమ్మక్కై కమింగ్‌ రేటు పేరిట దోపిడీకి తెరలేపారని పౌల్ట్రీవర్గాలంటున్నాయి. ఎగుమతుల డిమాండ్‌ను బట్టి ఒక రోజుకు లేదా రెండు మూడు రోజులకు, ఒక్కోసారి వారం పదిరోజులకు నెక్‌ రేటు మారుతుంటుంది. సాధారణంగా ఏ రోజు గుడ్లు ఎగుమతి చేస్తే ఆ రోజు ఉన్న ధరను వ్యాపారులు కోళ్ల రైతుకి చెల్లించాలి. అయితే గుడ్ల మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకున్న వ్యాపారులు సిండికేటై ఎగుమతులకు డిమాండ్‌ లేదని, కమింగ్‌ రేటు (ప్రస్తుతం ఉన్న ధర కాకుండా తర్వాత వచ్చే నెక్‌ ధరకు గుడ్లు కొనుగోలు చేస్తారు. నెక్‌ రేటు తగ్గితే ఎన్నిరోజులు అయితే అన్ని రోజులకు తగ్గిన ధరను చెల్లిస్తారు) సంప్రదాయానికి తెర లేపారంటున్నారు. ఈ క్రమంలోనే గత నెలలో ఆశాజనకంగా ఉన్న ధర ఒక్కసారిగా పతనమైందని కోళ్ల రైతులు అంటున్నారు. ధర మరింత తగ్గిపోతుందన్న ఆందోళనలో కోళ్ల రైతులు కమింగ్‌ రేటుకు తలొగ్గుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు లాభాలకు అమ్ముకుని కోళ్ల రైతులకు తగ్గిన రేటును చెల్లిస్తున్నారు. కమింగ్‌ రేటు పేరిట దళారుల దోపిడీని అరికట్టేందుకు ఏపీ పౌల్ట్రీ అసోసియేషన్‌ రాష్ట్ర చైర్మన్‌ కర్రి వెంకట ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, అసోసియేషన్‌ నాయకులు చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం మూడు జిల్లాల కోళ్ల రైతులు సమావేశమై సమస్యపై చర్చించారు. దళారుల దోపిడీని నిరసిస్తూ దేవరపల్లి హైవే జంక్షన్‌ వద్ద పౌల్ట్రీ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యయప్రయాసలకోర్చి పౌల్ట్రీలు నిర్వహిస్తుంటే కమింగ్‌ పేరిట తమ కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారని వారు మండిపడుతున్నారు.

ముందున్న వేసవితో మరిన్ని కష్టాలు

ఇప్పటికే గుడ్డు ధర పతనం, మేత ధరలు దిగిరాక దిక్కుతోచని స్థితిలో ఉన్న కోళ్ల రైతులకు ముందున్న వేసవి మరింత గుబులు పుట్టిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు కోళ్ల మరణాలు పెరిగి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టాలు వాటిల్లుతుంటాయి. పెరిగిన మేతలు, మందుల ధరలు, నిర్వహణ భారంతో గుడ్డు రైతు ధర ఐదు రూపాయలు ఉంటేనేగాని గిట్టుబాటు కాదని కోళ్ల రైతులు అంటున్నారు. ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు పతనం కాగా ఆ మేరకు పరిశ్రమకు నష్టం వాటిల్లుతోంది. త్వరలో వేసవి మొదలుకానుండటంతో ధర మరింత పతనం కానుండగా, కోళ్ల మరణాలతో మున్ముందు గడ్డుకాలం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా దోచేస్తున్నారు



కోళ్ల రైతుల కష్టాన్ని కమింగ్‌ రేటు పేరిట దళారులు దారుణంగా దోచేస్తున్నారు. దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధరను తగ్గించేశారు. ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో కోళ్ల రైతులు ఉన్నారు. పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శి, అర్తమూరు

ఏపీకి 'అమృతకాలం' కావాలి

- రాష్ట్రం నష్టానికి బీజేపీ, కాంగ్రెస్‌లదే బాధ్యత
- ప్రత్యేకహోదా కోసం పోరాడుతూనే ఉంటాం
- ఇచ్చేవరకు విశ్రమించం.. విస్మరించం
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అశాస్త్రీయ విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అమృతకాలం అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అమృతకాలం కేంద్రానికే కాదని, రాష్ట్రాలకు కూడా విస్తరించాలని పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ఆంధ్రప్రదేశ్‌ ప్రజలు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. ప్రత్యేకహోదా హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్‌, బీజేపీ ఉమ్మడిగా విఫలమయ్యాయని చెప్పారు. అశాస్త్రీయ విభజన అనంతరం రాష్ట్రం నష్టపోవడానికి కాంగ్రెస్‌, బీజేపీ రెండుపార్టీలది బాధ్యతన్నారు. 2014లో లోక్‌సభలో తలుపులు మూసేసి విభజన బిల్లుకు ఆమోదముద్ర వేశారన్నారు. ఈ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు అయిదేళ్లపాటు ప్రత్యేకహోదా కల్పిస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ హామీ ఇస్తే ప్రతిపక్షంలో ఉన్న వెంకయ్యనాయుడు హోదా అయిదేళ్లు కాదు.. పదేళ్లు ఇవ్వాలని పట్టుబట్టారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో ప్రధాని అంతటి వ్యక్తి ఇచ్చిన హామీని సైతం అమలు చేయకుండా తుంగలో తొక్కడానికి బీజేపీ ప్రభుత్వం వెనకాడటం లేదని విమర్శించారు. విభజన పేరిట ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారని, ఈరోజు రాష్ట్రం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, సవాళ్లకు బాధ్యత కాంగ్రెస్‌, బీజేపీలదేనని చెప్పారు. పార్టీలు, ప్రభుత్వాలు మారినా ఇచ్చిన హామీ నెరవేర్చే బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. హామీ అమలయ్యేలా చూడాల్సిన అస్యూరెన్స్‌ కమిటీ సైతం చేతులు ముడుచుకుని చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. ప్రత్యేకహోదా విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను మోసం చేసినందుకే కాంగ్రెస్‌, బీజేపీ ఈ రోజున రాష్ట్ర ప్రజలకు ముఖం కూడా చూపించలేనంత దుస్థితిలో ఉన్నాయని చెప్పారు. పార్లమెంట్‌ సాక్షిగా ఇచ్చిన హామీలను చట్టబద్ధం చేస్తూ, అవి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని రాజ్యసభ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని, హోదా ఇచ్చేవరకు విశ్రమించేది, విస్మరించేది లేదని స్పష్టం చేశారు. ప్రత్యేకహోదా ఆంధ్రప్రదేశ్‌ హక్కు అని పేర్కొన్నారు.

మూడు రాజధానుల ప్రణాళిక

వికేంద్రీకరణతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి కావాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం వినూత్నంగా తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రణాళిక సర్వదా జనామోదం పొందిందని తెలిపారు. దురదృష్టవశాత్తు న్యాయవ్యవస్థ తీసుకున్న నిర్ణయం కారణంగా వికేంద్రీకరణ ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందలేదన్నారు. మూడు రాజధానుల ప్రణాళికకు చట్టబద్ధత ఏ విధంగా ఉందో వివరిస్తూ.. మొదటగా పాలనాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 154 (రెడ్‌ విత్‌ ఆర్టికల్‌ 163) స్పష్టం చేస్తోందని చెప్పారు. రాజధాని ఏ నగరంలో ఉండాలన్నది నిర్ణయించేది పాలనాధికారం మాత్రమేనన్నారు. రాజ్యాంగం ఆదేశిక సూత్రాలను అనుసరించి ఆర్టికల్‌ 38 ప్రకారం ప్రాంతీయ అసమానతలను తొలగించాలని చెప్పారు. మూడు రాజధానుల ద్వారా పాలనను వికేంద్రీకరించే చర్య ఆ దిశగా తీసుకున్న నిర్ణయమేనన్నారు. లోక్‌సభలో 2020 ఫిబ్రవరి 4న హోంశాఖ మంత్రి ఒక ప్రశ్నకు ఇచ్చిన జవాబు ప్రకారం.. ఒక రాష్ట్ర పరిధిలో రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించే అధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్రం స్పష్టం చేసిదని, అంటే మూడు రాజధానుల ప్రణాళికకు కేంద్రం కూడా ఆమోదం తెలిపిందని చెప్పారు.

విశాఖకు మెట్రోరైల్‌ ప్రాజెక్టు కేటాయించాలి

41 లక్షల జనాభా కలిగిన విశాఖపట్నంలో 76 కిలోమీటర్ల మేర మెట్రోరైల్‌ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మెట్రోరైల్‌ పాలసీ-2017కి అనుగుణంగా డీపీఆర్‌ చేయించి పంపించినా ఇప్పటివరకు ఆమోదం తెలపలేదని చెప్పారు. విశాఖ మెట్రోరైల్‌ ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలపాలని కోరారు.

బీసీలకు జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కావాలి

దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లవుతున్నా వెనకబడిన తరగతులు (బీసీలు) అన్ని రంగాల్లో సమాన అవకాశాలు, ఆర్థిక, సామాజిక అభ్యున్నతి సాధించలేకపోయాయని చెప్పారు. దేశ జనాభాలో 50 శాతం పైబడే ఉన్నప్పటికీ 27 శాతం రిజర్వేషన్లకే బీసీలు పరిమితం అయ్యారని, బీసీలకు వారి జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీల జనాభాకు సంబంధించి సరైన సమాచారం అందుబాటులో లేనందున వారి జనాభాకు తగినట్లుగా సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా చట్టసభల్లో కూడా బీసీలకు వారి జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం

దేశంలో నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతోందని విజయసాయి రెడ్డి తెలిపారు. పనిచేసే వయసు ఉన్న జనాభాకు, శ్రామికరంగంలో ఉన్న జనాభాకు మధ్య చాలా తేడా కనిపిస్తోందని పేర్కొన్నారు. పనిచేసే వయసు కలిగినవారి జనాభా 65 శాతం ఉంటే.. ఉపాధి పొందుతున్న శ్రామికులు 42 శాతం మాత్రమే ఉన్నారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

అందమైన రాతలో ఆంధ్రాదే పైచేయి

జాతీయ స్థాయి చేతి రాత పోటీల్లో ఏపీకి మొదటి స్థానం

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా జనవరి 29న నిర్వహించిన దేశవ్యాప్త చేతిరాత పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌ మొదటి స్థానంలో నిలిచిందని ఆలిండియా గ్రాఫాలజీ, హ్యాండ్‌ రైటింగ్‌ అసోసియేషన్‌, ఇండియన్‌ హ్యాండ్‌ రైటింగ్‌ ట్రయినర్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఎస్కే ఎం.హుస్సేన్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన జాతీయ చేతిరాత పోటీల ఫలితాల్లో విజయవాడకు చెందిన 9వ తరగతి విద్యార్థి సేనాపతి జివితేష్‌ 'నేషనల్‌ ఓవరాల్‌ చాంపియన్‌'గా నిలిచాడని పేర్కొన్నారు. ఏలూరుకు చెందిన ఆలపాటి ప్రహర్షిక 'నేషనల్‌ ఎక్సలెన్సీ బెస్ట్‌ హ్యాండ్‌ రైటింగ్‌' అవార్డు దక్కించుకున్నట్లు తెలిపారు. విజయవాడకే చెందిన అవ్యక్తా ప్రద్యుమ్న పూజారికి 'మిస్‌ ఇండియా బెస్ట్‌ హ్యాండ్‌ రైటింగ్‌' అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మొత్తం ఎనిమిది రకాల ఉత్తమ అవార్డులందిస్తుంటారని, అందులో నేషనల్‌ ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌తో పాటు మరో రెండు అవార్డులు ఏపీకి రావడం విశేషమని పేర్కొన్నారు. ఇంతకు ముందు 2019లో నిర్వహించిన జాతీయస్థాయి చేతిరాత పోటీల్లో ఏపీ 18వ స్థానంలో ఉండగా, ఈ సారి మొదటిస్థానంలో నిలిచిందని తెలిపారు.

రేపటి నుంచి ఏపీ ఆర్‌సెట్‌ తుది దశ కౌన్సెలింగ్‌

ఏయూ క్యాంపస్‌: రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌డీ ఫుల్‌ టైం, పార్ట్‌ టైం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్‌ 2022 ప్రవేశ పరీక్ష తుది దశ కౌన్సెలింగ్‌ ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కన్వీనర్‌ ఆచార్య డి.అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌, వెబ్‌ కౌన్సెలింగ్‌, సర్టిఫికెట్ల అప్‌లోడ్‌ ఉంటుందని పేర్కొన్నారు. 10 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన, 13 నుంచి 15వ తేదీ వరకు అభ్యర్థులకు వెబ్‌ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 15న వెబ్‌ ఆప్షన్లలో చేర్పులు, మార్పులు, 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా సంబంధిత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో రిపోర్టింగ్‌ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943